శనివారం
11-1-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 111
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ట్రంప్‌నకు అన్‌కండిషనల్ డిశ్చార్జ్

న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్‌నకు సంబంధించిన హష్ మనీ కేసులో న్యాయస్థానం తీర్పు వెలువరించింది. ఆయనకు అన్‌కండిషనల్ డిశ్చార్జ్ విధిస్తున్నట్లు ప్రకటించింది. ఈ కేసులో ట్రంప్ దోషిగా తేలినప్పటికీ... ఎటువంటి జైలు శిక్ష, జరిమానా ఎదుర్కోనవసరం లేదు. దీంతో దోషిగా నిర్ధారణ అయిన తొలి అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ నిలవనున్నారు. ఈ నెల 20న అమెరికా నూతన అధ్యక్షుడుగా డొనాల్డ్ ట్రంప్ మరోసారి బాధ్యతలు స్వీకరించనున్న విషయం తెలిసిందే.

యూట్యూబర్‌కు 20 ఏళ్ల జైలు

విశాలాంధ్ర- విశాఖపట్నం: విశాఖపట్నం ప్రత్యేక పోక్సో కోర్టు సంచలనాత్మక తీర్పు వెలువరించింది. 14ఏళ్ల బాలికపై లైంగిక దాడి చేసినట్లు వచ్చిన ఆరోపణలు నిజమని తేలడంతో యూట్యూబర్ 'ఫన్ బకెట్' భార్గవ్‌కు 20ఏళ్ల జైలు శిక్ష విధించింది. కేసు వివరాల ప్రకారం... నిందితుడు బాధిత బాలికతో టిక్‌టాక్ వీడియోలు చేస్తూ, ఆమెను బెదిరించి, పదేపదే లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ అమానుష చర్య కారణంగా బాలిక గర్భం దాల్చింది. బాధితురాలి

- మిగతా 2 లో

నాలుగు నెలల్లో 'గాలి' కేసు విచారణ పూర్తి

న్యూఢిల్లీ: ఓబులాపురం గనుల కేసు విచారణను నాలుగు నెలల్లో పూర్తి చేయాలని సీబీఐని సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశించింది. ఈ కేసులో కర్నాటక మాజీమంత్రి గాలి జనార్దన్ రెడ్డి కీలక నిందితుడిగా ఉన్నారు. ఇకపై గడువు పెంచబోయేది లేదని తేల్చి చెప్పింది. వీటి విచారణ 4 నెల్లలో పూర్తి చేయాలని సెప్టెంబరు 30నే సుప్రీం ధర్మాసనం ఆదేశించిన ప్పటికీ విచారణ పూర్తి కాలేదు. దీంతో మరింత గడువు కోరుతూ మరోసారి సర్వోన్నత న్యాయస్థానాన్ని సీబీఐ ఆశ్రయించింది. సీబీఐ అభ్యర్థనపై జస్టిస్ సుందరేశ్

- మిగతా 2 లో

పరువు నష్టం కేసులో రాహుల్‌కు బెయిల్

పూణె: పరువు నష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఊరట లభించింది. ఈ కేసులో పూణె కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. 2023 మార్చిలో లండన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో వీడీ సావర్కర్‌ను ఉద్దేశించి తీవ్ర వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో రాహుల్‌పై సావర్కర్ మనవడు సత్యకి సావర్కర్ పూణెలోని ఓ కోర్టులో పరువు నష్టం దావా దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి తాజా విచారణకు రాహుల్ గాంధీ వీడియో కాన్ఫరెన్స్

- మిగతా 2 లో

ఇదీ లోకం!

ఎట్టకేలకు ఏపీపీఎస్సీ షెడ్యూల్

8 పెండింగ్ విభాగాలకు పరీక్షలు షురూ...

విశాలాంధ్ర కథనానికి స్పందించిన ప్రభుత్వం



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఆంధ్ర ప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) పోటీ పరీక్షల తేదీలను ఎట్టకేలకు ఖరారు చేసింది. గత ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్లు జారీచేయగా, సాంకేతిక కారణాలతో అవి నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా నియమితులైన ఏపీపీఎస్సీ చైర్మన్ అనురాధా వాటిపై దృష్టి కేంద్రీకరించారు. అందులో 8 ప్రభుత్వ శాఖలకు సంబంధించి షెడ్యూలును శుక్రవారం ఏపీపీఎస్సీ కార్యదర్శి ఐ.నరసింహమూర్తి విడుదల చేశారు. ఈనెల 9వ తేదీన విశాలాంధ్ర దినపత్రికలో 'జాబ్ క్యాలెండర్' కోసం నిరీక్షణ అనే కథనంపై ఏపీపీఎస్సీ స్పందించింది. అసిస్టెంట్ డైరెక్టర్ ఏపీ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ సర్వీస్ పోస్టులకు ఏప్రిల్ 28న టౌన్ ప్లానింగ్ పేపర్-1, 29వ తేదీన టౌన్ ప్లానింగ్ పేపర్-2కు పరీక్ష నిర్వహిస్తారు. మెడికల్ అండ్ హెల్త్ లైబ్రేరియన్ పోస్టులకు ఏప్రిల్ 27న సబ్జెక్టు పేపర్, 28న జనరల్ స్టడీస్ పరీక్షలు ఉంటాయి. అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులకు ఏప్రిల్ 28న జనరల్ స్టడీస్, ఏప్రిల్ 30న సబ్జెక్ట్ పేపర్-1,2 ఉంటాయి. అసిస్టెంట్ డైరెక్టర్ వెల్ఫేర్ అండ్ డీజేబుల్స్ ట్రాన్స్‌జెండర్ పోస్టులకు ఏప్రిల్ 27న సబ్జెక్ట్ పేపర్-1, 28న పేపర్-2 నిర్వహిస్తారు. ఏపీ గ్రౌండ్ వాటర్ సర్వీసు అసిస్టెంట్ కెమిస్ట్ పోస్టుకు ఏప్రిల్ 28, 29 తేదీల్లో పరీక్షలు ఉంటాయి. ఏపీ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ సర్వీస్‌లో అసిస్టెంట్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ పోస్టుకు ఏప్రిల్ 28న, ఏపీ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టికల్ సబార్డినేట్ సర్వీస్‌లో ఏఎస్ఓలకు ఏప్రిల్ 28, 29 తేదీల్లో పరీక్షలు ఉంటాయి. ఏపీ ఫిషరీ సర్వీస్‌లో ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ పోస్టుకు ఏప్రిల్ 28, 29 తేదీల్లో పరీక్షలు నిర్వహిస్తారు. ఈ పోటీ పరీక్షలను కంప్యూటర్ బేస్డ్ విధానంలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారు. షెడ్యూలు జారీజేసిన అన్ని పోటీ పరీక్షలకుగాను జనరల్ స్టడీస్ అండ్ మెంటల్ ఎబిలిటీ (జీఎస్, ఎంఏ) పేపర్‌ను ఏప్రిల్ 28న ఉమ్మడిగా నిర్వహిస్తారు. వాటితో పాటు గత ప్రభుత్వ హయాంలో దాదాపు 21 విభాగాల నోటిఫికేషన్లు నిలిచిపోగా, అందులో ప్రస్తుతం ఎనిమిది విభాగాలకు నోటిఫికేషన్లు జారీజేశారు. మొత్తంగా కొత్త, పాత నోటిఫికేషన్లు కలిపి 2,686 పోస్టులకు రాత పరీక్షల నిర్వహణ, నోటిఫికేషన్లు ఇవ్వాల్సి ఉంది. ఇందులో 8 విభాగాలకు సంబంధించిన పోస్టులకు రాత పరీక్షల షెడ్యూలు రాగా, మిగిలిన పెండింగ్ నోటిఫికేషన్లు 13కు పరీక్షల షెడ్యూల్‌ను, వాటితో పాటు కొత్త పోస్టులకు నోటిఫికేషన్లు జారీ చేసేందుకు ఏపీపీఎస్సీ నిమగ్నమైంది.

రాష్ట్ర పండువగా

కొమురం భీం జయంతి, వర్ధంతి

ఆదివాసీలపై కేసులు ఎత్తివేస్తాం: రేవంత్‌రెడ్డి

విశాలాంధ్ర-హైదరాబాద్: ఆదివాసీ యోధుడు కొమురం భీం జయంతి, వర్థంతిని రాష్ట్ర అధికారిక కార్యక్రమంగా నిర్వహిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ఆదేశించారు. ఆదివాసీ సంఘాలు, నాయకులతో సీఎం శుక్రవారం సచివాలయంలో సమావేశమయ్యారు. రవాణా, సాగు, తాగునీరు, తమపై నమోదైన, నమోదవుతున్న కేసులు, విద్యా, ఉద్యోగ, ఆర్థిక సమస్యలను ఆదివాసీ నాయకులు ముఖ్యమంత్రికి వివరించారు. వివిధ సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపారు. మరికొన్నింటి పరిష్కారానికి సమగ్ర అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి నాలుగు నెలలకు ఒకసారి సమావేశమవుదామని ఆదివాసీ నాయకులకు చెప్పారు. సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని... ఆందోళనలకు దిగవద్దని సీఎం సూచించారు. ఆందోళనల ఫలితంగా యువకులపై కేసులు నమోదయితే భవిష్యత్‌లో వారు ఉద్యోగ అవకాశాలు కోల్పోతారని తెలిపారు. ఉద్యమాల సమయంలో ఆదివాసీలపై పెట్టిన కేసులు ఎత్తివేస్తామని... అవసరమైతే శాసనసభలో చర్చపెట్టి తీర్మానం ముఖ్యమంత్రి వెల్లడించారు. రాజకీయాలపరంగా ఆదివాసీలకు అన్యాయం జరగకుండా చూస్తామని, సీతక్కను ఆదిలాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగా నియమించామన్నారు.

విద్యార్థులకు ప్రత్యేక స్టడీ సర్కిల్

ఆదివాసీ విద్యార్థుల విద్యా, ఉద్యోగ, ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇందులో భాగంగా వీరి కోసం ప్రత్యేకంగా స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. స్టడీ సర్కిల్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ఆదివాసీ విద్యార్థులందరికీ విదేశీ స్కాలర్‌షిప్‌లు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. గోండీ భాషలో ప్రాథమిక విద్య బోధించడానికి అవసరమైన ప్రణాళికపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని, ఉట్నూరు, భద్రాచలంలోని ట్రైబల్ బీఈడీ కళాశాలల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి అవసరమైన చర్యలు తక్షణమే తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్కిల్ యూనివర్సిటీలో ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని, వసతి కల్పిస్తామని సీఎం తెలిపారు. ఏజెన్సీలోని ఐటీఐలను ఏటీసీలుగా మార్చుతున్నామని, ఆదివాసీ విద్యార్థులు చేరేలా ఆదివాసీ పెద్దలు, విద్యావంతులు ప్రోత్సహించాలని సీఎం సూచించారు.

ఆర్థికాభివృద్ధిపై దృష్టి

ఆదివాసీల ఆర్థికాభివృద్ధికి అండగా నిలుస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేల కోటా కింద ఇచ్చే ఇళ్లతో సంబంధం లేకుండా సీఎం కోటా కింద ప్రత్యేకంగా ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు. నాన్ ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీలకు ఇళ్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. ఆదివాసీ రైతులకు ఉచితంగా సోలార్ మోటార్లు (వంద శాతం రాయితీ) అందిస్తామని తెలిపారు. ఇందిర జలప్రభ కింద ఉచితంగా బోర్లు వేసే అంశంపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని సూచించారు. గూడేల్లో తాగు నీటి సమస్య

- మిగతా 2 లో

భాగ్యనగరాన్ని కాలుష్యరహితంగా మారుస్తాం

ఆటో మొబైల్ రంగంపై ప్రత్యేక దృష్టి

విశాలాంధ్ర - హైదరాబాద్: భాగ్యనగరాన్ని కాలుష్య రహితంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సీఐఐ జాతీయ కౌన్సిల్ సమావేశం శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించారు. సీఐఐ ప్రతినిధులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ... కాలుష్యకారక వాహనాలను అవుటర్ రింగ్ రోడ్డు అవతలికి తరలిస్తున్నామన్నారు. స్వయం సహాయక సంఘాల్లో 67 లక్షల మంది మహిళలు సభ్యులుగా ఉన్నారని, ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయా సంఘాలతో క్యాంటీన్లు

- మిగతా 2 లో

జేఈఈ అడ్వాన్స్‌డ్ మూడోసారి కుదరదు

సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: ఐఐటీల్లో బీటెక్, బీఆర్క్ సీట్ల భర్తీకి నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్-2025 మూడుసార్లు రాసుకోవచ్చని ప్రకటించి... ఆ తర్వాత రెండుసార్లకే పరిమితం చేయడంపై కొంతమంది విద్యార్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారంపై శుక్రవారం విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను రెండుసార్లు రాసేలా జేఏబీ తీసుకున్న నిర్ణయంలో జోక్యం చేసుకోలేమని పేర్కొంది. అలాగే, ఐఐటీ కాన్పూర్ ప్రకటన నేపథ్యంలో 2024 నవంబర్ 5-18 తేదీల మధ్య కాలంలో తమ కోర్సుల నుంచి డ్రాప్ అవుట్ అయిన విద్యార్థులకు ఉపశమనం కలిగించింది. జేఈఈ అడ్వాన్స్‌డ్ 2025 పరీక్షకు వారు రిజిస్టర్ చేసుకొనేందుకు అవకాశం కల్పించింది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌ను మూడుసార్లు రాసే అవకాశం కల్పిస్తున్నట్లు

- మిగతా 2 లో

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు మోక్షం కల్పించండి

కూనంనేని

విశాలాంధ్ర- హైదరాబాద్ : ఎల్‌ఆర్‌ఎస్ పథకం కింద ప్రజలు సమర్పించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. తమ ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం మధ్యతరగతి, పేద ప్రజలు లక్షల సంఖ్యలో ఎల్‌ఆర్‌ఎస్ కింద దరఖాస్తు చేసుకున్నారని, ఏళ్ల తరబడి అవి పెండింగ్ లోనే ఉన్నాయని అన్నారు. దరఖాస్తులను పరిష్కరించడం ద్వారా ప్రజలకు ఊరట కలగడమే కాకుండా ప్రభుత్వానికి కూడా ఆదాయం సమకూరుతుందన్నారు. ప్రభుత్వ భూముల్లో ఇంటి స్థలాలను, వ్యవసాయ భూముల్లో ప్లాట్లుగా చేసిన స్థలాలను కూడా క్రమబద్ధీకరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఎల్‌ఆర్‌ఎస్ కింద దరఖాస్తులు చేసుకొని ఐదారు సంవత్సరాలు దాటిందని ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరితగతిన స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పరిష్కరించాలని సూచించారు.

కాలు దువ్వుతున్న

పందెంకోళ్లు!

- హైటెక్ బరులు సిద్ధం
- ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు
- హోటల్ గదులు ఫుల్
- ఆన్‌లైన్ బెట్టింగులకూ రె'ఢీ'
- రంగంలోకి రాజకీయ నేతలు
- సోషల్ మీడియా ప్రచారం షురూ

పుంజు రాజాలు పోరాటాలకు కాలు దువ్వుతున్నాయి. సంక్రాంతికి తమ బొబ్బిలి పౌరుషాన్ని ప్రదర్శించేందుకు సిద్ధమౌతున్నాయి. ప్రత్యర్థి పుంజులను మట్టి కరిపించేందుకు క్షణాలను లెక్కిస్తున్నాయి. బరుల్లోకి ఎప్పుడు దూకాలా అని ఎదురుచూస్తున్నాయి. మరోవైపు రాజకీయ నేతల అండతో నిర్వాహకులు బరులు సిద్ధం చేశారు. హైటెక్ హంగులతో తీర్చిదిద్దుతున్నారు. ఫ్లడ్‌లైట్లు, ఎల్ఈడీ స్క్రీన్‌లు, డిజిటల్ చెల్లింపులకు తెరతీశారు. కోడిపందేల కాలాన్ని సైతం మార్చివేసి పగలూ రాత్రి అన్న తేడా లేకుండా పోటీలు నిర్వహించేందుకు సమాయత్తమయ్యారు. సోషల్ మీడియాలో ప్రచారాన్ని షురు చేశారు. జిల్లాస్థాయి అధికారులు హెచ్చరికలు జారీచేసినా బేఖాతరు చేస్తూ సర్వం సిద్ధం చేశారు. పోలీసు అధికారులను ఒప్పించేయత్నాలు చేస్తున్నారు. పాలకులు ఎవరైనా అనాదిగా వస్తున్న సంక్రాంతి సంస్కృతికి పచ్చజెండా ఊపాల్సిందేనన్న పట్టుదలతో ఉన్నారు.

8 లో

బిల్డ్ ఏపీ నినాదంతో ముందుకు...

నిర్మాణరంగాన్ని నిలబెడతాం

నరెడ్కో ప్రాపర్టీ షో ప్రారంభోత్సవంలో చంద్రబాబు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: గత ఐదేళ్ల విధ్వంస పాలనలో పడకేసిన నిర్మాణ రంగాన్ని నిలబెట్టాలన్న ధ్యేయంతో ఉన్నామని, అందుకే బిల్డ్ ఏపీ నినాదంతో ముందుకెళ్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. నిర్మాణ రంగానికి మళ్లీ ఊపు రావాలని కోరుకుంటున్నానని, నిర్మాణ రంగం అభివృద్ధి కోసం ముందుకొచ్చేవారికి ప్రభుత్వం అండగా ఉంటుందని, యుద్ధప్రాతిపదికన సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. 'నిర్మాణ రంగంలో మన రాష్ట్రాన్ని మించిన పాలసీ ఉండదు. వీలైనన్ని నిబంధనలు సరళతరం చేశాం. రాబోయే రెండు నెల్లలో డ్యాష్ బోర్డు తెస్తాం. మీరు తెచ్చిన వినతులను త్వరలోనే పరిష్కరిస్తాం. నిర్దిష్ట సమయానికే అనుమతులు ఇస్తాం... ఇవ్వని అధికారులపై చర్యలు తీసుకుంటాం. మీరు కూడా ఎక్కడా చట్ట వ్యతిరేక పనులకు పాల్పడకుండా ఉండాలి. ఇప్పటిదాకా నిదానించిన నిర్మాణరంగాన్ని నిలబెడుతున్నాం. ఇంకా మీరే నడవాలి... పరిగెత్తాలి. గతాన్ని మర్చిపోండి. నిర్మాణ రంగంలోనూ నూతన ఆవిష్కరణలు వచ్చాయి. వాటిని ఉపయోగించుకుంటే రూ.500 సంపాదించేవాళ్లు రూ.1,500 సంపాదించవచ్చు' అని చంద్రబాబు చెప్పారు. గుంటూరులోని చేబ్రోలు హనుమయ్య మైదానంలో ఏర్పాటు చేసిన నరెడ్కో ప్రాపర్టీ షోను సీఎం

- మిగతా 2 లో

ఒక్క సీఎంను ఎన్నుకుంటే ఆరుగురు ఉచితం!

రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ వ్యంగ్యాస్త్రాలు

విశాలాంధ్ర - హైదరాబాద్: ఒక్క సీఎంను ఎన్నుకుంటే ఇంకో అరడజన్ మంది ఉచితంగా వచ్చారని, ఇది తెలంగాణ ప్రజల అదృష్టమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఈ మేరకు ట్విట్టర్(ఎక్స్)లో ట్వీట్ చేశారు. 1o6 ఆఫర్ సీఎం వ్యవస్థను స్వతంత్ర భారత చరిత్రలో ఎప్పుడూ చూడలేదేమో అని ఆక్షేపించారు. వికారాబాద్ సీఎం తిరుపతి రెడ్డికి ఇవే నా హృదయపూర్వక శుభాకాంక్షలు అని సెటైర్లు గుప్పించారు. సీఎం రేవంత్ రెడ్డికి తనది ఒక చిన్న విన్నపమని, ప్రజాపాలన కాబట్టి ప్రజలకు మీ అనుముల సీఎంలలో ఎవరు కావాలో ఎంచుకునే అవకాశం ఇవ్వాలని కోరుకుంటున్నానని అన్నారు. తెలంగాణలో ఐవీఆర్ఎస్ పద్ధతి పెడితే బాగుంటుందేమో చూడాలని కేటీఆర్ విమర్శించారు.

తొక్కిసలాట... అలజడి

- అధికారుల నిర్లక్ష్యం... నేతలకు అవకాశం
- తిరుపతిలో కొనసాగుతున్న గందరగోళం
- మూడు రోజులుగా నగరానికి నేతల తాకిడి
- బాధితులకు పరామర్శలు
- సాగుతున్న దర్యాప్తు... స్వస్థలాలకు క్షతగాత్రులు

విశాలాంధ్ర-తిరుపతి కార్పొరేషన్: తిరుపతి తొక్కిసలాట ఘటనపై అలజడి కొనసాగుతోంది. తిరుమల వైకుంఠ ద్వారా దర్శనానికి టోకెన్ల పంపిణీ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మృత్యువాత పడటం... పెద్ద సంఖ్యలో భక్తులు గాయపడిన విషాద ఘటన రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశమైంది. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారుల నిర్లక్ష్యం... ప్రభుత్వ అలసత్వంపై భక్తుల నుంచే కాకుండా ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇది ఇప్పుడు రాజకీయ పార్టీల పరస్పర ఆరోపణలకు కేంద్ర బిందువుగా మారింది. రాజకీయ వేడి రాజుకుంది. శ్రీవారం వైకుంఠ ద్వార

- మిగతా 2 లో

ఆంధ్రలో తొలితరం కమ్యూనిస్టులు - 2

పూర్తిగా సాంప్రదాయిక కుటుంబంలో పుట్టినా పురోగమన దృష్టి ఉంటే జనం కోసం పాటు పడేలా, కమ్యూనిస్టుగా మారడంలో అవాంతరం ఏమీ ఉండదు. ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీ తొలి కార్యదర్శి పోలేపెద్ది నరసింహమూర్తి సరిగ్గా అలాంటి వారే. ఆయనను "కామ్రేడ్" అని పిలిచేవారు. ఆయనది ఆదర్శప్రాయమైన జీవితం. పోలేపెద్ది 1931లో శాసనోల్లంఘనోద్యమంలో పాల్గొని జైలుకెళ్లారు. జైలులో "బి" క్లాసు కేటాయించినా కాదని "సి" క్లాసు ఖైదీలతోనే కలిసి గడిపారు.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

అంతరిక్షంలో చైనా సోలార్ ప్రాజెక్టు

బీజింగ్: శాస్త్ర సాంకేతిక రంగంలో చైనా దూసుకుపోతోంది. దేశంలో ఎక్కడికక్కడ ప్రాజెక్టులు నిర్మించి నీటిని నిల్వ చేస్తోంది. అందులో భాగంగానే త్రీగోర్జెస్ డ్యామ్ నిర్మించింది. ఈ ప్రాజెక్ట్‌లో భారీగా నీటిని నిల్వ చేసి... ప్రపంచాన్ని సైతం అబ్బుర పరిచింది. ఈ ప్రాజెక్ట్ కారణంగా చైనా పేరు ప్రఖ్యాతలు ఖండంతరాలను దాటింది. దేశంలో విద్యుత్ వినియోగానికి సౌరశక్తిని సైతం ఒడిసి పట్టాలని నిర్ణయించింది. అందుకోసం చైనా తన వంతు ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ సరికొత్త సోలార్ ప్రాజెక్ట్‌లో భాగంగా భూమికి 32 వేల కిలోమీటర్ల ఎత్తులో భూస్థిర కక్ష్యలో కిలోమీటర్ వెడల్పుతో భారీ సౌరశ్రేణిని ఏర్పాటు చేయనుంది. అదికూడా భూ వాతావరణంలో వచ్చే మార్పులు, రాత్రి పగలుతో సంబంధం లేకుండా నిరంతరం సౌరశక్తిని సేకరించేందుకు వీలుగా దీనిని ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ ఓ కథనాన్ని ప్రచురించింది.

చైనాకు చెందిన ప్రముఖ రాకెట్ సైంటిస్ట్ లాంగ్‌లెహావో దీనిపై స్పందించారు. ప్రస్తుతం తాము ఈ ప్రాజెక్ట్‌పై పని చేస్తున్నామన్నారు. దీనిని భూస్థిరకక్ష్యలోకి తరలించడం అత్యంత కీలకమని చెప్పారు. దీనిని అద్భుతమైన ప్రాజెక్ట్‌గా అభివర్ణించారు. ఈ పద్ధతిలో ఒక ఏడాదిలో ఉత్పత్తయ్యే శక్తి... భూమి లోపలి నుంచి తవ్వి తీసే మొత్తం చమురు నిల్వల నుంచి ఉత్పత్తయ్యే శక్తితో సరి సమానమని తెలిపారు. అంతేకాకుండా ఈ భారీ ప్రాజెక్ట్‌ను త్రీగోర్జెస్ డ్యామ్‌తో పోల్చారు. ప్రపంచంలోనే అతి పెద్ద జలవిద్యుత్ కేంద్రం త్రీగోర్జెస్ డ్యామ్. అంతరిక్షంలో నుంచి కనిపించే అతి తక్కువ నిర్మాణాల్లో ఇది ఒకటి. ఈ డ్యామ్ ద్వారా 22,500 మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. ప్రపంచంలోనే అతి పెద్ద మూడు అణువిద్యుత్ కేంద్రాల ఉత్పత్తికి ఇది సమానం. అయితే ఈ ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ బరువు కారణంగా భూ పరిభ్రమణ వేగం 0.06 మైక్రో సెకన్లు తగ్గిందని గతంలో అమెరికా అంతరిక్ష సంస్థ నాసా తెలిపింది. టిబెట్‌లోని భారత సరిహద్దు సమీపంలో యార్లంగ్ జంగ్పోగా ప్రసిద్ధి పొందిన బ్రహ్మపుత్ర నదిపై ప్రపంచంలోనే అతి పెద్ద డ్యామ్ నిర్మాణానికి చైనా ఇటీవల ఆమోదముద్ర వేసింది. బ్రహ్మపుత్ర నది... భారత్‌లోని ఈశాన్య రాష్ట్రం అరుణాచల్‌ప్రదేశ్‌లోకి ప్రవేశిస్తోంది. ఆ రాష్ట్రంలో ఆ నది ప్రవేశించే ప్రాంతంలో ఈ ప్రాజెక్ట్ నిర్మించాలని నిర్ణయించింది. అందుకోసం రూ.137 బిలియన్ డాలర్లు కేటాయించింది. ఈ డ్యామ్ నిర్మాణం పూర్తయితే... దాని ముందు త్రీగోర్జెస్ ప్రాజెక్ట్ సైతం చిన్న బోనుందని ప్రపంచవ్యాప్తంగా చర్చ సాగుతోంది.

అంతరిక్షం నుంచి కనిపిస్తున్న అగ్నికీలలు

లాస్‌ఏంజెలెస్: లాస్‌ఏంజెలెస్‌లో కార్చిచ్చులు రోజురోజుకు విస్తరిస్తున్నాయి. ఇక్కడి పొగ, మంటలు అంతరిక్షంలోని ఉపగ్రహాలకు సైతం స్పష్టంగా కనిపిస్తున్నాయి. పూర్తిగా కాలిపోయి బూడిదగా మారిన గృహాలతో ఈ ప్రదేశం మరుభూమిని తలపిస్తోంది. తాజాగా మృతుల సంఖ్య 10కి చేరింది. ఈ విషయాన్ని లాస్ ఏంజెలెస్ కౌంటీ మెడికల్ ఎగ్జామినర్ వెల్లడించారు. మృతులను ఇంకా గుర్తించలేదని పేర్కొన్నారు. తాజాగా మాక్సర్ సంస్థ విడుదల చేసిన శాటిలైట్ చిత్రాలు... పాలిసాడ్స్ ఫైర్, ఎటన్ ఫైర్ సృష్టించిన బీభత్సాన్ని కళ్లకు కట్టాయి. దహనమైన ప్రదేశాలను ఫొటోల్లో ప్రత్యేకమైన రంగులో కనిపించేట్లు మ్యాక్స్ సంస్థ ఏర్పాట్లు చేసింది. చెట్లు, చేమలు ఈ చిత్రాల్లో ఎరుపు రంగులో కనిపించగా... నలుపు రంగులో దగ్ధమైన ప్రాంతాలు కనిపిస్తున్నాయి. తుడిచిపెట్టుకుపోయిన నిర్మాణాలు కూడా ఉన్నాయి. పాలిసాడ్స్, ఎటన్ ఫైర్ కలిపి మొత్తం 34 వేల ఎకరాలను కాల్చి బూడిద చేశాయి.

మరోవైపు, కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్ కారణంగానే ఈ స్థాయి నష్టం వాటిల్లిందని ట్రంప్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఒక చిన్న చేపను కాపాడేందుకు దక్షిణ కాలిఫోర్నియాకు నీటి సరఫరాను తగ్గించి తీవ్ర నష్టానికి కారణమయ్యారని ట్రంప్ ఆరోపించారు. న్యూసమ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. తాజాగా ఎలాన్ మస్క్ కూడా ట్రంప్ చేసిన ఆరోపణల్లో వాస్తవం ఉందన్న అర్థం వచ్చేలా... ఓ చేప కోసం నీటి సరఫరాను ఎలా తగ్గించారో వెల్లడించి కొన్ని పోస్టులను... రీపోస్టు చేశారు. 2019లో కాలిఫోర్నియాలో అటవీ నిర్వహణ విషయంలో న్యూసమ్‌ను ట్రంప్ తప్పుపట్టారు. ఆయన తనను కలిసినప్పుడు అటవీ భూముల్లో ఎండిపోయిన ఆకులు వంటివి తొలగించి శుభ్రం చేయించాలని సూచించారు. ఏటా కాలిఫోర్నియాలో కార్చిచ్చులు వ్యాపించడం... ఆయన ఫెడరల్ గవర్నమెంట్ దగ్గరకు నిధుల కోసం రావడం మామూలైపోయిందని విమర్శించారు. ఏటీఎం కార్డు సైజులో ఉండే అరుదైన పప్ ఫిష్ అనే దానిని రక్షించేందుకు కొన్నేళ్ల నుంచి కాలిఫోర్నియాకు నీటి సరఫరాలో కోతవేశారు. దీని సంరక్షణ కారణంగా దాదాపు లక్షల ఎకరాల్లో రైతుల పంటలు ప్రభావితం అవుతున్నాయి. హాలీవుడ్ సైన్ కూడా దగ్ధమైనట్లు ఇంటర్నెట్‌లో ఫొటోలు దర్శనమిస్తున్నాయి. కానీ, ఓ ఆంగ్ల వార్తా సంస్థ ఫ్యాక్ట్ చెక్‌లో మాత్రం ప్రస్తుతానికి దానికి ఏమీ కానట్లు తేలింది. ఈ నెల 8 తేదీన హాలీవుడ్ హిల్స్‌లో మంటలు మొదలయ్యాయి. 9వ తేదీన ఇవి హాలీవుడ్ సైన్ సమీపానికి చేరాయి. కానీ, వీటిని అగ్నిమాపక శాఖ విజయవంతంగా ఆర్పివేసింది. ప్రస్తుతానికి అది బాగానే ఉందని హాలీవుడ్ సైన్ ట్రస్ట్ చైర్మన్ జెఫ్ జర్రీనామ్ వెల్లడించారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ మూడోసారి కుదరదు

(మొదటిపేజీ తరువాయి)

నవంబర్ 5న ఐఐటీ కాన్పూర్ నిర్ణయించింది. ఆ తర్వాత 18వ తేదీన జాయింట్ అడ్మిషన్ బోర్డు (జేఏబీ) యూటర్న్ తీసుకోవడంతో కొంతమంది అభ్యర్థులు నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థుల అర్హత ప్రమాణాల్లో చేసిన ఆకస్మిక మార్పులు పిటిషనర్లతో పాటు ఇలాంటి వేలాది మంది విద్యార్థులు ఐఐటీల్లో ప్రవేశించేందుకు విలువైన అవకాశాన్ని ప్రభావితం చేస్తాయని సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ నిర్ణయం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని తెలిపారు. ఐఐటీల్లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశానికి 2013 నుంచి జేఈఈ అడ్వాన్స్‌డ్ పేరిట పరీక్ష నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దానికి ఇంటర్ పాసైన సంవత్సరంతో పాటు ఆ తర్వాత ఏడాది... అంటే వరుసగా రెండుసార్లు మాత్రమే హాజరు కావొచ్చు. దాన్ని మూడుసార్లకు పెంచుతూ జేఈఈ అడ్వాన్స్‌డ్ నిర్వహణ బాధ్యత తీసుకున్న ఐఐటీ కాన్పూర్ గతేడాది నవంబర్ 5వ తేదీన ప్రకటించింది. పట్టుమని 15 రోజులు కాకముందే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది. దీంతో గతంలో మాదిరిగానే రెండుసార్లు మాత్రమే ఈ పరీక్ష రాసుకోవచ్చు. వచ్చే మే నెలలో జరిగే అడ్వాన్స్‌డ్ పరీక్షకు 2024 మార్చి, 2025 మార్చిలో జరిగే ఇంటర్ లేదా తత్సమానమైన పరీక్షల్లో పాసైనవారు మాత్రమే అర్హులు. అంతకంటే ముందు ఉత్తీర్ణులైనవారికి అవకాశం ఉండదు.

నాలుగు నెలల్లో 'గాలి' కేసు విచారణ పూర్తి

(మొదటిపేజీ తరువాయి)

నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. గాలి సోదరుల కేసుల విచారణలో తీవ్ర జాప్యంపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. కేసుల విచారణకు మరో నాలుగు నెలలు గడువు పొడిగించింది. ఇదే చివరి గడువు అని, ఇకపై పెంచబోయేది లేదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది.

పరువు నష్టం కేసులో రాహుల్‌కు బెయిల్

(మొదటిపేజీ తరువాయి)

ద్వారా హాజరయ్యారు. దీంతో ఆయనకు రూ.25వేల పూచీకత్తు బాండ్‌పై ఎంపీ/ఎమ్మెల్యే న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. రాహుల్ గాంధీకి పూచీకత్తుగా కాంగ్రెస్ సీనియర్ నేత మోహన్ కోర్టు ముందు హాజరయ్యారు. ఈ కేసులో రాహుల్ హాజరు విషయంలో న్యాయస్థానం శాశ్వత మినహాయింపు కల్పించిందని ఆయన తరఫు న్యాయవాది మిలింద్ పవార్ వెల్లడించారు. తదుపరి విచారణ ఫిబ్రవరి 18కి వాయిదా పడినట్లు తెలిపారు.

యూట్యూబర్‌కు 20 ఏళ్ల జైలు

(మొదటిపేజీ తరువాయి)

ఫిర్యాదు మేరకు పెందుర్తి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. విశాఖ నగర మహిళా పోలీస్‌స్టేషన్ ఏసీపీ డాక్టర్ జి.ప్రేమ్ కాజల్ అధ్వర్యంలో పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహించారు.

ఛార్జ్‌షీట్‌తో పాటు సాక్ష్యాలను కోర్టులో సమర్పించారు. కేసు పూర్వాపరాలు, సాక్ష్యాలను పరిశీలించిన విశాఖపట్నం ప్రత్యేక పోక్సో న్యాయస్థానం నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధించడంతో పాటు బాధిత బాలికకు నష్టపరిహారంగా రూ.4 లక్షలు చెల్లించాలని ఆదేశించింది.

బిల్డ్ ఏపీ నినాదంతో ముందుకు...

(మొదటిపేజీ తరువాయి)

చంద్రబాబు శుక్రవారం ప్రారంభించారు. అనంతరం బిల్డర్లను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఏడు నెలల క్రితం వరకూ నిర్వీర్యమైన రాష్ట్రాన్ని చూశామని, నిర్మాణ రంగమైతే ఐదేళ్లు అడ్రస్ లేకుండా పోయిందని చంద్రబాబు అన్నారు. అందుకే ఎన్నికల్లో మమ్మల్ని ఆశీర్వదిస్తే అన్ని రంగాల్లో రాష్ట్రాభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చామన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్ర పునర్నిర్మాణం ప్రారంభించామన్నారు. రాష్ట్ర చరిత్రలో లేని విధంగా ఇటీవల ప్రధాని మోదీ రూ.2.8 లక్షల కోట్ల అభివృద్ధి పనులు, పెట్టుబడులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారన్నారు. బ్రాండ్ ఏపీ ఇమేజ్‌తో ఇప్పుడిప్పుడే రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయని చెప్పారు. రాష్ట్రానికి పరిశ్రమలు రావాలి. వ్యవసాయం లాభసాటి కావాలి. పర్యాటకం ఊపందుకోవాలి. సంపద పెరగాలి. అప్పుడే రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్రంలో 40 లక్షల కుటుంబాలు నిర్మాణ రంగంపై ఆధారపడ్డాయని, గత ఐదేళ్లు ఇసుక లభించక భవన నిర్మాణ కార్మికులకు సరైన ఉపాధి ఉండేది కాదన్నారు.

తమ ప్రభుత్వంలో ఉచిత ఇసుక విధానానికి శ్రీకారం చుట్టామని, ఇసుక కొరత లేకుండా చేశామన్నారు. రియల్ ఎస్టేట్ రంగం వాటా జీడీపీలో 7.3 శాతం ఉంది. 2047కు 20 శాతం పెరిగి... 5.8 ట్రిలియన్ డాలర్లు ఆర్జిస్తుందని వెల్లడించారు. అమరావతి అభివృద్ధి జరిగి ఉంటే ఈ ప్రాంతం మరింత నిలదొక్కుకుని ఉండేదన్నారు.

టీడీఆర్ బాండ్ల దోషుల్ని వదిలిపెట్టం

టీడీఆర్ బాండ్లలో డబ్బులు తీసుకుంది ఒకరు... నష్టపోయింది ఇంకొకరని చంద్రబాబు అన్నారు. అవినీతికి పాల్పడ్డవారిని వదలిపెట్టం. అమాయకుల్ని కాపాడతాం. ఏడు నెలల్లో రాష్ట్రంలో రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చి పనులు ప్రారంభిస్తున్నాం. తద్వారా 4 లక్షల మంది యువతకు ఉద్యోగాలు వస్తాయి. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అమరావతి పనులను రూ.50 వేల కోట్లతో ప్రారంభిస్తాం. ఇది స్వయం ఆధారిత ప్రాజెక్టు. రియల్ ఎస్టేట్ ఎక్కడ బాగుంటుందో అక్కడ సంపద సృష్టి జరుగుతుంది. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు కన్నా పెద్దగా అమరావతి చుట్టూ 183 కిలోమీటర్ల మేర రింగ్ రోడ్డుకు ప్రణాళిక సిద్ధం చేశాం. అది పూర్తయితే గుంటూరు–అమరావతి పట్టణాలు కలిసిపోతాయి. రాష్ట్రంలో మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాం. రాష్ట్రంలో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఏపీని గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా మార్చుతామని చంద్రబాబు తెలిపారు. దేశంలో అమరావతి లాంటి నగరం మరొకటి రాదని చంద్రబాబు అన్నారు. కొత్త నగరాన్ని బెస్ట్ మోడల్ సిటీగా నిర్మిస్తాం. ఒక్క అమరావతినే కాదు... విశాఖ, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, తిరుపతి లాంటి పట్టణాలను అభివృద్ధి చేస్తాం. భవిష్యత్తులో పట్టణాభివృద్ధి జరిగి మన నగరాలు కూడా అగ్రస్థానంలో ఉండాలి. అనధికారిక నిర్మాణాలు చేపట్టవద్దని స్పష్టంచేశారు.

భాగ్యనగరాన్ని కాలుష్యరహితంగా మారుస్తాం

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేయించామన్నారు. సోలార్ పవర్ స్టేషన్లు ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. వెయ్యి మెగావాట్ల సోలార్ పవర్ ఉత్పత్తి చేసేలా మహిళా సంఘాలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. హైటెక్ సిటీ పక్కనే మహిళా సంఘాల ఉత్పత్తులను విక్రయించుకునేందుకు మూడున్నర ఎకరాల స్థలంలో స్టాల్స్ ఏర్పాటు చేశామని వివరించారు. హాస్టల్ విద్యార్థులకు 40 శాతం డైట్ చార్జీలు, 200 శాతం కాస్మొటిక్ ఛార్జీలను పెంచామని తెలిపారు. మహిళాభివృద్ధి ధ్యేయంగా అడుగులు వేస్తున్నామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ధ్యేయమని పేర్కొన్నారు. గ్రామీణ మహిళల సాధికారతపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. ఆటో మొబైల్ రంగంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు చెప్పారు. మచిలీపట్నం పోర్ట్‌ను అనుసంధానం చేస్తూ రోడ్లు, రైలు మార్గాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. రీజినల్ రింగ్ రైల్వే లైన్ మంజూరు చేయాలని ప్రధాని మోదీని కోరామని చెప్పారు. అవుటర్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రోడ్డు మధ్య రేడియల్ రోడ్లు నిర్మిస్తామని సీఎం తెలిపారు. టాటా గ్రూప్‌తో కలిసి రూ.2,400 కోట్లతో ఐటీఐలను ఐటీసీలుగా మారుస్తున్నామన్నారు. నైపుణ్యాల పెంపు కోసం ప్రత్యేకంగా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని, ఐఎస్‌బీ తరహాలో స్కిల్ యూనివర్సిటీ కోసం ఆనంద్ మహీంద్రా చైర్మన్‌గా బోర్డు ఏర్పాటు చేశామని వివరించారు. కార్పస్ ఫండ్ కోసం సీఐఐ ప్రతినిధులు మద్దతు ఇవ్వాలని కోరారు. స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ హబ్ కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సీఐఐ ప్రతినిధులకు ప్రభుత్వం సహకరిస్తుందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీని నిర్మించాలని నిర్ణయించినట్టు చెప్పారు. ప్రపంచంలో హైదరాబాద్‌ను చైనాకు ప్లస్ సిటీగా మార్చే వ్యూహంతో ఉన్నామన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలకు రిజిస్ట్రేషన్, రోడ్డు పన్నును తొలగించామని ప్రకటించారు. ఫ్యూచర్ సిటీ కాలుష్య రహిత నెట్ జీరో సిటీగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. 3,200 ఈవీ బస్సులను ఆర్టీసీలోకి తీసుకువస్తున్నామని అన్నారు.

బంగాళాఖాతంలో ఆవర్తనం

కోస్తాకు నేడు, రేపు వర్ష సూచన

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: బంగాళాఖాతంలో మళ్లీ ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురవనున్నాయి. ఈనెల 9వ తేదీన ఆగ్నేయ బంగాళాఖాతంలో కొనసాగిన ఉపరితల ఆవర్తనం 10వ తేదీన నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతోంది. ఇది సముద్ర మట్టానికి 3.2 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించివుంది. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి సాధారణ వర్షాలు కురవనున్నట్లు అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దక్షిణ కోస్తాలో 11,12 తేదీల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, రాయలసీమ జిల్లాల్లో కూడా మోస్తరు వర్షాలు, 12వ తేదీ నుంచి సాధారణ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం మరో నాలుగురోజులు ఉంటుందని, దీని ప్రభావంతో నాలుగురోజులపాటు ఏపీలో తేలికపాటి నుంచి సాధారణ వర్షాలు కురుస్తాయని చెప్పింది.

జగనన్న కాలనీల పేరు మార్పు

విశాలాంధ్ర బ్యూరో – అమరావతి: వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన మరో కార్యక్రమం పేరును కూటమి సర్కారు మార్చేసింది. వైసీపీ ప్రభుత్వం నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా జగనన్న కాలనీల నిర్మాణం చేపట్టింది. అయితే ఈ జగనన్న కాలనీల పేరును కూటమి ప్రభుత్వం మారుస్తూ నిర్ణయం తీసుకుంది. జగనన్న కాలనీల పేరును పీఎంఏవై-ఎన్టీఆర్ నగర్‌గా మార్చింది. ఈ మేరకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. జగనన్న కాలనీల పేర్లను ఇకపై ప్రధానమంత్రి ఆవాస్ యోజన–ఎన్టీఆర్ నగర్‌గా పిలవనున్నారు. ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్ఆర్, జగన్ పేరుతో ఉన్న అనేక పథకాల పేర్లను మార్చిన విషయం తెలిసిందే. వివిధ పథకాలకు స్వాతంత్ర్యోద్యమ నాయకులు, సంఘసంస్కర్తల పేర్లు పెట్టారు. ఇప్పటికే జగనన్న అమ్మఒడి, వైఎస్ఆర్ రైతు భరోసా, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద లాంటి పథకాలకు ప్రభుత్వం పేర్లు మార్చింది.

రాష్ట్రాభివృద్ధికి సహకరించండి

కేంద్ర మంత్రులతో కొండపల్లి భేటీ

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: పెండింగ్‌లో ఉన్న విజ్ఞప్తులను పరిశీలించి రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్... కేంద్ర మంత్రులు జైశంకర్, శోభకరంద్లాజేను కోరారు. ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో రెండు రోజులపాటు నిర్వహించిన 'ప్రవాస భారతీయ దివస్' కార్యక్రమంలో భాగంగా కేంద్ర మంత్రులను శుక్రవారం ఆయన కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున పెండింగ్‌లో ఉన్న సమస్యలను కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రవాస భారతీయ దివస్‌ను ప్రధాని మోదీ గురువారం ప్రారంభించారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో నివసించే భారతీయ మూలాలున్న వారందర్నీ ఏకం చేయడంతో పాటు ఆయా దేశాల్లో భారతీయ సంతతి ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. కేంద్ర విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి ఎస్.జయశంకర్‌ను ఆయన విడిది కార్యాలయంలో మంత్రి కొండపల్లి కలిశారు. రాష్ట్రంలో వలస వనరుల కేంద్రం, విదేశీ భవన్ మంజూరు చేయాలని అభ్యర్థించగా, ఆ మేరకు ఆయన హామీ ఇచ్చారు. అనంతరం కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలశాఖ సహాయ మంత్రి శోభాకరంద్లాజేతో సమావేశమయ్యారు. పరిశ్రమల శాఖకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర పథకాలను అత్యధికంగా మంజూరు చేసి...అభివృద్ధికి తగిన సహాయ సహకారాలు అందించాలని మంత్రి అభ్యర్థించారు. స్పందించిన శోభాకరంద్లాజే రాష్ట్ర ప్రభుత్వానికి అన్ని రకాల సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

పోక్సో కేసులో చెవిరెడ్డికి ఎదురుదెబ్బ

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి క్వాష్ పిటిషన్‌ను రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. తిరుపతి జిల్లా యర్రావారిపాలెం మండలానికి చెందిన బాలిక (14) పై అత్యాచారం జరిగిందని చెవిరెడ్డి వ్యాఖ్యానించడంతో పాటు సామాజిక మాధ్యమాల్లో ప్రసారం చేశారన్న ఆరోపణలతో చెవిరెడ్డిపై కేసు నమోదయింది. వాస్తవాలు నిర్ధారించుకోకుండా అసత్య ప్రచారం చేయడాన్ని పోలీసులు తీవ్రంగా పరిగణించారు. దీంతో బాలిక తండ్రి ఫిర్యాదు ఆధారంగా పోక్సో కేసు పెట్టారు. యర్రావారిపాలెం మండలానికి చెందిన బాలిక... పాఠశాల నుంచి ఇంటికి వస్తుండగా ముసుగు వేసుకున్న దుండగులు తనపై దాడి చేసి మత్తు మందు తాగించారని తల్లిదండ్రులను నమ్మించింది. ఘటన పూర్వాపరాలు తెలుసుకోకుండా, వాస్తవాలు నిర్ధారించుకోకుండానే బాలిక చదివే పాఠశాలకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి... ఆమెపై అత్యాచారం జరిగిందని, ఆమెకు అండగా ఉంటామని వ్యాఖ్యానించినట్లు పోలీసులు గుర్తించారు. బాలికకు వైద్యపరీక్షలు చేసి అత్యాచారం జరగలేదని పోలీసులు తెలిపినా, సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేసినట్లు తేల్చారు. ఈ కేసులో బాధితురాలు బాలిక కావడం వల్ల ఆమెతో పాటు కుటుంబ సభ్యుల గుర్తింపు ప్రచారం చేయడం పోక్సో చట్టం ప్రకారం ఉల్లంఘన అవుతుంది. అసత్య ప్రచారం చేసి తమను మనోవేదనకు గురిచేశారంటూ బాలిక తండ్రి ఆయనపై ఫిర్యాదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని చెవిరెడ్డి ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై శుక్రవారం విచారణ జరిపిన హైకోర్టు... చెవిరెడ్డి పిటిషన్‌ను కొట్టివేసింది.

బీజేపీ నేత ఇంట్లో ఐటీ సోదాలు

భోపాల్: మధ్యప్రదేశ్‌లో బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఇంట్లో ఐటీ సోదాల సమయంలో అధికారులకు మూడు మొసళ్లు కనిపించాయి. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం బీజేపీ మాజీ ఎమ్మెల్యే హర్వాన్ష్ సింగ్ రాథోడ్ పన్ను ఎగవేతకు పాల్పడినట్లు ఆరోపణలొచ్చాయి. దీంతో ఐటీ అధికారులు ఆయన ఇంట్లో సోదాలు చేశారు. ఆ సమయంలో రాథోడ్ ఇంట్లోని చెరువులో మూడు మొసళ్లు కనిపించాయి. దీంతో వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. రాథోడ్‌తో పాటు మాజీ కౌన్సిలర్ రాజేశ్ కేశర్వాణి ఇంట్లోనూ సోదాలు జరిగాయి. రాథోడ్ రూ.155 కోట్ల పన్ను ఎగవేతకు పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. ఆయన ఇంట్లో రూ.3 కోట్ల నగదుతో పాటు కోట్లు విలువ చేసే బంగారం, వెండి ఆభరణాలు కనుగొన్నట్లు అధికారులు తెలిపారు.

రాష్ట్ర పండువగా కొమురం భీం జయంతి, వర్ధంతి

(మొదటిపేజీ తరువాయి)

తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని... ఇందుకోసం ఐటీడీఏల పరిధిలో వెంటనే స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

కేస్లాపూర్ జాతరకు నిధులు...

కేస్లాపూర్ జాతరకు నిధులు మంజూరు చేయాలని రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివాసీలకు ఎంతో కీలకమైన రాయి సెంటర్లకు భవనాల నిర్మాణం చేపడతామని తెలిపారు.

అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. భవనాలు ఎలా ఉండాలనే దానిపై పంచాయతీరాజ్ శాఖ నుంచి నమూనాలు తయారు చేయించాలని మంత్రి సీతక్కకు సూచించారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మాజీ ఎంపీ సోయం బాపురావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ప్రొఫెసర్ గుమ్మడి అనురాధ పాల్గొన్నారు.

తొక్కిసలాట... అలజడి

(మొదటిపేజీ తరువాయి)

దర్శనం కోసం భక్తులు దేశ నలుమూలల నుంచి వస్తుంటారు. కర్నాటక, తమిళనాడు, తెలంగాణ నుంచి అధికంగా తాకిడి ఉంటుంది. ఆ మేరకు అధికారులు నెల రోజుల నుంచే ఏర్పాట్లకు ప్రణాళిక సిద్ధం చేస్తారు. భక్తులకు వసతి, సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటారు. రద్దీ దృష్ట్యా తిరుపతిలోనే వైకుంఠ ద్వార దర్శన టోకెన్లను ఇచ్చేలా గత అనుభవాల కనుగుణంగా ప్రణాళిక రూపొందించారు. బుధవారం టోకెన్ల జారీ ప్రక్రియ ప్రారంభమైంది. 9 కేంద్రాల్లో 94 కౌంటర్లను ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం ఒక్కసారిగా భక్తుల తాకిడి పెరిగింది. ఈ క్రమంలో శ్రీనివాసం వసతి సముదాయం వద్ద అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో భక్తుల మధ్య తోపులాట జరిగింది. తోపులాట కాస్త తొక్కిసలాటకు దారితీసింది. దీంతో సంఘటనా స్థలంలోనే నలుగురు మృత్యువాతపడ్డారు. అధిక శాతం మంది గాయపడటంతో ఒక్కసారిగా ఆర్తనాదాలు, ఆహాకారాలతో విలవిలలాడిపోయింది. తీవ్ర గందరగోళానికి దారితీసింది. ప్రభుత్వం సైతం ఒక దశలో తీవ్ర ఆందోళనకు గురైన పరిస్థితి. బుధవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనతో మూడు రోజులపాటు తిరుపతి నగరానికి ప్రముఖుల తాకిడి అధికమైంది. తొక్కిసలాటకు దారి తీసిన పరిస్థితి దృష్ట్యా ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఐదుగురు అధికారులపై వేటు వేసింది. అందులో ఇద్దరిని సస్పెండ్ చేయగా, ముగ్గురిని బదిలీ చేస్తూ చర్యలు తీసుకున్నారు. కాగా, తొక్కిసలాటలో మరణించిన విశాఖపట్నం తాటిచెట్లపాలెంకు చెందిన లావణ్య స్వాతి (37), విశాఖపట్నం కంచరపాలెంకు చెందిన శాంతి (35), విశాఖపట్నం మద్దెలపాలెంకు చెందిన రజని (47), తమిళనాడు సేలం జిల్లా మేచారి గ్రామానికి చెందిన మల్లిగ (50), నరసరావుపేట రామచంద్రాపురం ప్రాంతానికి చెందిన బాబు నాయుడు (51), తమిళనాడు పొల్లాచ్చికి చెందిన నిర్మల (45) మృతదేహాలకు గురువారం రుయాలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృత దేహాలను స్వస్థలాలకు తరలించేలా ఏర్పాట్లు చేశారు. గాయపడిన 40 మంది భక్తుల్లో 28 మందిని రుయా ఆసుపత్రికి, 12 మందిని స్విమ్స్‌కు తరలించారు. చాలా మందిని స్థానిక ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం అందరినీ స్విమ్స్‌కు తరలించింది వైద్యం అందిస్తున్నారు. వీరిలో ముగ్గురిని మూడు రోజుల పాటు అబ్జర్వేషన్‌లో ఉంచారు. దాదాపు 20 మంది భక్తులు కోలుకోవడంతో వారిని డిశ్చార్జి చేశారు. మృతుల కుటుంబ సభ్యులను రుయా ఆస్పత్రిలో హోం మంత్రి అనిత, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, జల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ఎస్పీ సుబ్బరాయుడు, టీటీడీ జేఈవో గౌతమి, ఆర్డీవో రామ్మోహన్ పరామర్శించారు.

వివాదాస్పదంగా పోలీసుల తీరు

తొక్కిసలాటలో తమిళనాడు సేలంకు చెందిన మల్లిగ (50) అనే భక్తురాలు మరణించారు. అయితే మల్లికా అనారోగ్యం కారణంగా మరణించిందని పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసుల తీరుపై మృతురాలు మల్లిగ భర్త కృష్ణన్ చిన్నగోవిందన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల కోసం వచ్చి తొక్కిసలాటలో చనిపోతే అనారోగ్యంతో మరణించినట్లు ఎఫ్ఐఆర్ ఎలా నమోదు చేస్తారని ప్రశ్నించారు. తన భార్య మృతికి టీటీడీ, పోలీసులే కారణమని ఆయన ఆరోపించారు.

సీఎం చంద్రబాబు సమీక్ష... చర్యలు

మరోవైపు, తొక్కిసలాట ఘటనపై గురువారం టీటీడీ పరిపాలనా భవనంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రులు, టీటీడీ అధికారులతో సమావేశం నిర్వహించారు. స్విమ్స్‌లో క్షతగాత్రులను పరామర్శించిన తర్వాత టీటీడీ పరిపాలన భవనంలో మంత్రులు సత్యప్రసాద్, అనిత, రామనారాయణ రెడ్డి, పార్థసారథి, రామానాయుడు, సత్య కుమార్ యాదవ్, సంధ్యారాణి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, ఇతర అధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు. కొంతమంది అధికారులు బాధ్యత లేకుండా పని చేయడం వల్లే తిరుపతిలో తొక్కిసలాట ఘటన జరిగిందన్నారు. డీఎస్పీ రమణ కుమార్‌తో పాటు గోశాల డైరెక్టర్ హరినాథరెడ్డిని సస్పెండ్ చేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. ఎస్పీ సుబ్బారాయుడు, జేఈవో గౌతమి, టీటీడీ సీవీఎస్‌వో శ్రీధర్‌పై బదిలీ వేటు వేస్తూ ఆదేశాలు జారీ చేశారు. మరణించిన వారి కుటుంబాలకు టీటీడీ నుంచి రూ.25 లక్షల పరిహారం అందించాలని, అలాగే ఆయా కుటుంబాల్లో ఒక్కొక్కరికి ఆంధ్ర, తమిళనాడు ప్రాంతాల్లో కాంట్రాక్టు ప్రాతిపదికన ఉద్యోగాలు ఇవ్వాలని ఆదేశించారు. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షలు, స్వల్పంగా గాయపడిన 30 మంది బాధితులకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. చికిత్స పొందుతూ కోలుకుంటున్న 35 మందికి రెండు రోజుల్లో శ్రీవారిని ప్రత్యేక దర్శనం చేయించడంతో పాటు వారందరినీ క్షేమంగా స్వగ్రామాలకు చేర్చేందుకు టీటీడీ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడతామని, న్యాయ విచారణ జరుపుతామని ముఖ్యమంత్రి చెప్పారు. తొక్కిసలాట ఘటనపై కొన్ని నిర్ణయాలు తీసుకున్నామని, ఉన్నతాధికారులకు సూచనలు చేశామన్నారు. తిరుపతి తొక్కిసలాట ఘటన తర్వాత అధికారులపై చర్యలు తీసుకున్నప్పటికీ, భక్తుల్లో మాత్రం ఆగ్రహం, అసంతృప్తి తగ్గలేదు. ఇది ఇప్పుడు రాజకీయ పక్షాల మధ్య మాటల యుద్ధానికి సైతం దారితీసింది.

ఎయిర్‌పోర్టు స్థల పరిశీలనకు కేంద్ర బృందం 20న రాక

మంత్రి తుమ్మల

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : కొత్తగూడెం విమానాశ్రయం ఏర్పాటు కోసం వేగవంతంగా చర్యలు మొదలయ్యాయి. ఈనెల 20న కొత్తగూడెంలోని పలు మండలాలలో ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా బృందాలు పర్యటిస్తాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఇటీవల కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ని కలిసి ఇక్కడి విమానాశ్రయం ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయాలని కోరినట్లు మంత్రి వెల్లడించారు. నిర్మాణానికి సంబంధించి గతంలో సూచించిన కొత్తగూడెం పరిసర ప్రాంతంలో భూములు అనుకూలంగా లేవని అనుమతి నిరాకరించారని తెలిపారు. కొత్తగూడెం పరిధిలోని కొత్తగూడం, చుంచుపల్లి, సుజాతనగర్ మండలాల్లో పలు భూములను గుర్తించామని అక్కడ సర్వే నిర్వహించాలని ఇటీవల తాను కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకి లేఖ రాసినట్లు మంత్రి తెలిపారు. ఆ లేఖకు స్పందనగా కేంద్ర మంత్రి బదులిస్తూ ఎయిర్ పోర్టు నిర్మాణానికి సాధ్యసాధ్యాల పరిశీలనకు ప్రత్యేక బృందం పంపిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిపారు. అందుకు అయ్యే ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని లేఖలో పేర్కొనడం జరిహిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని స్వయంగా కలిసి అంశాన్ని వారికి వివరించిన్నట్లు మంత్రి తుమ్మల తెలిపారు. జిల్లాలో అనువైన స్థలంకోసం సర్వే నిర్వహించేందుకు పలు ప్రాంతాలను గుర్తించామని చెప్పారు. 20న ప్రత్యేక బృందం జిల్లాకు వస్తున్న క్రమంలో కావలసిన అన్ని ఏర్పాట్లు చూడాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ను మంత్రి తుమ్మల ఆదేశించారు. ఎక్కడ కూడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా రెవెన్యూ యంత్రాంగం చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తగూడెం పరిసరాల్లో విమానాశ్రయం ఏర్పాటు చేస్తే జిల్లా రూపు రేఖలు మారనున్నట్లు మంత్రి తుమ్మల ఆశాభావం వ్యక్తం చేశారు.

మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలి

విశాలాంధ్ర జిల్లా బ్యూరో- మహబూబాబాద్: ప్రభుత్వ మెనూ ప్రకారం ఉదయం బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్నం లంచ్, రాత్రి డిన్నర్‌లను రుచికరంగా ఏర్పాటు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో అన్నారు. శుక్రవారం జిల్లాలోని పెద్ద వంగర, తొర్రూరు మున్సిపాలిటీలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజ్ (బాలికలు) ప్రభుత్వ బాలికల ఉన్నత సాంఘిక సంక్షేమ శాఖ (బాలికలు) వసతి గృహం, కాలేజ్, మహాత్మ జ్యోతిరావు పూలే టిబిసి డబ్ల్యూ ఆర్, స్కూల్ (బాయ్స్) లలో అదనపు కలెక్టర్‌ఆ కస్మికంగా తనిఖీ చేసి వసతి గృహాలు, కాలేజిలు పాఠశాలలోని తరగతి గదులను, వంట గదులను, స్టడీ రూమ్, స్టాక్ రిజిస్టర్, విద్యార్థులు, ఉపాధ్యాయుల, హాజరు పట్టికలను సందర్శించి తనిఖీ చేశారు. వంటలు సిద్ధం చేసే సిబ్బంది పరిశుభ్రంగా ఉండాలని, నాణ్యమైన పదార్థాలతో ఆహారం సిద్ధం చేయాలని అన్నారు. జిల్లాలోని ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన, ప్రదేశాలలో అన్ని వసతి గృహాలను నిత్యం తనిఖీలు చేయాలన్నారు. విద్యార్థిని, విద్యార్థులకు ప్రతి సబ్జెక్టులో ప్రతిభ కనబరిచే విధంగా విద్యా బోధనలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తొర్రూర్ మున్సిపల్ కమిషనర్ శాంతి కుమార్, సంబంధిత వార్డెన్లు, ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిలియంట్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - కారేపల్లి : పండుగలు మన సంస్కృతి సంప్రదాయాలకు నిలువుటద్దాలని బ్రిలియంట్ స్కూల్ కరస్పాండెంట్ మల్లెల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం సంక్రాంతి పండగను పురస్కరించుకుని విద్యార్థులకు డ్యాన్స్, ఫ్యాన్సీ డ్రెస్, రంగోలి, పోటీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలని అన్ని పడుగలలో కన్నా సంక్రాంతికి ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. రైతులు పండించిన పంట చేతికి వచ్చే సందర్భంతో పాటు సూర్యుడు మకరరాశిలో ప్రవేశించే సమయాన ఈ పండుగను కుటుంబాలు అంతా కలిసి మెలిసి ఎంతో ఆనందంగా జరుపుకుంటారు. విద్యార్థులు అందరూ మన సంస్కృతి సంప్రదాయాలు పాటిస్తూ క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను మెరుగుపరచి వారిని సమాజానికి అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి

విశాలాంధ్ర - నేరేడుచర్ల : ప్రతి ఒక్కరూ మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలని నేరేడుచర్ల శ్రీ అంజలి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ అలక సైదిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన సంక్రాంతి పండుగ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేసి మాట్లాడారు. మన పూర్వీకులు మనకు అందించిన గొప్ప సంపద సంస్కృతి సంప్రదాయాలని వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆదినారాయణ శ్రీనివాస్ రెడ్డి రవీందర్ రెడ్డి వీరాంజనేయులు నాగరాజు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

విశాలాంధ్ర ప్రతినిధి - పెద్దపల్లి, సింగరేణి : శుక్రవారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజఠాకూర్ పాలకుర్తి మండలం ఈశాల తక్కల్లాపల్లి గ్రామంలో సీసీ రోడ్లు, మురుగునీరు కాలువలు, ప్రహరీ గోడ, బతుకమ్మ ఘాటు వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో, గ్రామాన్ని అభివృద్ధి చేయడం కోసం ఎన్నికల్లో మాట ఇచ్చిన ప్రకారంగా కోటి ఇరవై ఐదు లక్షలతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఎంపీడీవో, ఎమ్మార్వో జ్యోతి, పంచాయతీరాజ్ డిఇ అప్పలనాయుడు, ఏఇ రషూష్, సంబంధిత అధికారులు, పాలకుర్తి మండల నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక రవాణా నియంత్రణకు చర్యలు : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : మొరం, ఇసుక అక్రమ రవాణ నియంత్రణకు ప్రతిష్ట చర్యలు తీసుకోవాలని నిర్మల్ జిల్లా కలెక్టర్ అభి లాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొరం ఇసుక అక్రమ రవాణాను నిరోధించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని అనుమతులు లేకుండా అక్రమ రవాణా చేసే వారిపై కేసులు నమోదు చేయాలనీ మండలాల వారీగా నది, వాగులు వంటి ఇసుక అందుబాటులో ఉన్న ప్రాంతాలను గుర్తించాలని రహదారులు, భవనాలు, సిసి రోడ్లు, డ్రైనేజి నిర్మాణాల రికార్డులను పరిశీలించి ఇసుక అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు.

భద్రాద్రిలో వైభవపేతంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ముక్కోటి ఉత్సవం వైభవపేతంగా జరిగింది. శుక్రవారం ఏకాదశి సందర్భంగా రామయ్య ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు జై శ్రీరామ్... జై జై శ్రీరామ్ అంటూ జయ జయధ్వానాలు చేశారు. ఈ సందర్భంగా వేదపండితులు ముక్కోటి విశిష్టతను వివరించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వీవీఐపీ, వీఐపీ సెక్టార్ లతో పాటు ఇతర సెక్టార్లలోని భక్తులు వేడుకను తిలకించారు. స్థానాచార్యులు భక్తులకు ముక్కోటి ఏకాదశి విశిష్టతను వివరించారు. అర్చకులు 108 ఒత్తులతో వెలిగించిన హారతినికి భక్తులు అందుకున్నారు. ఉత్తర ద్వార దర్శనం తర్వాత ఉత్సవ మూర్తులను మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్ని ఏర్పాట్లు చేశారు. ఎప్పటికప్పుడు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ప్రతి సెక్టార్ లో ఏర్పాట్లు పర్యవేక్షణ కు జిల్లా అధికారులను, లైజన్ అధికారులను నియమించారు. పటిష్ట బందోబస్తు ఏర్పాట్లును ఎస్పీ రోహిత్ రాజ్ పర్యవేక్షించారు. వేడుకలకు రాష్ట్ర వ్యవసాయ, చేనేత, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి సతీమణి మాధురి రెడ్డి, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, భద్రాచలం, పినపాక, ఇల్లందు, శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్ రావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, వికారాబాద్ కలెక్టర్ ప్రతిక్ జైన్ ఐటిడిఎ పిఓ రాహుల్, అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్ దంపతులు, ఎఎస్పీ విక్రాంత్ సింగ్, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్. దేవస్థానం ఈ ఓ రమాదేవి తదితరులు హాజరయ్యారు.

గరుడ వాహన రూపుడైన రామచంద్రుడు....

గరుడ వాహనరూపుడైన రామచంద్రుడు భక్తులకు శ్రీమహావిష్ణువు అలంకారంలో దర్శనమిచ్చారు. అర్చ కులు స్వామివారికి విశేష ఆరాధన, శ్రీరామ పదాక్షరీ మంత్ర సంపుటిత అష్టోత్తర శతనామార్చన, చతుర్వే చాలు, గరుడ ప్రబంధాలు, ఇతిహాసాలు, శరణాగతి గజ్జగరుడ దండం, భక్తరామదాసు రచించిన దాశరథి శతకాన్ని పఠించారు. వైకుంఠ రాముడికి అష్టోత్తర శత హారతినిచ్చారు. భక్తరామదాసు కాలం నుంచి వస్తున్న సంప్రదాయం ప్రకారం భద్రాచలం తహసీల్దార్ శ్రీనివాస్ మూలవరులకు స్నపనం నిర్వహించారు. ఉత్తర ద్వారంలో భక్తులకు

పోలీస్ సేవల ఫీడ్‌బ్యాక్ కోసం

క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేయాలి : ఎస్పీ

విశాలాంధ్ర - కొత్తగూడం క్రైమ్: పోలీసుల పనితీరు, వీరిపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలను తెలుసుకునేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పోలీసు శాఖ రూపొందించిన క్యూఆర్ కోడ్ ఆఫ్ సిటిజెన్ పోస్టర్లను శుక్రవారం విడుదల చేసింది. ఈ క్యూఆర్ కోడ్ను జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లు, సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయాలు, సబ్ డివిజన్ పోలీస్ అధికారుల కార్యాలయాల్లో ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల ఎస్పీలతో గురువారం జరిగిన సమావేశంలో రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్ క్యూఆర్ కోడ్ ఆఫ్ సిటిజెన్ పోస్టర్లను లాంఛనంగా ప్రారంభించడం జరిగింది. బాధితుల తమ సమస్యలను తెలుపుకునేందుకు, పోలీస్‌స్టేషన్లకు వెళ్లిన క్రమంలో పోలీసు సిబ్బంది వ్యవహరిస్తున్న తీరు, ఫిర్యాదులు మొదలన విషయాలు తెలుసుకునేందుకు వీలు పడుతుందన్నారు. ఈ క్యూఆర్ కోడ్ అనేక ప్రజా ప్రయోజనాలు ఉన్నాయన్నారు. అన్ని పోలీస్ స్టేషన్లలో అందుబాటులో వుండే క్యూఆర్ కోడ్ ఆఫ్ సిటిజెన్ ను ప్రజలు సద్వినియోగం చేసుకోని పోలీసుల పనితీరుపై సలహాలు, సూచనలు అందించాలని ఈ సందర్భంగా ఎస్పీ కోరారు.

వైభవంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు

విశాలాంధ్ర - ముదిగొండలి : ముదిగొండ మండలంలో పలు ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ముదిగొండలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాలో భక్తులతో కిటకిటలాడాయి. గోవిందా, శ్రీరామ నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి పలు ఆలయాల్లో ఉత్తర ద్వారం ద్వారా స్వామివారి వద్ద గరుడ వాహనంపై శ్రీదేవి, భూదేవి, సమేతంగా శ్రీ లక్ష్మీ నారసింహుడు వైకుంఠనాథుడిగా దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని పూర్వం నుంచి వస్తున్న సాంప్రదాయ ప్రకారం తిరువీధుల్లో ఊరేగించారు. అత్యధిక సంఖ్యలో భక్తులు, పాల్గొని స్వామివారి పూజాకాంకర్యాలతో, ఆశీర్వచనాలు పొందారు.

గరుడవాహనంపై వేంచేసిన నారాయణుడు

విశాలాంధ్ర - హుజూర్ నగర్ : హుజూర్ నగర్ పట్టణంలోని శ్రీ వేణు గోపాల సీతారామచంద్రస్వామి వారి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ముక్కోటి ఏకాదశి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రాతఃకాలంలోనే భక్తుల గోత్రనామాలతో విష్ణు సహస్రం, గోదా, రామానుజాష్టోత్త రాలు నిర్వహించారు. తిరుపావైని మహిళలు శ్రావ్యంగా గానం చేశారు. తదుపరి పెద్ద గరుడ వాహనంపై సీతా లక్ష్మణ సమేత రామచంద్రస్వామి వారిని అధిష్టింప చేసి ఉత్తర ద్వారం దగ్గరకు చేర్చారు. ఉత్తరద్వారాన్ని మామిడి, పూలమాలలతో అలంకరించి, పట్టు వస్త్రాలతో తెర ఏర్పాటు చేశారు. స్వామి వారి వాహనాన్ని భక్తులే బోయిలుగా ఉత్తర ద్వారం దగ్గరికి చేర్చారు. పురాతన కాలం నుండి కూడా ఈ దేవాలయం ఉత్తర దిశలో నిర్మించి ఉండడం ఒక గొప్ప ప్రాముఖ్యతను సంతరించుకుంది. ధూప దీప నైవేద్యాలు సమర్పించి, మేళతాళాల నడుమ స్వామివారి దర్శనాన్ని భక్తులు చేసుకున్నారు. అలవైకుంఠ పురం నుండి నారాయణుడు విచ్చేసిన అద్భుత దృశ్యాన్ని అర్చకులు ఆవిష్కరింపజేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - గార్ల : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందుతాయని ఎలాంటి దుష్ప్రచారాన్ని నమ్మాల్సిన అవసరం లేదని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పష్టం చేశారు. ప్రభుత్వంపై బురద చల్లందుకే కొన్ని పక్షాలు పనికట్టుకుని అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదిముబారక్, సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ పంపిణీ చేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఇందిరమ్మ నమూనా గృహాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ సంక్షేమ పథకాలు అందుకుంటున్న ప్రజలందరూ ఈ నిధులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. అనంతరం 24 మంది లబ్దిదారులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్, ఎంపీడీఓ మంగమ్మ,పిఏసిఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధనియాకుల రామారావు, భూక్యా నాగేశ్వరావు, భట్టు నాగరాజు, రాంసింగ్ నాయక్, సురేష్ నాయక్, అశోక్, యాకుబ్ పాషా, భీముడు, చిలుక బాబు, రమేష్, లాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

దర్గాను అడ్డుపెట్టుకొని క్షుద్ర పూజలు..

విశాలాంధ్ర - ఇల్లందు : ఏజెన్సీ కార్మిక ప్రాంతం ఇల్లందులోని కొత్త కాలనీలో క్షుద్ర పూజల తంతు బయటపడటంతో స్థానిక ప్రజల్లో భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి. ఈ కాలనీలోని దర్గాలో ఇప్పటివరకు మాలిక్‌గా (నిర్వాహకుడు) వ్యవహరిస్తున్న ఎస్.కె షఫీ తన మంత్ర శక్తులతో ఒక వ్యక్తికి ఉద్యోగం ఇప్పిస్తానని ప్రారంభించిన క్రతువు శుక్రవారం బట్ట మొదలైంది. కొత్త కాలనీలోని ఒక దర్గాలో ఏడాదికాలంగా నిర్వాహకుడి బాధ్యతలు చేపట్టిన షఫీ ఇల్లందు ప్రాంతానికి చెందినవాడే. ఈ కాలనీకి చెందిన ఒక వ్యక్తి ఇతర ప్రాంతాలకు జీవనోపాధి కోసం వెళ్ళాడు. తన ఇంటిని షఫీ కు అద్దెకు ఇచ్చాడు. ఏడాదికాలంగా షఫీ తన భార్య ఇద్దరు పిల్లలతో ఇంట్లో నివాసం ఉంటూ దర్గా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. ఒక నిరుద్యోగికి ఉద్యోగం ఇప్పిస్తానని పురితో క్షుద్రపూదలు ఇటీవల మొదలుపెట్టాడు. షఫీ అద్దకొండ యజమాని తన ఇంటిని అమ్మకానికి పెట్టాడు. వెనక బజార్ లో నివాసం ఉండే ఒకరు ఈ ఇల్లు కొనాలనుకుని ఇటీవల యజమానితో మాట్లాడాడు. ఇల్లు ఎలా ఉంటుందో చూద్దామని వచ్చాడు. ఆ ఇంట్లో అద్దె కుంటున్న షఫీ ని పిలవగానే ఎలాంటి స్పందన కనిపించలేదు. దీంతో ఆ ఇంటి కిటికీ నుంచి చూడగా, ఒక గదిలో షఫీ చేస్తున్న క్షుద్ర పూజల సామాగ్రి అతనికి కనిపించాయి. స్థానికులకు కూడా షఫీ చేస్తున్న క్షుద్ర పూజల వ్యవహారాన్ని సదరు వ్యక్తి చెప్పటంతో ఈ వ్యవహారం బట్టబలయింది. ఈ ప్రాంతంలో పోలీసులు నిఘా అంతగా లేకపోవడంతో పోకిరి యువకులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. క్షుద్ర పూజలు నేపథ్యంలో మనుషుల బలి లాంటి దుష్ట కార్యాలు చేపడితే పరిస్థితి ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పోలీసులు విచారించి వెంటనే దోషులను శిక్షించాలని స్థానికంగా డిమాండ్ వినిపిస్తుంది.

క్లౌడ్ సాఫ్ట్‌టెక్ సొల్యూషన్స్‌కు డిస్కవరీ ఓక్స్ నుండి 'అలాట్'ఉత్పత్తులు

విశాలాంధ్ర - హైదరాబాద్: అత్యాధునిక 'అలాట్' సొల్యూషన్స్‌ను అందించే ప్రముఖ ప్రొవైడర్ బ్లూ క్లౌడ్ సాఫ్ట్‌టెక్ సొల్యూషన్స్ లిమిటెడ్, హైదరాబాద్‌లోని డిస్కవరీ ఓక్స్ పబ్లిక్ స్కూల్ నుండి తన 'అలాట్' ఉత్పత్తులు ఎడ్యుజెనీ, ఎమోటిఫిక్స్‌లను అమలు చేయడానికి ఆర్డర్‌ను అందుకున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ మైలురాయి ప్రాజెక్టులో రూ.105.00 లక్షల ఆర్డర్ విలువతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఎనేబుల్డ్ ఎడ్యుటెక్ ఉత్పత్తి అయిన ఎడ్యుజెనీ ఎమోటిఫిక్స్‌ను అమలు చేయడం జరిగిందన్నారు. ఈ విజయం వినూత్నమైన, పరివర్తనాత్మక పరిష్కారాలను అందించడంలో బిసిఎస్ నైపుణ్యాన్ని నొక్కి చెబుతుందన్నారు. ఇది గొప్ప, విభిన్న విద్యా పర్యావరణ వ్యవస్థను సృష్టిస్తుందన్నారు. విద్యార్థులు విస్తృత శ్రేణి సబ్జెక్టులు, విభాగాలకు ప్రాప్యత కలిగి ఉంటారన్నారు. సాంకేతిక నైపుణ్యాలు, డొమైన్ నైపుణ్యం పట్ల మక్కువను మిళితం చేస్తూ, మేము అనుకూలీకరించిన, సంక్లిష్టమైన ఎంటర్‌ప్రైజ్ స్థాయి పరిష్కారాలను, వెబ్, మొబైల్ అప్లికేషన్‌లను రూపొందిస్తామన్నారు.

జీ తెలుగులో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - ఆదిలాబాద్: జీ తెలుగులో వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్‌గా జీ వినియోగదారులకు సరికొత్త కార్యక్రమాలను సిద్ధమైందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ నెల 11వ తేదీ సాయంత్రం 6 గంటలకు విక్టరీ వెంకటేష్ నటించిన సంక్రాంతి సంబరాలకు వస్తున్నాం సినిమాను, 12వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు పాన్ ఇండియా బిగ్గెస్ట్ బ్లాక్బస్టర్ కల్కి 2898 ఏడీ సినిమాను, 13 వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు సంక్రాంతి సంబరాలు ఫైర్ వర్సెస్ వైల్డ్ ఫైర్ కార్యక్రమాలను ప్రసారం చేయనున్నామన్నారు. కాకినాడ వేదికగా జరిగిన 'సంక్రాంతి సంబరాలకి వస్తున్నాం' కార్యక్రమంలో జీ తెలుగు తారలతో పాటు విక్టరీ వెంకటేష్, దర్శకుడు అనిల్ రావిపూడి, హీరోయిన్లు ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి పాల్గొని అభిమానులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన మోస్ట్ అవైటెడ్ గ్లోబల్ బ్లాక్ బస్టర్ కల్కి 2898 ఏడీ సినిమాని జీ తెలుగు అందిస్తోందన్నారు. ఈ సినిమా చూసే ప్రేక్షకులకు జీ తెలుగు వాచ్ అండ్ విన్ కాంటెస్ట్ని నిర్వహిస్తోందన్నారు. సంక్రాంతి సంబరాలకి కొనసాగింపుగా సంక్రాంతి సంబరాలు ఫైర్ వర్సెస్ వైల్డ్ ఫైర్ కార్యక్రమం జరుగుతుంది. యాంకర్ రవి, వర్షిణి వ్యాఖ్యాతలుగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో సినీ ప్రముఖులు, జీ తెలుగు తారలు అత్తలు, కోడళ్లు పేరున రెండు టీమ్‌లుగా ఏర్పడి వినోదం పంచేందుకు పోటీపడ్డారన్నారు.

భారతీయ వస్త్ర వైభవాన్ని ప్రోత్సహించడమే లక్ష్యం

హైదరాబాద్: భారతీయ వస్త్ర వైభవాన్ని ప్రోత్సహించడమే లక్ష్యమని 'ఫ్రాంటియర్ రాస్' క్రియేటివ్ డైరెక్టర్ గౌరాంగ్ బాత్రా తెలిపారు. భారతదేశం సాంస్కృతిక వారసత్వాన్ని తెలియజేసే ఉద్దేశంతో లగ్జరీ ఫ్యాషన్ బ్రాండ్ ఫ్రాంటియర్ రాస్ 'శృంగర్ శృంఖలా' పేరుతో హైదరాబాద్ స్టోర్లో ఈవెంట్ నిర్వహించింది. ఈ సందర్భంగా బాత్రా మాట్లాడుతూ భారతీయ సాంస్కృతిలో చీర ప్రాముఖ్యతను తెలియజేయడం దీని ఉద్దేశమన్నారు. ఈ ఐకానిక్ వస్త్రానికి గౌరవం తీసుకురావడంలో ఈ ఈవెంట్ నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. భారతీయ వస్త్రాల అందం, నైపుణ్యాన్ని మా బ్రాండ్ ద్వారా ప్రదర్శిస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు.

టాప్ 5 నగరాలలో హైదరాబాద్

హైదరాబాద్: మహిళలకు భద్రత, నైపుణ్యాలు, ఉద్యోగావకాశాల పరంగా హైదరాబాద్ నగరం అత్యుత్తమంగా నిలిచిందని అవతార్ గ్రూప్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ సౌందర్య రాజేష్ తెలిపారు. బెంగళూరు, చెన్నై, ముంబాయి, హైదరాబాద్, పూణే టాప్ 5లో చోటు సంపాదించాయని చెప్పారు. అవతార్ గ్రూప్ 'టాప్ సిటీస్ ఫర్ ఉమెన్ ఇన్ ఇండియా' 2024 సర్వే నిర్వహించింది. ఈ సర్వే వివరాలు వెల్లడించేందుకు ఆమె వర్చువల్‌గా మీడియాతో మాట్లాడారు. మౌలిక సదుపాయాల కల్పనలో హైదరాబాద్ అత్యుత్తమంగా నిలిచిందని తెలిపారు. మెరుగైన పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్, ప్రయాణ సౌకర్యాలతో ఆకట్టుకుందన్నారు. దక్షిణ భారతదేశం అత్యంత లింగ సమానత ప్రాంతంగా నిలిచిందన్నారు. టాప్ 25లో 16 దక్షిణ భారత నగరాలు స్థానం దక్కించుకున్నాయని తెలిపారు.

'ఇండస్‌ఫుడ్ 2025'లో తెనాలి డబుల్ హార్స్ గ్రూప్

హైదరాబాద్: ఢిల్లీ ఇండియా ఎక్స్‌పోజిషన్ మార్ట్‌లో జరిగిన 'ఇండస్‌ఫుడ్ 2025'లో ప్రీమియం వంట సామాగ్రి ఉత్పత్తుల్లో అగ్రగామి తెనాలి డబుల్ హార్స్ గ్రూప్ పాల్గొంది. ఈ ఎక్స్‌పో జనవరి 8న ప్రారంభమైంది. ఈనెల 10వ తేదీ వరకు జరగనుంది. ఈ ఎక్స్‌పోలో 20 దేశాల నుంచి ఆహార ప్రాసెసింగ్ సంస్థలు, 1,800 పైగా ప్రదర్శకులు, 5,000 పైగా అంతర్జాతీయ కొనుగోలుదారులు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా తెనాలి డబుల్ హార్స్ గ్రూప్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మోహన్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ ఆహార పదార్థాలను ప్రపంచానికి పరిచయం చేయడంలో ఈ వేదిక కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.

2025లో దుబాయ్ సందర్శించడానికి మహోన్నత కారణాలు

ముంబయి: యాత్రికులైనా, సాధారణ సందర్శకుడైనా, దుబాయ్‌ను తమ గమ్యస్థానంగా ఎంచుకోవడానికి వందలాది కారణాలు ఉన్నాయి. ఐకానిక్ ల్యాండ్‌మార్క్‌లు, అవార్డు గెలుచుకున్న ఆహారం నుండి ప్రపంచ స్థాయి ఆతిథ్యం, ఉత్తేజకరమైన అనుభవాల వరకు, 2025లో దుబాయ్‌ను సందర్శించడానికి ఉత్తమ కారణాలను ఆ దేశ పర్యాటక విభాగం అందిస్తోంది. దుబాయ్‌లో అద్భుతమైన వాతావరణం, అల్ ఫ్రెస్కో డైనింగ్, పండుగలు, కార్యక్రమాల నిండిన క్యాలెండర్‌తో, అక్టోబర్ నుండి ఏప్రిల్ వరకు దుబాయ్ శీతాకాలం నగరాన్ని సందర్శించడానికి సంవత్సరంలో ప్రసిద్ధి చెందింది. ఇక్కడ వేసవి కూడా ఒక గొప్ప ఎంపికగా నిలుస్తుంది, అనేక హెూటళ్ళు, ఆకర్షణలు దుబాయ్ సమ్మర్ సర్‌ప్రైజెస్‌లో భాగంగా ప్యాకేజీలు, డీల్‌లను అందిస్తున్నాయి. ఇది 2025 జూన్ 27 నుండి ఆగస్టు 31 వరకు జరుగుతుంది. ప్రపంచంలోనే ఎత్తైన టవర్ బుర్జ్ ఖలీఫా, ఐకానిక్ జుమేరా బుర్జ్ అల్ అరబ్, అద్భుతమైన మ్యూజియం ఆఫ్ ది ఫ్యూచర్, పామ్ జుమేరాలోని విలాసవంతమైన అట్లాంటిస్ ది రాయల్ హెూటల్ ఈ నగరంలోని ఆధునిక అద్భుతాలలో ఉన్నాయి. 'ఓల్డ్ దుబాయ్'లోని దుబాయ్ క్రీక్, అల్ ఫహిది హిస్టారికల్ నైబర్‌హుడ్ వంటి చారిత్రాత్మక ప్రాంతాలను చూసి ఆకర్షితులవుతారు. అల్ ఫహిది హిస్టారికల్ నైబర్‌హుడ్‌లోని షేక్ మొహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ సెంటర్ ఫర్ కల్చరల్ అండర్‌స్టాండింగ్‌ని సందర్శించవచ్చు.

కాలిఫోర్నియా బాదం వంటకంతో సంక్రాంతి వేడుక

ముంబయి: భారతదేశం అంతటా సంక్రాంతి, ఇతర పండుగల పేరుతో పంట కోత కాలాన్ని ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటారు, దీనిని బెంగాల్‌లో మకర సంక్రాంతి, దక్షిణాన పొంగల్, ఇతర ప్రాంతాలలో లోహ్రీ, బిహు లేదా బైసాఖి వంటి వివిధ పేర్లతో పిలుస్తారు. ఈసారి పండుగకు అనారోగ్యకరమైన ఆహారాన్ని ఎంపిక చేయకుండా ప్రపంచంలో అత్యంత ప్రజాదరణ పొందిన బాదం అయిన కాలిఫోర్నియా బాదంలను చేర్చడం ద్వారా పండుగ విందుకు ఆరోగ్యకరమైన మలుపును అందించాలని ఆహార నిపుణులు కోరుతున్నారు. డ్రై ఫ్రూట్స్ రాజుగా, కాలిఫోర్నియా బాదంలో ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఆహార ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు సహా 15 ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి, ఇవి అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. ముఖ్యంగా భారతదేశంలో మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, ఊబకాయం వంటి జీవనశైలి వ్యాధుల ప్రాబల్యం పెరుగుతున్నందున కాలిఫోర్నియా బాదంలను రోజువారీ ఆహారంలో చేర్చడం వల్ల బరువు నిర్వహణకు కూడా తోడ్పడుతుంది, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్-నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ ఇటీవల ప్రచురించిన భారతీయుల ఆహార మార్గదర్శకాలు బాదంను మంచి ఆరోగ్యం కోసం ప్రతిరోజూ తినగల పోషకమైన గింజగా గుర్తించాయి.

టెక్‌ఎక్స్‌పెడైట్‌కు గేమ్స్24×7 కోహోర్ట్

హైదరాబాద్: గేమ్స్24×7 అనేది ఒక యాక్సిలరేటర్ ప్రోగ్రామ్. ఇది టెక్‌ఎక్స్‌పెడైట్ కోసం కోహోర్ట్‌ను ప్రకటించింది. ఇందులో హైదరాబాద్ నుండి రెండు స్టార్టప్‌లు సహా దేశవ్యాప్తంగా 17 ఆశాజనక స్టార్టప్‌లు ఉన్నాయి. డీపీఐఐటీ, కర్ణాటక ప్రభుత్వం, తెలంగాణ ప్రభుత్వం, మహారాష్ట్ర ప్రభుత్వంతో సహా వివిధ రాష్ట్ర ప్రభుత్వ వాటాదారుల మద్దతుతో, టెక్‌ఎక్స్‌పెడైట్ భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న స్టార్టప్ పర్యావరణ వ్యవస్థలో వ్యవస్థాపకత, సాంకేతిక ఆవిష్కరణలను పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకుంది. అక్టోబర్ 2024లో ప్రారంభమైన టెక్‌ఎక్స్‌పెడైట్ అద్భుతమైన స్పందనను పొందింది. గేమింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంపాక్ట్-డ్రివెన్ ఇన్‌క్లూజివ్ టెక్నాలజీ అనే మూడు కేంద్రీకృత విభాగాలలో 330 కంటే ఎక్కువ స్టార్టప్‌లు దరఖాస్తు చేసుకున్నాయి. ఈ జాబితా నుండి, వారి వృద్ధి, మార్కెట్ ప్రభావాన్ని వేగవంతం చేయడానికి రూపొందించిన ఇంటెన్సివ్ యాక్సిలరేటర్ ప్రోగ్రామ్ కోసం 17 ఆశాజనక స్టార్టప్‌లు ఎంపికయ్యాయి.

కెఎల్‌హెచ్ అజీజ్‌నగర్ క్యాంపస్‌లో కొత్త డేటా అనలిటిక్స్ శిక్షణ

హైదరాబాద్: కెఎల్‌హెచ్ అజీజ్‌నగర్ క్యాంపస్ శుక్రవారం కె సి పుల్లయ్య ఫౌండేషన్, టెక్ మహీంద్రా ఫౌండేషన్‌తో ఒక అవగాహన ఒప్పందంపై సంతకం చేసినట్లు ప్రకటించింది. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం మూడు నెలల ఇంటెన్సివ్ నైపుణ్య అభివృద్ధి శిక్షణా కార్యక్రమం, తదుపరి ప్లేస్‌మెంట్ సహాయం ద్వారా కెఎల్‌హెచ్ విద్యార్థులను అవసరమైన పరిశ్రమ నైపుణ్యాలతో సాధికారపరచడం లక్ష్యంగా పెట్టుకుంది. వృత్తిపరమైన పోటీ అధికంగా కలిగిన వాతావరణంలో అవకాశాలను అందిపుచ్చుకొవటానికి, రాణించడానికి అవసరమైన సామర్థ్యాలతో విద్యార్థులను సన్నద్ధం చేయడానికి ఈ కార్యక్రమం ప్రత్యేకంగా రూపొందింది. కెఎల్‌హెచ్ అజీజ్‌నగర్ క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ అకెల్ల, కె సి పుల్లయ్య ఫౌండేషన్ సీఈఓ సుధా చల్లా, హైదరాబాద్‌లోని టెక్ మహీంద్రా ఫౌండేషన్ విద్య, ఉపాధి కల్పన మేనేజర్ సుమన కొత్తపల్లితో కలిసి సంతకాల కార్యక్రమానికి నాయకత్వం వహించారు.

పది భాషల్లో 'అనంత్ డిజైన్' పరీక్ష

హైదరాబాద్: ఇంటీరియర్ తదితర డిజైనింగ్ విద్యార్థుల కోసం నిర్వహించే ప్రవేశ పరీక్ష, అనంత్ డిజైన్ ఎంట్రన్స్ అండ్ ప్రొఫిషియెన్సీ టెస్ట్ (ఏడీపీటీ)ను 10 భాషలకు విస్తరించారు. గతంలో 5 భాషలకే పరిమితమైన ఈ పరీక్షను ఈసారి 10 భాషల్లో నిర్వహించనున్నట్లు అనంత్ నేషనల్ యూనివర్శిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆంగ్ల, హిందీ, గుజరాతీ తదితర భాషలతోపాటు తెలుగులో కూడా నిర్వహించనున్నామని, ఆన్‌లైన్ ద్వారా ఈ ప్రవేశ పరీక్ష ఈనెల 26న జరగనుందని వివరించారు.

ప్రసారానికి సిద్ధమైన 'ఎంటీవీ రోడీస్' డబుల్ క్రాస్ అల్టిమేట్ అడ్వెంచర్

ముంబయి: ఐకానిక్‌గా 20వ ఏడాదిలోకి అడుగుపెట్టిన, అత్యంత ప్రేక్షకాదరణ పొందిన రియాలిటీషో 'ఎంటీవీ రోడీస్' తన అభిమానులకు అత్యంత సాహసోపేతమైన, విలక్షణమైన సీజన్- 'ఎంటీవీ రోడీస్'డబుల్ క్రాస్! అందించేందుకు సిద్ధమైంది. ఇప్పటికే గుర్తింపు దక్కించుకున్న ఈ రియాల్టీ షో ఇప్పటి సీజన్‌తో వీక్షకుల్లో మరింత ఉత్కంఠతను పెంచుతూ, ప్రపంచంలో అన్ని చోట్లాకనిపించే ద్రోహం, అరుదుగా కనిపించే నమ్మకాల ప్రతి కదలికకు రెండు వైపులా పదునున్న కత్తిగా కొనసాగుతుంది. ఈ సీజన్‌లో, అభిమానులు ఉత్కంఠతతో కూడిన ప్రయాణాన్ని చేస్తారు. అవతార్ స్పోర్ట్స్ న్యూట్రిషన్, పోకో సహకారంతో రూపొందుతున్న, హీరో కరిజ్మా 'ఎంటీవీ రోడీస్' డబుల్ క్రాస్, జనవరి 11న ప్రతి శని, ఆదివారాలు సాయంత్రం 7 గంటలకు జియో సినిమాలో ప్రసారం అవుతుంది. ఈ ఉత్సాహభరితమైన షోను, ఓజీ రోడీ రణ్విజయ్ సింఘా వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు.

2024లో మెర్సిడిస్-బెంజ్ రెండంకెల వృద్ధిరేటు

ముంబయి: మెర్సిడెస్ బెంజ్ 1994 నుంచి భారతదేశంలో 2,00,000 లగ్జరీ కార్లతో 'మోస్ట్ డిజైరబుల్' లగ్జరీ కార్ బ్రాండ్‌గా నిలిచింది. గత 1,00,000 యూనిట్లు కేవలం ఆరేళ్లలోనే (2019-2024) వచ్చాయి, ఇది మెర్సిడెస్ బెంజ్ కారును సొంతం చేసుకోవాలని భారతీయుల్లో పెరుగుతున్న ఆకాంక్షను ప్రతిబింబిస్తుంది. సాటిలేని కస్టమర్ అనుభవాలు, కొత్త ఉత్పత్తి ఆవిష్కరణ, కస్టమర్ సర్వీస్, బీఈవీ ఛార్జింగ్ కోసం మెరుగైన లగ్జరీ నెట్‌వర్క్ రీచ్ మీద దృష్టి సారించి భారతదేశంలో మెర్సిడెస్ బెంజ్ వ్యూహంగా 'డిజైర్ టు ఎక్సీడ్' కొనసాగుతోంది. 2024 జనవరి-డిసెంబర్ మధ్య కాలంలో 19,565 యూనిట్ల అమ్మకాలు (జనవరి-డిసెంబర్ 2023: 17,408 యూనిట్లు, 12.4%), హెచ్2 2024 (జూలై-డిసెంబర్ 24) వృద్ధి 16 శాతంగా ఉంది. టాప్-ఎండ్ వెహికల్ (టీఈవీ) అమ్మకాలు 30% వైటీడీ వృద్ధితో వేగంగా పెరిగాయి. 2024లో భారతదేశంలో విక్రయించిన ప్రతి నాలుగు మెర్సిడిజ్ బెంజ్ కార్లలో ఒకటి టీఈవీ. మెర్సిడెస్ బెంజ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పోర్ట్ ఫోలియో రూ.10,000 కోట్లు దాటిందని మెర్సిడిస్ బెంజ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ సంతోష్ అయ్యర్ తెలిపారు.

18వ పీబీడీ ఉత్సవాల్లో భారతీయ మిషన్లు

న్యూఢిల్లీ: ఒడిశాలోని భువనేశ్వర్‌లో జనవరి 8-10 వరకు జరిగిన 18వ ప్రవాసీ భారతీయ దివస్ (పీబీడీ) కన్వెన్షన్ భారతదేశంలోనే కాకుండా ప్రపంచంలోని వివిధ దేశాలలో కూడా అత్యంత ఉత్సాహంగా జరుపుకుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయ మిషన్లు, కాన్సులేట్‌లు ఈ కార్యక్రమంలో వాస్తవంగా పాల్గొని వారి స్వంత శక్తివంతమైన కార్యక్రమాలను నిర్వహించాయి. సీషెల్స్‌లోని భారత హైకమిషన్ పీబీడీ ప్రారంభోత్సవం ప్రత్యేక ప్రదర్శనను నిర్వహించగా, చిలీలోని భారత రాయబార కార్యాలయం ప్రారంభ కార్యక్రమాలను ప్రదర్శించడానికి ఇదే విధమైన కార్యక్రమాన్ని నిర్వహించింది. సౌదీ అరేబియాలోని రియాద్‌లో, భారత రాయబార కార్యాలయం ప్రముఖ కళాకారుడు మహ్మద్ వకీల్ ప్రదర్శించిన గజల్‌లు, పాటలతో కూడిన సజీవ సాంస్కృతిక సాయంత్రం నిర్వహించింది. భువనేశ్వర్‌లో, అధ్యక్షురాలు ద్రౌపది ముర్ము శుక్రవారం 27 మంది వ్యక్తులకు ప్రవాసీ భారతీయ సమ్మాన్ అవార్డులను అందించారు.

సంపాదకీయం

'ఇండియా' అనైక్య సంఘటన

"ఇండియా" ఐక్య సంఘటనకు లక్ష్య సిద్ధి, లక్ష్య శుద్ధి రెండూ లోపించినట్టున్నాయి. మోదీ నాయకత్వంలో, హిందుత్వ, విద్వేషపూరిత రాజకీయాలు పెరిగిపోయినందువల్ల బీజేపీని నిలవరించడం కోసం ఏర్పడిన "ఇండియా" ఐక్య సంఘటన లక్ష్యాన్ని సాధించకుండానే చిందరవందర అయిపోతున్నట్టుంది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్ ఎన్నికలలోనే "ఇండియా" ఐక్య సంఘటనలో పొరపొచ్చాలు బహిరంగమైనాయి. ఆ తరవాత మహారాష్ట్ర, హర్యానా శాసనసభ ఎన్నికలలో ఈ విభేదాలు మరింత స్పష్టంగా కనిపించాయి. ఇప్పుడు ఢిల్లీ శాసనసభ ఎన్నికలు ఈ విభేదాలను శాశ్వతం చేసే ప్రమాదం కనిపిస్తోంది. ఏ ప్రతిపక్ష ఐక్య సంఘటనలో అయినా కాంగ్రెస్ అనివార్యంగా ఉండి తీరవలసిందే. "ఇండియా" ఐక్య సంఘటనలో అతి పెద్ద పార్టీ అయిన కాంగ్రెస్ వ్యవహార సరళి ప్రతిపక్షాలను ఐక్యంచేసే రీతిలో లేదు. అలాగే రాష్ట్రాలలో బలంగా ఉన్న ప్రాంతీయ పార్టీలు తమ అధికారం నిలబెట్టుకోవాలన్న తపన ముందు ప్రతిపక్ష ఐక్యత గురించి ఖాతరు చేయడంలేదు. ఢిల్లీలో 2013 శాసనసభ ఎన్నికలలో ఆమ్ ఆద్మీ పార్టీ రెండవ అతి పెద్ద పార్టీగా అవతరించినా కాంగ్రెస్ మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగింది. కానీ జనలోక్ పాల్ బిల్లుకు కాంగ్రెస్ మద్దతు ఇవ్వనందువల్ల 49 రోజులకే కేజ్రీవాల్ ప్రభుత్వం రాజీనామా చేసింది. 2015లో మళ్లీ శాసనసభ ఎన్నికలు జరిగేదాకా అక్కడ రాష్ట్రపతి పాలన ఉండేది. 2015 ఎన్నికలలో ఆమ్‌ఆద్మీ పార్టీ మొత్తం 70 స్థానాల్లో 67 సీట్లు సంపాదించింది. 2020 ఎన్నికలలో 62 స్థానాలు సంపాదించింది. ఈ సీట్ల సంఖ్యనుబట్టి ఢిల్లీలో ఆమ్‌ఆద్మీ పార్టీకి ఎదురులేదని అనిపించవచ్చు. కానీ కేంద్రంలో సహా దేశంలో అనేక చోట్ల అధికారంలో ఉన్న బీజేపీ ఢిల్లీలో మాత్రం అధికారం సాధించలేక పోయింది. బీజేపీ ఇది తమకు అవమానంగా భావిస్తోంది. ఈ సారి ఎలాగైనా ఢిల్లీ శాసనసభను స్వాధీనం చేసుకోవాలనుకుంటోంది. కేజ్రీవాల్ పదేళ్లుగా ముఖ్యమంత్రిగా ఉన్నారు కనక ఆయన ప్రభుత్వంపై సహజంగానే ఎంతో కొంత అసంతృప్తి ఉంటుంది కనక లబ్ధి పొందవచ్చునన్నది బీజేపీ వ్యూహం. ఈ వ్యూహం ఫలించాలంటే ఫిబ్రవరిలో జరిగే శాసనసభ ఎన్నికలలో ఆమ్‌ఆద్మీ పార్టీకి కాంగ్రెస్ ఎంత గట్టి పోటీ ఇస్తే బీజేపీకి అంత లాభం. పంజాబ్‌లో తమ పార్టీ ప్రభుత్వం ఉంది కనక, గుజరాత్‌లో 12 శాతం ఓట్లు సంపాదించాం కనక, 2024లో జమ్మూలో జరిగిన ఎన్నికలలో దోడా నుంచి తమ పార్టీ అభ్యర్థి గెలిచారు కనక కేజ్రీవాల్ తమ పార్టీకి ఎదురు లేదనుకుంటున్నారు. కానీ ప్రజల్లో అసంతృప్తి కూడా తక్కువేమీ లేదు. ఈ విషయాన్ని కేజ్రీవాల్ గ్రహించడంలేదు. ఆమ్‌ఆద్మీ పార్టీ ఏర్పడినప్పటి నుంచీ కేజ్రీవాల్ కాంగ్రెస్ ఓట్లు కొల్లగట్టడం మీదే దృష్టి పెట్టారు. 2024 ఆరంభంలో జరిగిన లోక్‌సభ ఎన్నికలలో ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ సీట్ల సర్దుబాటు చేసుకుని పోటీ చేశాయి. కానీ రెండు పార్టీలకూ దక్కింది ఏమీ లేదు. ఢిల్లీలోని ఏడు లోక్‌సభ స్థానాలనూ బీజేపీ ఎగరేసుకు పోయింది.

ఇప్పుడు కూడా ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో గెలిచి తీరుతాం అన్న విశ్వాసంతో కేజ్రీవాల్ ఉన్నారు. అందుకే కాంగ్రెస్‌తో పొత్తు లేదని ముందే ప్రకటించారు. అంటే ఢిల్లీలో ముక్కోణపు పోటీ అనివార్యం అవుతోంది. మూడు పార్టీలూ తమ అభ్యర్థుల జాబితా ప్రకటించేశాయి. ఈ లోగా ఆమ్ ఆద్మీ పార్టీతో అంతంత మాత్రం ఉన్న సఖ్యతను చెదరగొట్టడానికి ఢిల్లీలో శక్తిమంతుడిననుకునే అజయ్ మాకెన్ ఆమ్‌ఆద్మీ పార్టీ మీద తీవ్ర విమర్శలు చేశారు. ఆయన మీద చర్య తీసుకోకపోతే కాంగ్రెస్‌ను "ఇండియా" ఐక్య సంఘటన నుంచి తొలగించాలని కోరతామని ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు విలేకరుల సమావేశం పెట్టి మరీ చెప్పారు. దీనితో కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ పార్టీల మధ్య సంబంధాలు మరింత బెడిశాయి. ఢిల్లీ శాసనసభ ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ పార్టీ మధ్య సఖ్యత మాయమైనందువల్ల "ఇండియా" ఐక్య సంఘటనకే ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంది. "ఇండియా" ఐక్యసంఘటన చుక్కాని లేని నావలా తయారైంది. పేరుకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే "ఇండియా" ఐక్య సంఘటనకు నాయకుడనుకుంటున్నారు. మహారాష్ట్ర, హర్యానా శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ నడవడికవల్ల "ఇండియా" ఐక్య సంఘటన మరింత బలహీనపడింది. దీనికి పూర్తి బాధ్యత కాంగ్రెస్‌దే. మధ్యప్రదేశ్ శాసనసభ ఎన్నికల సమయంలో అఖిలేశ్ యాదవ్ నాయకత్వంలోని సమాజ్‌వాదీ పార్టీకి ఒక్క సీటైనా ఇవ్వడానికి కాంగ్రెస్ అంగీకరించనందువల్ల కాంగ్రెసే నష్ట పోయింది. "ఇండియా" ఐక్య సంఘటన సమావేశమే జరగడంలేదు. ఈ ఐక్యసంఘటన లక్ష్యం ఏమిటో తెలియడం లేదని కశ్మీర్ ముఖ్యమంత్రి ఉమర్ అబ్దుల్లా నిట్టూర్పు విడుస్తున్నారు. ఢిల్లీ శాసనసభ ఎన్నికలలో ఆమ్‌ఆద్మీ పార్టీకే మద్దతు ఇవ్వాలని సమాజ్ వాదీ పార్టీ మొదలైనవి నిర్ణయించుకున్నాయి. ఇది కచ్చితంగా కాంగ్రెస్ వైఖరికి నిరసనే. నిజానికి ఈ పార్టీలకు ఢిల్లీలో అస్తిత్వమే లేదు. కానీ ఐక్యసంఘటనలో సఖ్యత లేదనడానికి ఈ మాత్రం విభేదాలు చాలు. "ఇండియా"కు కాంగ్రెస్ సమర్థమైన నాయకత్వం అందించడం లేదన్న భావన భాగస్వామ్య పక్షాలన్నింటిలో ఉంది. అందుకే ఆర్.జె.డి. నాయకుడు లాలూ ప్రసాద్ యాదవ్ ఐక్య సంఘటన నాయకత్వం మమతా బెనర్జీకి అప్పగించాలని సూచించారు. ఎన్.సి.పి. నాయకుడు శరద్ పవార్ కూడా మమతా బెనర్జీ సమర్థమైన నాయకురాలనడం కాంగ్రెస్ మీద విశ్వాసం లేకపోవడానికి సంకేతం. ఈ సంవత్సరమే బీహార్‌లోనూ ఎన్నికలు జరగనున్నాయి. అక్కడ ఆర్.జె.డి. బలంగా ఉంది. కానీ ఆ పార్టీ అసలు నాయకుడు తేజస్వీ యాదవ్‌కు కూడా కాంగ్రెస్ మీద అంత విశ్వాసం ఉన్నట్టు కనిపించడం లేదు. 2026లో అసోం ఎన్నికలలో కూడా కాంగ్రెస్ బీజేపీని ఒంటరిగా ఎదుర్కోవాల్సిందే. పుదుచ్చేరి, తమిళనాడులో కాంగ్రెస్ బలమైన డి.ఎం.కె.కు ఒదిగి ఉండక తప్పదు. బెంగాల్‌లో మమతా బెనర్జీకి ఇప్పట్లో ఎదురు ఉండే అవకాశమే లేదు. దేశ విస్తృత ప్రయోజనాల కోసం ఇతర పార్టీలను కలుపుకుని పోవడానికి కాంగ్రెస్ సిద్ధపడకపోతే మతతత్వాన్ని ఎదిరించడం, రాజ్యాంగాన్ని పరిరక్షించడం లాంటి లక్ష్యాలన్నీ డొల్లగానే మిగిలిపోక తప్పదు. 2027లో ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, మణిపూర్, గుజరాత్, గోవాలో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉంది. ఈ రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీల సహకారం లేకపోతే కాంగ్రెస్‌కు తీవ్ర నష్టం కలుగుతుంది. ఐక్య సంఘటనలో పెద్ద పార్టీగా కాంగ్రెస్ చేయవలసింది పెద్దన్న పాత్ర పోషించడం కాదు. పెద్దరికం చూపించి ప్రతిపక్ష నావకు చుక్కానిలా వ్యవహరించడం.

రాష్ట్రానికి రెండు ప్రభుత్వాల మోసం

సోమ మర్ల

ఆంధ్రప్రదేశ్‌కి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర అన్యాయం చేయడానికి పూనుకున్నాయి. విశాఖపట్నం స్టీలుప్లాంటు (ఆర్ఐఎన్ఎల్) ను నిర్లక్ష్యం చేసి ప్రైవేటు వ్యక్తులకు విక్రయించేందుకు పూనుకోవడమేగాక బ్రిటన్ ఆధారిత స్టీల్ బహుళజాతి కంపెనీ ఆర్సిల్లర్‌మిట్టల్‌ను విశాఖపట్నం స్టీలుప్లాంట్‌కి కొన్ని మైళ్ల దూరంలో మరొక స్టీలు ప్లాంట్‌ను స్థాపించేందుకు సిద్ధపడ్డాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బ్రిటన్ స్టీలు కంపెనీకి వేగంగా అనుమతులివ్వడానికి ఏర్పాట్లుచేస్తోంది. ఉచిత విద్యుత్తు, భూమి, నీరు ఉచితంగా సరఫరా చేయడమేకాక జీఎస్‌టీ, ఇతర పన్నులను రద్దుచేయడానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రస్తుతం తీసుకుంటున్న చర్యలు ఎన్నికల సందర్భంగా చేసిన వాగ్దానాలకు పొంతన ఉండడం లేదు. ఆర్ఐఎన్ఎల్ ప్రభుత్వ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించబోనని ఎన్నికల సమయంలో వాగ్దానం చేశారు. ఇయితే ఇటీవల ఆర్సిల్లర్ మిట్టల్ స్టీటుప్లాంటును తమ రాష్ట్రానికి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి కోరారు. కొన్ని సొంత ముడిఇనుము బ్లాకులను ప్రభుత్వరంగ ఆర్ఐఎన్ఎల్ కంటే ప్రైవేట్‌రంగానికి తక్కువగా సరఫరా చేస్తారు. ఆర్ఐఎన్ఎల్ ప్రస్తుత ఉత్పత్తిని కొనసాగించేందుకుగాను ముడిఇనుము బ్లాకులు ఎంతగానో అవసరం. అయితే వీటికోసం రాష్ట్ర ప్రభుత్వం కనీసం అడగలేదు. ఆర్ఐఎన్ఎల్‌ను బలహీనపరచి క్రమంగా దాని ఆర్థికబలాన్ని దిగజార్చేందుకు, చివరికి ముక్కలు ముక్కలుగా విడదీసి ప్రైవేటుపరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఏనాడో నిర్ణయించింది. అయితే ప్రధాని మోదీ ఎన్నికల ప్రచార సమయంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదాను ఇవ్వలేదు. అలాగే స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన బొగ్గు, ఇతర అవసరాలు తీరుస్తానని వాగ్దానం చేశారు. అయితే రాష్టానికి చేసిన వాగ్దానాలను అమలు పరచలేదు. ఇటీవల ప్లాంటు బ్లాస్ట్ ఫర్నేస్‌లను మూసివేశారు. ఇది ఉత్పత్తి చేసే అనేక పరికరాలు ఆగిపోయాయి. సర్వీసు యూనిట్లను ప్రైవేటీకరించారు. ఉద్యోగులకు నాలుగునెలలపాటు వేతనాలు, అంతకుముందు చెల్లించవలసిన బకాయిలను చెల్లించలేదు. ఆర్ఐఎన్ఎల్‌ను ఎలాగైనా ప్రైవేటీకరించడానికి కేంద్రం అన్ని ఏర్పాట్లు చేసింది. అయినా గత ముఖ్యమంత్రిగాని, ప్రస్తుత ముఖ్యమంత్రిగాని రాష్ట్రాలకు అనుకూలంగా నిర్ణయం తీసుకోలేదు.

చెప్పుకోదగిన ఉత్పత్తి:

విశాఖ ఉక్కు, ఆంధ్రుల హక్కు అంటూ మహత్తర ఉద్యమాన్ని నిర్వహించి డజన్ల మంది ప్రాణాలు కోల్పోయారు. సీపీఐ, సీపీఎం సభ్యులు ఉధృతంగా ఆందోళన చేశారు. రెండు కమ్యూనిస్టు పార్టీల శాసన సభ్యులు, పార్లమెంట్ సభ్యులు స్టీలు ప్లాంటును స్థాపించాలని కోరుతూ రాజీనామా చేశారు. దాదాపు నాలుగు దశాబ్దాల పోరాటం అనంతరం 1982లో స్టీలు ప్లాంట్‌ను స్థాపించారు. వెనుకబడిన ఆంధ్రప్రాంతంలో పారిశ్రామికీకరణ, అభివృద్ధికోసం ఈ స్టీల్ ప్లాంట్ గణనీయమైన పాత్ర వహించింది. దాంట్లో అత్యంత విలువైన యంత్రపరికరాలు ఉన్నాయి. అనేక వేలమంది కాంట్రాక్టు కార్మికులేగాక, పర్మనెంటు ఉద్యోగులు 16వేల మంది పనిచేస్తున్నారు. అత్యంత విలువైన యంత్ర పరికరాలు ఉన్నాయి. వాటిలో అత్యంత శక్తిమంతమైన ఫర్నేస్‌లు ఉన్నాయి. ఏడాదికి 63.3 మెట్రిక్ టన్నుల స్టీలు ఉత్పత్తి జరుగుతోంది. ఈ ఉత్పత్తి విలువ 23వేల కోట్లు ఉంటుంది. విక్రయానికి తలపెట్టిన తర్వాత అత్యంత నాణ్యమైన వైర్‌కాయిల్స్, రాడ్‌లు-బార్‌లు, బల్లెట్లు, బిల్లెట్స్ ప్రపంచ మార్కెట్‌లలో రికార్డుస్థాయిలో 7.3టన్నులు విక్రయించడం జరుగు తుంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో అంతక్రితం సంవత్సరం కంటే ఎక్కువగా 43శాతం వృద్ధి ఉత్పత్తి జరిగింది. ప్రైవేటురంగంలోనూ లేదా ప్రభుత్వ రంగంలోనూ ఉన్న ఇతర స్టీలు ప్లాంట్లకంటే ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న స్టీలు ప్లాంటు ఉత్పత్తి ఎక్కువగా ఉంటుంది. ఈ ప్లాంటు విస్తీర్ణం 19వేల730 ఎకరాలు. దీని విలువ 2లక్షల కోట్ల రూపాయలు ఉంటుంది. ఈ ప్లాంటును అతి తక్కువ రేటుకు అదానీలాంటి మోదీ స్నేహితులకు అప్పగించాలని ప్రయత్నం చేశారు.

సమ్మెచేస్తున్న కార్మికులు : ప్రభుత్వరంగ యూనిట్లను, ఆస్తులను అత్యంత దుర్మార్గంగా ప్రైవేటీకరించేందుకు గత ఎనిమిదేళ్లుగా ప్రస్తుత ఎన్‌డీఏ ప్రభుత్వం తలపెట్టింది. వీలైతే ఇతర స్టీలు ప్లాంట్లకు అప్పచెప్పేందుకు సిద్ధపడింది. విశాఖ స్టీలు ప్లాంటులో అనేక ఉత్పత్తి యూనిట్లను మూసివేయడం, ముక్కలుముక్కలుగా ప్రైవేటీకరిచడం, కేంద్ర నిధులను అందించకుండా ఆపివేయడం, ఉత్పత్తిని దెబ్బతీయడం, బొగ్గు ముడిఇనుము సరఫరా చేయకపోవడం వంటి దుర్మార్గ చర్యలకు కేంద్రం పూనుకుంది. ఉద్యోగులకు చెల్లించవలసిన వేతనాలను ప్లాంట్‌ను నడిపేందుకు వినియోగించారు. వేతనాలు, బకాయిలను చెల్లించాలని, ప్లాంట్‌ను ప్రైవేటీకరించవద్దని దాదాపు 1400 రోజులకూ పైగా ఏఐటీయూసీ, సీఐటీయూ తదితర యూనియన్ల ఆధ్వర్యంలో ఉద్యోగులు, కార్మికులు సమ్మె చేస్తున్నారు. వివిధ ఆర్థికరంగాలలో మౌలిక సదుపాయాలు, భవనాలు, తదితరాల అభివృద్ధికోసం భారీగా స్టీలు అవసరం. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఏ దేశంలోనూ లేని విధంగా భారతదేశంలో అత్యాధునిక స్టీలు ప్లాంట్‌ను నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. భిలాయ్, బొకారో తదితర గొప్ప స్టీలుప్లాంట్లను నిర్మించేందుకు ఒకనాటి సోవియట్ యూనియన్ ఎంతో ఆదరంగా సహకరించింది. 1980వ దశాబ్దం చివరిలో అన్ని విధాలుగా సాంకేతిక సహాయాన్ని, ఇతర మౌలికసదుపాయాలను నాణ్యమైన స్టీల్ ఫర్నేస్‌ల సహాయం చేసింది. గత రెండు దశాబ్దాలలో గడిచిన కేంద్ర ప్రభుత్వాలు విజయ వంతంగా నిర్వహించాయి. కేంద్రం మన రాష్ట్రాన్ని సవతితల్లిగా చూస్తోంది. ఈ ప్లాంటును ప్రైవేటీకరించ వద్దని ఉద్యోగులు, కార్మికులు, రాష్ట్ర ప్రజలు ఆందోళన చేస్తున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దగా పట్టించుకోవడంలేదు. కేంద్రం ఒకే ఒక ప్రైవేటు స్టీలు ప్లాంట్‌కు 13 ముడిఇనుము గనులను కేటాయించింది గానీ విశాఖ స్టీల్‌ను ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. ఆర్ఐఎన్ఎస్ విస్తృతంగా ఉద్యోగావకాశాలు కల్పించి ప్రజలకు ఎంతో మేలు చేసింది. అన్ని ట్రేడ్‌యూనియన్లతోపాటు వామపక్ష పార్టీలుకూడా ఐక్యకార్యాచరణ సమన్వయకమిటీని ఏర్పాటుచేసి సుదీర్ఘకాలంగా పోరాటం చేస్తున్నప్పటికీ రెండు ప్రభుత్వాలు రాష్ట్ర ప్రజలను మోసం చేసేందుకు పూనుకున్నాయి.

(మెయిన్ స్ట్రీమ్ సౌజన్యంతో)

దుఃఖం గురించి...

చక్రవాకం

- ముక్కాముల చక్రధర్

దుఃఖం గురించి మాట్లాడరేం. నలుగురు కూర్చుని నవ్వే వేళే కాదు... దుఃఖించే సమయం గురించి కూడా పలవరించరేం. దుఃఖం దేహంలో భాగమని గుర్తించరేం. భోరున ఏడిస్తే... దుఃఖం ప్రవాహమైతే మనసులు తేలికపడతాయని గ్రహించరేం. అసలు దుఃఖం నుంచి దూరంగా ఎందుకు జరుగుతారు. దుఃఖం నుంచి ఎందుకు పారిపోదా మనుకుంటారు. దుఃఖం జీవికకు ఓ వాహిక. దుఃఖం బతకడానికి ఓ మాత్ర. దుఃఖం మనిషిగా మలిచే ఓ సమున్నతం. అవును, దుఃఖమంటే మనదే కాదు. మన ఒక్కరిదే కూడా కాదు. దుఃఖం సర్వాజనీనం. దుఃఖం అందరి కళ్ల నుంచి ఏక రూపంలో వచ్చే పావన గోదావరి. ఎదుటి వారు దుఃఖంలో ఉన్నప్పుడు నన్ను లాగి కొట్టి రెండు కన్నీటి బొట్లు రాల్చేలా చేయి అంటాడు దుఃఖం గురించి కవి వసీరా. ఎదుటి వారి కష్టం మనదైనప్పుడే కదా దుఃఖం విలువ తెలిసేది. అదొక్కటేనా... మన విలువ కూడా తెలిసేది ఆ కన్నీళ్లతోనే కదా... నీవి నాలుగు బొట్ల కన్నీరు కాదు. నాలుగు జీవితాలకు ఓ స్వాంతన. నవ్వినా... ఏడ్చినా కన్నీళ్లే వస్తాయి అని కదా విన్నాం. అపరిమితమైన నవ్వుకి ఫుల్‌స్టాప్ కన్నీళ్లే కదా. వాటినే కదా ఆనంద భాష్పాలు అంటున్నాం. నవ్వుకి వయసు అడ్డు వస్తుందేమో కాని దుఃఖానికి రాదుగా. దేశ ప్రధానిగా అత్యున్నత పదవిని స్వీకరించిన అటల్ బిహారీ వాజపేయ్ మరణిస్తే ఆ ఎనిమిది పదులు స్నేహితుడు లాల్ కృష్ణ అద్వానీ బహిరంగంగానే దుఃఖించారు కదా. మన ముళ్లపూడి వెంకట రమణకీ అంతే. ముళ్లపూడి ఇక సెలవంటూ వెళ్లిపోతే ఆయన దశాబ్దాల ప్రాణ సఖుడు బాపు కన్నీరు పెట్టుకోవడం చూశాం కదా. దుఃఖంతో మనం చెట్టా పట్టాలేసుకుని తిరగాలి. ఇద్దరం ఒకే కంచంలో తిని, ఒకే మంచంపై నిద్రించాలి.

ఊరెళ్తూ దుఃఖాన్ని కూడా మన బట్టలతో పాటు సూట్‌కేస్‌లోనో, బ్యాగులోనో సర్దుకోవాలి. మనల్ని దింపడానికి బస్టాండుకో, రైల్వే స్టేషన్‌కో, ఎయిర్‌పోర్ట్‌కో కొందరు వస్తారు కదా... వారంతా దుఃఖిస్తూనే చేతులూపుతారు. వారి దుఃఖాన్ని చూశాక ఆ బస్సులోనో, రైలులోనో, విమానంలోనో సర్దుకుని కూర్చున్నాక ఆ సూట్‌కేస్ మనకి తెలియకుండానే ఓపెన్ అవుతుంది. మనకి తెలియకుండా విమానం కిటికీ రెక్కల నుంచి కిందకి చూస్తూ రెండు కన్నీటి బొట్లు రాలుస్తాం. అదన్నమాట దుఃఖం అంటే.

నవ్వుల్లో రకరకాలుంటాయి. చిలిపిగా నవ్వడం, ఓరకంట నవ్వడం, వికటాట్టహాసం చేయడం, విరగబడి నవ్వడం. హేళనగా నవ్వడం, కేరింతలు కేరింతలుగా నవ్వడం. దుఃఖంలో మాత్రం దుఃఖమే ఉంటుంది. దానికి మారుపేర్లు ఉండవు. అయిన వాళ్ల కోసం కొందరు ప్రతి రోజూ దుఃఖించ వచ్చు. ఎన్నాళ్లైనా దుఃఖానికి అలసట రాదు. గుర్తొచ్చినప్పుడల్లా కళ్లు కన్నీటి చెలమలవుతాయి. మనిషిలో మానవత్వం బతికి ఉందని లోకానికి చెప్పేది నీ దుఃఖమే. నీ ఆనందం నీకు మాత్రమే పరిమితం. ఎవరి దుఃఖమైనా సామాజికమే. పుట్టిన వెంటనే మనతో తోడుగా వచ్చే ఆ కన్నీటి దుఃఖాన్ని చూసి ఎందుకు భయపడడం. లోకానికి మన ఉనికిని తెలియజేసే దుఃఖం చేతులు పట్టుకుని దర్జాగా లోకం మీదకి వస్తున్నాం కదా. పెరిగి పెద్దయ్యాక ఆ దుఃఖానికి దూరంగా జరగడానికే నిరంతం ఎందుకు ప్రయత్నిస్తారు. ఆవలింతలకి అన్నలుంటారు. నవ్వుకి నాన్న లుంటారేమో కాని దుఃఖానికి మాత్రం నువ్వే తోడు. నీ దుఃఖం నిన్ను మాత్రమే పునీతుడ్ని చేస్తుంది. ప్రజాకవి కాళోజీకి నవ్వు కంటే ముందు కన్నీరు వచ్చేది. ప్రతి చిన్న విషయానికి చలించిపోయే వారు. దుఃఖం తన భుజాన వేళ్లాడే సంచిలో నిరంతరం ఆయనతో పాటే ఎక్కడికైనా వచ్చేది. ఎవరు మరణించారని తెలిసినా ముందుగా దుఃఖించే వారు కాళోజీ.

"అమరుడయ్యాడను...
ఆకాశతార అవుతాడను...
ఒక మనిషి మరణించడమంటే

మానవత్వం ఊపిరి బిగపట్టడం" అంటాడు నా ప్రపంచ కవి వరవరరావు. అలా ఈ లోకం విడిచి ఎవ్వరైనా వెళ్లిపోయారని కాళోజీకి తెలిసిన వెంటనే వారెవ్వరో తెలియకపోయినా దుఃఖించే వారు. ఓసారి నేను చేసిన ఇంటర్వ్యూలో కాళోజీని ఇదే అడిగాను... "మీరు మాటి మాటికి కన్నీరవుతారేమని". దానికి కాళోజీ రెండు చేతులతో కళ్లను తుడుచుకుంటూ "మనిషికి దుఃఖం చేరువైనట్లుగా నవ్వు దగ్గర కాలేదు. మీరు మీ ఇంటర్వ్యూ అయ్యాక వెళ్లిపోతారు. మళ్లీ ఎప్పుడు కలుస్తామో అని నా దుఃఖం" అన్నారు. వృత్తిలో భాగంగా ఒక్కసారి కలిసిన నేనే మళ్లీ ఎప్పుడు కలుస్తావో అని దుఃఖిస్తున్నావంటే... "ఆహా... ఎంత గొప్పవాడివయ్యా కాళోజీ" అని అనుకున్నాను. ఆ తర్వాత చాలాసార్లు కలిశాను. హైదరాబాద్‌లోను, వరంగల్‌లోనూ. కలవగానే మా తొలి సమావేశాన్ని గుర్తు చేసేవాడ్ని. అయినా ఆయన దగ్గర నుంచి వీడ్కోలు తీసుకుంటున్న ప్రతిసారి చిన్న పిల్లాడు అయ్యే వారు కాళోజీ.

దుఃఖాన్ని చులకనగా చూడకండి. దుఃఖాన్ని హేళనగా పరిహసించకండి. దుఃఖాన్ని ఏడుపుగొట్టుది అనకండి. దుఃఖం దివ్య ఔషధం. దుఃఖం సర్వాంతర్యామి. దుఃఖం ఉదయాన్నే వచ్చే లేలేత సూర్య కిరణం. అలా ప్రారంభమై మధ్యాహ్నానికి ఉధృతమై... సాయంత్రానికి చల్ల బడుతుంది. సంతోషం సగమే బలం. దుఃఖం సంపూర్ణ బలం.

సీనియర్ జర్నలిస్టు, 9912019929

ఆంధ్రలో తొలితరం కమ్యూనిస్టులు - 2

ఆర్వీ రామారావ్

పూర్తిగా సాంప్రదాయిక కుటుంబంలో పుట్టినా పురోగమన దృష్టి ఉంటే జనం కోసం పాటు పడేలా, కమ్యూనిస్టుగా మారడంలో అవాంతరం ఏమీ ఉండదు. ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీ తొలి కార్యదర్శి పోలేపెద్ది నరసింహమూర్తి సరిగ్గా అలాంటి వారే. ఆయనను "కామ్రేడ్" అని పిలిచేవారు. ఆయనది ఆదర్శప్రాయమైన జీవితం. పోలేపెద్ది 1931లో శాసనోల్లంఘోద్యమంలో పాల్గొని జైలుకెళ్లారు. జైలులో "బి" క్లాసు కేటాయించినా కాదని "సి" క్లాసు ఖైదీలతోనే కలిసి గడిపారు. హైస్కూల్ చదువు పూర్తి అయిన తరవాత పై చదువుల కోసం బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం వెళ్లారు. అక్కడ చంద్ర రాజేశ్వర రావు, చంద్ర రామలింగయ్య, పొన్నం వీర రాఘవయ్య లాంటి వారితో కలిసి మార్క్సిజం అధ్యయనం చేశారు. కాంగ్రెస్ నిర్వహిస్తున్న పోరాటాలు విఫలం అయినందువల్ల అసంతృప్తి పెరగడం, మార్క్సిజంపై గురిపెరగడంతో విప్లవ కార్యక్రమాలపై ఆయనకు ఆసక్తి పెరిగింది. కార్మిక వర్గంతో కలిసి పని చేయడానికి బి.ఎ. పూర్తి చేయకుండానే బెనారస్ విశ్వవిద్యాలయం వదిలి స్వస్థలం తెనాలి చేరారు. జొన్నలగడ్డ రామలింగయ్య, మాడభూషి వెంకటాచార్యతో కలిసి గుంటూరు జిల్లా కమ్యూనిస్టు బృందం ఏర్పాటు చేశారు. సత్యాగ్రహంలో పాల్గొని జైలుకెళ్లొచ్చిన యువతను కూడగట్టి కమ్యూనిస్టు పార్టీ స్థాపనకు కృషి చేశారు. ఆంధ్ర ప్రాంతంలో 1934కు ముందే సోషలిస్టు భావాలు వ్యాపించాయి. కమ్యూనిస్టు పార్టీ ఏర్పడింది. పోలేపెద్ది నరసింహమూర్తి ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా నియమితులయ్యారు. పుచ్చలపల్లి సుందరయ్య కృషి వల్ల 1934 సెప్టెంబర్‌లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కామ్రేడ్లు సమావేశమై ఏడుగురు సభ్యులతో కూడిన రాష్ట్ర కమ్యూనిస్టు ఆర్గనైజింగ్ కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీకి సుందరయ్య కార్యదర్శి. పోలేపెద్ది కమిటీ సభ్యులు. 1935

ఏప్రిల్ 17వ తేదీన గుంటూరు జిల్లా కమ్యూనిస్టుల మొదటి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జొన్నలగడ్డ రామలింగయ్య, మాడభూషి వెంకటాచారి, ప్రతాప రామసుబ్బయ్య, పెండ్యాల లోకనాథం, కుందేటి రాజకోటి, మందా పుల్లారావు, పులుపుల వెంకట శివయ్య, ముత్తేవి మాధవాచార్యతో సహా మొత్తం 17మంది పాల్గొన్నారు. ఐదుగురితో జిల్లా కమిటీ ఎన్నికైంది. 1936లో ఆంధ్రరాష్ట్ర సోషలిస్టు పార్టీ సమావేశంలో సుందరయ్య రాజద్రోహ ప్రసంగం చేశారన్న ఆరోపణపై అరెస్టు చేస్తే పోలెపెద్ది కమిటీ కార్యదర్శిగా బాధ్యత చేపట్టారు. అప్పుడు కమ్యూనిస్టుపార్టీ నిషేధంలో ఉన్నందువల్ల పుస్తకాలు, పత్రికలు సేకరించే బాధ్యత తీసుకున్నారు. సైక్లోస్టైల్ చేసిన తెలుగు, ఇంగ్లీషు పత్రికలు, లండన్ నుంచి వెలువడే "రష్యా టుడే", "ఇంటర్నేషనల్ అఫేర్స్" పత్రికలు సంపాదించే వారు. నరసింహ మూర్తి కుటుంబానికి తెనాలిలో 12 ఎకరాల మాగాణి, పట్టణ నడిబొడ్డులో పెద్ద పెంకుటిల్లు ఉండేవి. కానీ కుటుంబం పెద్దది. సంపాదనాపరులు లేకపోవడంతో అది క్రమంగా కరిగి పోయింది. ఆయన కుటుంబం క్రమంగా దారిద్ర్యంలోకి దిగజారి కొన్ని సార్లు పస్తులు పడుకోవలసి వచ్చేది. అన్నంలోకి ఏమీ లేక ఉప్పునీళ్లు కలిపి తినేవాళ్లు. నరసింహమూర్తి విరామం లేకుండా పార్టీ కార్యక్రమాల్లో మునిగి తేలినందువల్ల ఆరోగ్యం క్షీణించింది. 1947 డిసెంబర్ 7న కన్ను మూశారు.

పులుపుల శివయ్య:

పులుపుల శివయ్య అంటే ఇప్పుడు గుర్తు పట్టేవారు తక్కువే కావొచ్చు. కానీ "పలనాడు వెలలేని మాగాణిరా" పాట చెవిన పడని పురోగమనవాదులు ఎవరూ ఉండరేమో! కమ్యూనిస్టు పార్టీ నాయకులుగా ఎదిగిన మాకినేని బసవ పున్నయ్య, మోటూరి హనుమంత రావు, వై.వి.కృష్ణారావు, వేములపల్లి శ్రీకృష్ణ, ఎల్.బి.గంగాధర రావు, టి.వెంకటేశ్వర రావు లాంటి వారికి కమ్యూనిజం పాఠాలు చెప్పిన ధీశాలి పులుపుల శివయ్య. ఆయన యువజన, కార్మిక నేత. శివయ్య ప్రాథమిక విద్యార్థిగా ఉన్నప్పుడు గుర్రం జాషువా తెలుగు ఉపాధ్యాయుడిగా ఉండే వారు. శివయ్య 1933లో బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం వెళ్లారు. అక్కడ

పోలేపెద్ది నరసింహమూర్తి

పులుపుల శివయ్య

ఆర్.ఎస్.ఎస్. అగ్రనేత అయిన గోల్వాల్కర్‌తో పరిచయం అయి ఆ శిబిరంలో చేరినా ఆ సంస్థ మత దురహంకార వైఖరి మింగుడుపడక వెంటనే బయలుదేరి వచ్చారు. అప్పుడు బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో విద్యార్థులుగా ఉన్న పోలేపెద్ది నరసింహ మూర్తి, చంద్ర రాజేశ్వర రావు, తుమ్మల వెంకటరామయ్య మొదలైన వారి సాంగత్యంలో శివయ్య కమ్యూనిస్టు పార్టీ పలక మీద ఓనమాలు నేర్చుకున్నారు. 1934లో పరీక్షలు పూర్తి అయిన తరవాత కాశీ నుంచి ఒక ట్రంకు పెట్టె నిండా కమ్యూనిస్టు సాహిత్యం తీసుకొచ్చి కమ్యూనిస్టు స్రవంతి ఆంధ్రలో ప్రవహించడానికి కారకుల్లో ప్రధానమైన వారయ్యారు. 1935 ఏప్రిల్ 17న గుంటూరులో జరిగిన కమ్యూనిస్టు పార్టీ తొలి సమావేశంలో శివయ్య కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. పార్టీ మొదటి మహాసభల్లో పోలేపెద్ది రాష్ట్ర కార్యదర్శిగా నియమితులవడంతో శివయ్య జిల్లా పార్టీ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. గుంటూరులో పార్టీ కార్యకర్తలను పోషించడానికి, పార్టీని నిర్మించడానికి నండూరి ప్రసాదరావుతో కలిసి ఫ్రెండ్స్ హోం భోజనశాల నడిపారు. అదే సమయంలో గుంటూరు పట్టణంలోనూ, జిల్లా వ్యాప్తంగానూ కూలీ రక్షణ సంఘం, ప్రెస్ వర్కర్స్ యూనియన్, ముఠా కార్మిక సంఘం, మునిసిపల్ కార్మిక సంఘం నిర్మించి వారి హక్కులకోసం పాటుపడ్డారు. గుంటూరులోని హాస్టల్‌ను కేంద్రంగా చేసుకుని బలమైన విద్యార్థి ఉద్యమం నిర్మించి విద్యార్థులెందరినో కమ్యూనిస్టులుగా దిద్ది తీర్చారు. డిటెన్షన్ విధానానికి వ్యతిరేకంగా 1937-38లో ఏ.సి. కళాశాలలో నిర్వహించిన విద్యార్థి ఉద్యమంలో పరోక్షంగా ప్రధాన పాత్ర నిర్వహించారు. కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం కోసం పులుపుల శివయ్య ఆంధ్ర ప్రాంతం అంతా విస్తృతంగా పర్యటించారు. 1937 ప్రారంభంలో జరిగిన తూర్పు గోదావరి జిల్లా కమ్యూనిస్టు పార్టీ మహాసభకు అధ్యక్షత వహించారు. రాష్ట్రంలో అంతకు ముందు ఎక్కడా జరగని రీతిలో రోమన్ కాథలిక్ చర్చిలో పాటిస్తున్న కుల, మత భేదాలకు నిరసనగా సమ్మె నిర్వహించి శివయ్య చరిత్ర సృష్టించారు. 1937లో కొత్తపట్నం, 1938లో మంతెనవారి పాలెంలో జరిగిన కమ్యూనిస్టు పార్టీ వేసవి రాజకీయ పాఠశాలకు సిలబస్ తయారు చేసింది శివయ్యే. ఆ పాఠశాలకు ప్రిన్సిపల్‌గా వ్యవహరించారు. ఈ పాఠశాలకు హాజరైన వారిలో అనేకమంది తరవాత కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రధాన భూమిక నిర్వహించారు. జాతీయోద్యమంలో, కమ్యూనిస్టు ఉద్యమంలో శివయ్య జైలు శిక్షలకు గురయ్యారు. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో 1943లో రహస్య జీవితం గడుపుతూ అరెస్టయ్యారు. 21 నెలలు జైలు శిక్ష విధిస్తే శివయ్య బళ్లారిలోని అల్లీపురం జైలు గోడలు బద్దలుకొట్టుకుని బయటకొచ్చారు. తరవాత మళ్లీ ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించారు. 1952, 1962 ఎన్నికలలో రెండు సార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ఉద్యమ సందర్భంగా శాసనసభ్యత్వానికి రాజీనామా చేశారు. కుందుర్తి, ఏల్చూరి, బెల్లంకొండ రామదాసు కలిసి రాసిన తొలి అభ్యుదయ కవితా సంకలనం "నయాగరా" ప్రచురించింది శివయ్యే. మార్క్సిస్టు చింతనతో సృష్టించిన సాహిత్యంతో తెలుగు నేలను ప్రభావితం చేసిన శివయ్య సోవియట్ యూనియన్‌లో పర్యటిస్తూ 1976 జులై 14న మాస్కోలో మరణించారు.

జీఎస్టీతో పేదల దోపిడి : ఖర్గే

న్యూదిల్లీ: మోదీ ప్రభుత్వం రూపొందించిన వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) అంటే పేదలు, మధ్య తరగతి ప్రజలు కష్టపడి సంపాదించుకున్న సొమ్ములు దోచుకోవడమేనని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. ఈ 'పన్ను ఉగ్రవాదం', దోపిడీలకు వచ్చే బడ్జెట్‌లో అంతం పలకాలని డిమాండ్ చేశారు. జీఎస్టీలో పేర్కొన్న తొమ్మిది రకాల పన్ను రేట్లు ఈ విధానాన్ని సరళతర ప్రక్రియగా మార్చడానికి బదులు సంక్లిష్ట అసంబద్ధమైందిగా మారుస్తున్నాయని ఆరోపించారు. 'బీజేపీకి చెందిన జీఎస్టీని మేము గబ్బర్‌సింగ్ పన్ను లేదా గృహ విధ్వంస పన్ను లేదా సీతారామన్ పన్ను అంటూ ఎలా పేర్కొంటున్నా... మోదీ ప్రభుత్వ జీఎస్టీ అంటే పేదలు, మధ్య తరగతి ప్రజల కష్టార్జితాన్ని దోచుకునేది అనడంలో సందేహం లేదు' అని ఖర్గే 'ఎక్స్'లో పేర్కొన్నారు. జీఎస్టీ వసూళ్లపై ప్రభుత్వ సంబరాలు పీడిత వర్గాల గాయాలపై కారం పూసినట్లుగా ఉందని ఆక్షేపించారు.

వ్యాపారికి రూ.210 కోట్ల కరెంట్ బిల్లు

సిమ్లా: విద్యుత్ సంస్థ లీలలు అన్నీ ఇన్నీ కావు. ఓ వ్యాపారికి ఏకంగా రూ.210 కోట్ల కరెంట్ బిల్లు ఇచ్చింది. దీంతో ఆ వ్యాపారి కంగుతిన్నాడు. హిమాచల్ ప్రదేశ్‌లోని హమీర్పూర్ జిల్లా జట్టాన్ గ్రామానికి చెందిన వ్యాపారి లలిత్ ధిమాన్‌కు ప్రతినెలా రూ.3 వేల లోపు కరెంట్ బిల్లు వచ్చేది. తాజాగా విద్యుత్ అధికారులు అతడికి రూ.210 కోట్ల బిల్లు ఇవ్వడంతో అవాక్కయ్యాడు. దీనిపై విద్యుత్ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేయగా విద్యుత్తు బిల్లు రికార్డులను పరిశీలించిన అధికారులు సాంకేతిక లోపం వల్లే అధిక విద్యుత్ బిల్లు వచ్చిందని పేర్కొన్నారు. బిల్లు రూ.210 కోట్లు కాదు... రూ.4,047 అని సవరించటంతో లలిత్ ఊపిరి పీల్చుకున్నాడు. గతంలోనూ చాలాసార్లు ఇటువంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. గతేడాది గుజరాత్‌లోని వల్సాద్ ప్రాంతంలో టైలరింగ్ దుకాణం నడిపే అన్సారీకి రూ.86 లక్షల బిల్లు వచ్చింది. దీంతో ఆయన అధికారులను ఆశ్రయించారు. అతని దుకాణానికి చేరుకున్న డిస్కం అధికారులు మీటర్‌ను పరిశీలించి... సాంకేతిక లోపం వల్ల మీటర్ రీడింగ్‌కు రెండు సంఖ్యలు చేరడంతో ప్రింట్ తప్పుగా వచ్చిందని పేర్కొన్నారు

అలహాబాద్ హైకోర్టు తీర్పు సరైందే: సుప్రీం



న్యూదిల్లీ: మధుర శ్రీకృష్ణ జన్మభూమి-షాహి ఈద్గా మసీదు వివాదంలో అలహాబాద్ హైకోర్టు ఆదేశాలను సుప్రీంకోర్టు శుక్రవారం సమర్థించింది. ఈ వివాదానికి సంబంధించి హిందూ ఫిర్యాదుదారు దాఖలు చేసిన 15 పిటిషన్‌లను న్యాయ ప్రయోజనాల దృష్ట్యా ఏకీకృతం చేయాలని అలహాబాద్ హైకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ ఆదేశాలను సవాలు చేస్తూ మసీదు కమటీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌తో కూడిన ధర్మాసనం... హైకోర్టు తీర్పును సమర్థించింది. ఇది వ్యాజ్యంలోని రెండుపక్షాలకు అనుకూలంగా ఉందని పేర్కొంది. విచారణను వాయిదా వేస్తున్నామని, ఏప్రిల్ 1 నుండి ప్రారంభమయ్యే వారంలో రిలిస్ట్ (పిటిషన్) చేస్తామని పేర్కొంది. ప్రార్థనా స్థలాలపై 1991 నాటి చట్టానికి సంబంధించిన సమస్యగా దీనిని పరిగణిస్తున్నట్లు తెలిపింది. ఈ సమయంలో పిటిషన్‌ల ఏకీకరణపై ఎందుకు జోక్యం చేసుకోవాలని ప్రశ్నించింది. అవసరమైతే... మీరు తర్వాత అభ్యర్థనను లేవనెత్తవచ్చని మసీదు కమిటీ తరఫు న్యాయవాదితో సీజేఐ చెప్పారు. మతపరమైన ప్రదేశాలు ముఖ్యంగా మసీదులు, దర్గాలను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు దేశంలోని న్యాయస్థానాలు తాజా వ్యాజ్యాలు, పెండింగ్‌లో ఉన్న వాటిపై సమర్థవంతమైన మధ్యంతర లేదా తుది ఉత్తర్వులు జారీ చేయకుండా, తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు నిషేధం విధిస్తున్నట్లు డిసెంబర్ 12న సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. వేర్వేరు వ్యాజ్యాలు కలిపి విచారణ చేపట్టడం వలన పరిస్థితి సంక్లిష్టతకు దారితీస్తుందని మసీదు కమిటీ న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేశారు.

ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురి హత్య

మీరట్: ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ జిల్లాలో దారుణం జరిగింది. ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు హత్యకు గురయ్యారు. భార్యాభర్తలిద్దరూ... వారి ముగ్గురి కుమార్తెలు దారుణ హత్యకు గురయ్యారని పోలీసులు వెల్లడించారు, లిసారి గేట్ పోలీసు స్టేషన్ పరిధిలోని సోహెల్ గార్డెన్‌లో ఈ విషాద ఘటన జరిగింది. ఇంట్లోనే ఐదుగురి మృతదేహాలను పోలీసులు వెలికితీశారు. భర్త మొయిన్, భార్య అస్మా మృతదేహాలు ఇంటి ఫ్లోర్‌పై ఉన్నాయి. ముగ్గురు కుమార్తెల మృతదేహాలు ఓ బెడ్‌లో దాచిపెట్టారు. పిల్లల శవాలను మంచంలో దాచి పెట్టి.. వారి ఆచూకీ తెలియకుండా చేసే ప్రయత్నం జరిగినట్లు తెలుస్తోంది. ఒకేసారి ఐదుగురు కుటుంబసభ్యుల్ని చంపడం వెనుక ఉన్న మిస్టరీని ఛేదించేందుకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ విషాద ఘటనతో స్థానిక ప్రజలు దిగ్భ్రాంతి చెందారు.

హిందీ జాతీయ భాష కాదు: అశ్విన్

చెన్నై: హిందీ కేవలం అధికార భాష మాత్రమేనని, జాతీయ భాష కాదని భారత దిగ్గజ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కీలక వ్యాఖ్యలు చేశారు. అశ్విన్ వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. తమిళనాడు రాజధాని చెన్నైలోని ఓ ప్రైవేటు కళాశాల స్నాతకోత్సవానికి అశ్విన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అక్కడి విద్యార్థులతో సరదాగా ముచ్చటించారు. ఇంగ్లీష్, తమిళ్, హిందీ భాషల గురించి విద్యార్థులను ప్రశ్నించారు. అయితే, హిందీ భాష గురించి ఒకరిద్దరి నుంచి మాత్రమే సమాధానం వచ్చింది. దీనిపై స్పందించిన క్రికెటర్... 'హిందీ అధికారిక భాష మాత్రమే. జాతీయ భాష కాదు' అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి..

దిల్లీలో ఉచితాల హోరు

అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పార్టీల జోరు
మరుగునపడిన ప్రధాన సమస్యలు
ఆందోళన చెందుతున్న దేశ రాజధాని వాసులు

న్యూదిల్లీ: అసెంబ్లీ ఎన్నికలకు ముందు దిల్లీలో రాజకీయ చర్చ ప్రస్తుతం 'ఉచితాల' చుట్టూనే నడుస్తోంది. దీంతో మౌలిక సదుపాయాల కల్పన, మహిళలపై నేరాలు, శాంతిభద్రతలు, కాలుష్యం సహా ఇతర ప్రధానాంశాలు మరుగునపడిపోయాయి. శుక్రవారం ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ దేశ రాజధానిలో పార్టీ తిరిగి అధికారంలోకి రాగానే సెక్యూరిటీ గార్డులను నియమించుకోవడానికి రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్‌లకు ఆర్థిక సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే, తన ఉచిత విద్యుత్, నీరు, వైద్యం, విద్య, మహిళల కోసం ప్రజా రవాణా కార్యక్రమాలను నొక్కి చెబుతూ, 'రేవ్డీ పర్ చర్చా' వంటి ప్రచారాలకు దిల్లీ మాజీ ముఖ్యమంత్రి నాయకత్వం వహిస్తున్నారు. మహిళలకు నెలవారీ రూ.2,100 నగదు సాయం, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో వృద్ధులకు ఉచిత వైద్యం అందించే సంజీవని పథకం, ముఖ్య మంత్రి మహిళా సమ్మాన్ యోజన వంటి కొత్త పథకాలను కూడా ప్రకటించింది. ఇక కాంగ్రెస్ తన 'ప్యారీ దీదీ యోజన'తో ముందుకొచ్చింది. మహిళలకు నెలకు రూ.2,500, 'జీవన్ రక్షా యోజన' తో పాటు రూ.25 లక్షల వరకు బీమా కవరేజీని అందజేస్తామని ప్రకటించింది. ఇదిలావుండగా, గృహాలకు 300 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు నెలకు రూ.2,500 భత్యాలు వంటి ముందస్తు పథకాలతో బీజేపీ త్వరలో తన మేనిఫెస్టోను ఆవిష్కరించే అవకాశం ఉంది. ఈ ఉచిత పథకాలను ఒకసారి 'ఉచిత కి రెవిడి' అని రద్దు చేసిన ప్రధాని నరేంద్ర మోదీ కూడా... బీజేపీ అధికారంలోకి వస్తే అన్ని సంక్షేమ పథకాలను కొనసాగిస్తుందని దిల్లీ ప్రజలకు భరోసా ఇవ్వవలసి వచ్చింది. 'ఓటమిని ఎదుర్కొంటున్న ఈ ఆప్-దా ప్రజలు అయోమయంలో ఉన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఈ పథకం ఆపివేయడం జరుగుతుందని వారు దిల్లీ వాసులను భయపెడుతున్నారు. కానీ బీజేపీ పాలనలో ఏ పథకం ఆగిపోదని దిల్లీ వాసులకు భరోసా ఇచ్చేందుకు వచ్చాను. కానీ ఈ పథకాలలో అవినీతికి పాల్పడిన వారిని ఏరివేస్తాను' అని మోదీ చెప్పారు. కేంద్రంలో, దిల్లీలో 'డబుల్ ఇంజిన్' బీజేపీ ప్రభుత్వానికి ఓటు వేయాలని ప్రజలను కోరారు.

కాలుష్యం... శాంతిభద్రతలు క్షీణించడంతో ఆందోళన

రాజకీయ పార్టీల ఉచిత పథకాల ప్రకటనలు ఓటర్ల దృష్టిని ఆకర్షిస్తున్నందున, కాలుష్యం, ముఖ్యంగా ప్రతి శీతాకాలంలో దిల్లీని ఉక్కిరిబిక్కిరి చేసే పొగమంచు వంటి క్లిష్టమైన సమస్యలు పెద్దగా పరిష్కారం కావడం లేదు. వాయు కాలుష్యాన్ని ఎదుర్కోవడానికి కచ్చితమైన కార్యాచరణ ప్రణాళికలు లేకపోవడం గురించి చాలా మంది దేశ రాజధాని వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇది దిల్లీ వాసులకు తీవ్రమైన ఆరోగ్య ప్రమాదాన్ని కలిగిస్తుంది. దేశ రాజధానిలో వాయు నాణ్యత సూచి (ఏఐక్యూ) 490 దాటింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) ప్రకారం గత ఏడాది నవంబరు 'తీవ్రమైన ప్లస్' కేటగిరీలోకి వచ్చింది. విషపూరితమైన గాలి వల్ల చాలా మంది ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. యమునా నదిలో అమ్మోనియా అధిక స్థాయిలో ఉండటంతో నీటి శుద్ధి కర్మాగారాలు నీటిని శుద్ధి చేయలేక పోవడంతో దిల్లీ వాసులు నగరమంతటా తాగునీటి విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాజధాని దిల్లీలో వర్షాకాలంలో రోడ్లపై గుంతలు, అలాగే డ్రెయినేజీ మ్యాన్‌హోల్స్ కారణంగా అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. దిల్లీలోని రాజిందర్ నగర్ కోచింగ్ సెంటర్ భవనం అండర్‌గ్రౌండ్‌లోకి వరద నీరు చేరడం, డీసిల్టింగ్ లేకపోవడం వల్ల యూపీఎస్సీ శిక్షణ పొందుతున్న ముగ్గురు నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన నివాసితులకు సౌకర్యాల లేమిపై దేశ రాజధాని వాసులలో ఆగ్రహాన్ని రేకెత్తించింది. మరోవైపు, దిల్లీ కూడా అనేక శాంతిభద్రతల సమస్యలను ఎదుర్కొంది. నగరంలో చురుకుగా ఉన్నట్లు చెప్పబడిన వివిధ ముఠాల ప్రమేయం కారణంగా అనేక ప్రదేశాలలో తుపాకీ కాల్పులు జరుగుతున్నాయి. దీనికితోడు మహిళలపై నేరాలు పెరిగాయి. ఉచిత సంక్షేమ పథకాల వాగ్దానాలు చాలా మంది ఓటర్లను ఆకర్షిస్తున్నప్పటికీ, ఈ వ్యవస్థాగత ప్రధాన సమస్యలను పరిష్కరించడం దేశ రాజధాని నగరం దీర్ఘకాలిక అభివృద్ధికి చాలా ముఖ్యమైనదని కొందరు వాదిస్తున్నారు.

ఇది ఓటుకు నగదు లేదా ఓటుకు నోటు!

ఉచితాలపై స్పందిస్తూ, భారతీయ లిబరల్ పార్టీ అధ్యక్షుడు మునీష్ కుమార్ రైజాడా పీటీఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ 'కేజ్రీవాల్ గత 10 సంవత్సరాలలో పాలన పరంగా పూర్తిగా విఫలమయ్యారు. ఆయన ఉచితాల సంస్కృతిని ప్రోత్సహించి, అదే సమయంలో పాలన, విధాన రూపకల్పనను స్తంభింపజేశారు' అని ఆరోపించారు. ఉద్యోగాల కల్పన, కాంట్రాక్టు ఉద్యోగులకు పరిష్కారం కనుగొనడం వంటి ఇతర ప్రధాన సమస్యలను ఆప్ ప్రభుత్వం విస్మరించిందని తెలిపారు. 'యువకులు నిరుద్యోగులుగా ఉన్నప్పుడు కేజ్రీవాల్ కేవలం కొన్ని రెవారీలు ఇచ్చారు. ఇప్పుడు అన్ని రాజకీయ పార్టీలు ఓటర్లను ప్రలోభపెట్టి వారిపై నగదు విసిరి ముందుకు సాగుతున్నాయి. ఇది ఓటుకు నగదు లేదా ఓటుకు నోటు. ఇంతకంటే అనైతికం మరొకటి ఉండదు' అని రైజాదా చెప్పారు. బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్‌పీ) కేంద్ర సమన్వయకర్త నితిన్ సింగ్ మాట్లాడుతూ 'ఈ పార్టీలు ప్రకటిస్తున్న ఉచితాలన్నీ అబద్ధాలే. వారు ప్రజల కనీస అవసరాలను తీర్చినట్లయితే, ఇటువంటి నకిలీ కట్టుబాట్ల అవసరం ఉండేది కాదు. దిల్లీలో ప్రస్తుత పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. అందుకే ప్రభుత్వం కొత్త పథకాలను ప్రవేశపెడుతోంది' అని తెలిపారు. 70 మంది సభ్యుల దిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి 5న ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి 8న ఓట్ల లెక్కింపు తర్వాత ఫలితాలు వెల్లడికానున్నాయి.

దేశ నిర్మాణమే మా సంస్థ ప్రధాన లక్ష్యం

చైర్మన్ వ్యాఖ్యలపై వివరణ ఇచ్చిన ఎల్‌అండ్‌టీ

న్యూదిల్లీ: ఉద్యోగులు వారానికి 90 గంటలు పని చేయాలని, ఆదివారాలు సైతం కార్యాలయాలకు వెళ్లాలని ఎల్‌అండ్‌టీ చైర్మన్ ఎస్.ఎన్. సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారి తీస్తున్నాయి. 'ఎప్పుడూ ఇంట్లోనే ఉంటూ ఏం చేస్తారు... ఎంతసేపని భార్య ముఖం తదేకంగా చూడగలరు' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు దుమారం లేపాయి. ఆయన వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అన్ని వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత పెల్లుబికుతోంది. పలువురు సెలబ్రిటీలు సైతం ఆయన వ్యాఖ్యలను తప్పుపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎల్‌అండ్‌టీ చైర్మన్ వ్యాఖ్యలపై కంపెనీ స్పష్టతనిచ్చింది. దేశ నిర్మాణమే తమ సంస్థ ప్రధాన లక్ష్యం అని పేర్కొంది. గత ఎనిమిది దశాబ్దాలకు పైగా దేశ మౌలిక సదుపాయాలు, పరిశ్రమలు, సాంకేతిక సామర్థ్యాలను ఎల్ అండ్‌టీ మెరుగుపరిచిందని వివరించింది. అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగే క్రమంలో అసాధారణ ఫలితాలు సాధించాలంటే అసాధారణమైన కృషి అవసరమని పేర్కొంది. ఈ విస్తృత లక్ష్యాన్నే చైర్మన్ వ్యాఖ్యలు ప్రతిబింబిస్తాయని వివరణ ఇచ్చింది. ఇదిలా ఉండగా, ఇటీవల ఎల్‌అండ్‌టీ ఉద్యోగులతో ఆన్‌లైన్‌లో సుబ్రహ్మణ్యన్ సమావేశమయ్యారు. సంస్థలో వారానికి ఆరు రోజుల పని విధానాన్ని అమలు చేయడాన్ని ఓ ఉద్యోగి ప్రశ్నించారు. దీనికి సమాధానంగా... 'ఆదివారాలు కూడా మీతో పని చేయించలేకపోతున్నందుకు నేను బాధపడుతున్నాను. మీతో ఆదివారాలు సైతం పని చేయిస్తే చాలా సంతోషపడతాను. ఎందుకంటే, నేను ఆదివారాలు కూడా పని చేస్తున్నాను. ఎంత సేపు ఇంట్లో కూర్చుంటావు... నీ భార్యను అలా తదేకంగా చూస్తూ ఉండగలవు... ఆఫీసుకు వెళ్లి పని చేయడం ప్రారంభించు' అని ఆయన వ్యాఖ్యానించారు. అంతటితో ఆగని సుబ్రహ్మణ్యన్.. వారానికి 90 గంటలు పని చేయాలని సైతం ఆయన సెలవిచ్చారు. తాను ఓ చైనా వ్యక్తితో మాట్లాడానని, ఆ దేశ కార్మికులు వారానికి 90 గంటలు పని చేస్తారని, అమెరికన్లు 50 గంటలే పని చేస్తారు కాబట్టి కొన్ని రోజుల్లో అమెరికాను చైనా దాటేస్తుందని ఆ వ్యక్తి చెప్పినట్టు సుబ్రహ్మణ్యన్ చెప్పుకొచ్చారు. 'మీరు కూడా ప్రపంచంలో ఉన్నత స్థాయిలో ఉండాలంటే వారానికి 90 గంటలు పని చేయండి' అని సుబ్రహ్మణ్యన్ పిలుపునిచ్చారు. ఉద్యోగుల వ్యక్తిగత జీవితాలను చిన్నచూపు చూసేలా ఆయన మాట్లాడుతున్నారని నెటిజన్లు మండిపడుతున్నారు.

దట్టమైన పొగమంచు... ఆరు వాహనాలు ఢీ

న్యూదిల్లీ: పొగమంచు కారణంగా దిల్లీ-లక్నో జాతీయ రహదారిపై అరడజనుకుపైగా వాహనాలు ఒకదానికొకటి ఢీ కొన్నాయి. దిల్లీ-ఎన్సీఆర్ ప్రాంతాన్ని శుక్రవారం ఉదయం దట్టమైన పొగమంచు కమ్మేసింది. ఫలితంగా చూపు స్పష్టత దారుణంగా పడిపోయింది. కొన్ని ప్రాంతాల్లో విజిబిలిటీ జీరోగా నమోదైంది. ఈ కారణంగా ముందు వెళ్తున్న వాహనాలు కనిపించని పరిస్థితి. ఫలితంగా ఆరుకుపైగా కార్లు ఒకదానికొకటి ఢీ కొన్నాయి. ఈ ఘటనలో ఆ కార్లు పూర్తిగా దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడినట్లు తెలిసింది. ఆ రహదారిపై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రంగంలోకి దిగిన అధికారులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. కాగా, చలి తీవ్రతకు ఉత్తరభారతం వణుకుతోంది. దేశ రాజధాని దిల్లీతోపాటు యూపీ, పంజాబ్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్ సహా వివిధ రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చలి తీవ్రత పెరిగింది. ఆయా ప్రాంతాలను దట్టమైన పొగ కమ్మేసింది. ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించని పరిస్థితి.

నేనూ మనిషినే... పొరపాట్లు జరుగుతాయి

నిఖిత్ కామత్ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో మోదీ

న్యూదిల్లీ: 'పొరపాట్లు జరుగుతుంటాయి. నేనూ మనిషినే... భగవంతుడిని కాదుగా' అని ప్రధాని నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. నరేంద్రమోదీ తొలిసారి ఓ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ప్రముఖ వ్యాపారవేత్త, జిరోదా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ నిర్వహిస్తోన్న పాడ్‌కాస్ట్‌లో అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరిద్దరూ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. దీనికి సంబంధించిన వీడియోను నిఖిల్ కామత్ తన యూట్యూబ్ ఛానల్‌లో పోస్ట్ చేశారు. అంతకుముందు ట్రైలర్‌ను మోదీ తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. అందులో ప్రధాని గతంలో చేసిన వ్యాఖ్యలను వీరు గుర్తుచేసుకున్నారు. తానూ మనిషినేనని, పొరపాట్లు జరుగుతాయని మోదీ అన్నారు. తొలుత ఈ వీడియో ట్రైలర్‌ను పోస్ట్ చేసిన నిఖిల్ కామత్... ఆ తర్వాత గంటల వ్యవధిలోనే పూర్తి వీడియో విడుదల చేశారు. దాదాపు 2 గంటల పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో రాజకీయాలు, వ్యవస్థాపకత, నాయకత్వ సవాళ్లు వంటి అనేక అంశాలపై ఇద్దరూ చర్చించుకున్నారు. ఆరంభంలో నిఖిల్ కామత్ మాట్లాడుతూ 'ప్రధానిని ఇంటర్వ్యూ చేస్తున్నానంటే ఒకింత భయంగా ఉంది' అని అన్నారు. దీనికి మోదీ బదులిస్తూ 'ఇదే నా తొలి పాడ్‌కాస్ట్. దీన్ని ప్రజలు ఎలా స్వీకరిస్తారో తెలియదు' అని చెప్పడంతో నవ్వులు విరిశాయి. రాజకీయాల్లోకి రావాలనుకునే యువతకు మీరిచ్చే సూచన ఏమిటని నిఖిల్ కామత్ అడగ్గా... 'రాజనీతి కలిగిన వ్యక్తులు రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉంది. ప్రజాసేవ చేయాలన్న దృక్పథంతో రాజకీయాల్లోకి రావాలి. సొంత లక్ష్యాలు నెరవేర్చుకోవడం కోసం కాదు' అని మోదీ సమాధానమిచ్చారు. మోదీ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చేసిన పాత ప్రసంగాల గురించి మాట్లాడుతూ 'అప్పుడు నేను ఏదో అని ఉంటాను. పొరపాట్లు జరుగుతుంటాయి. నేనూ మనిషినే... భగవంతుడిని కాదు కదా' అని వ్యాఖ్యానించారు. 'రాజకీయాల్లోకి వస్తారా అని యువతను అడిగితే అందుకు చాలా డబ్బులు ఉండాలి అని అంటున్నారు. సాధారణంగా ఇండస్ట్రీలో మేం స్టార్టప్ పెట్టాలంటే మా స్నేహితులనో, కుటుంబసభ్యులనో డబ్బులు అడుగుతాం. మరి రాజకీయాల్లో ఎలా' అని నిఖిల్ కామత్ ప్రధానిని అడిగారు. ప్రధాని బదులిస్తూ.. 'మా ఊర్లో ఓ డాక్టర్ ఉండేవారు. ఆయన మంచి కంటి వైద్య నిపుణుడు. తన దగ్గరకు వచ్చే వారిని ఎంతో ప్రేమగా, జాగ్రత్తగా చూసుకునేవారు. మంచి వక్త కూడా. ఓసారి ఆయన ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలనుకున్నారు. అప్పుడు నేను బాలసేనలో పనిచేస్తున్నా. ఆ వైద్యుడి వద్ద డబ్బులు లేకపోవడంతో తనకు తెలిసిన వారందరి దగ్గరకు వెళ్లి రూపాయి రూపాయి విరాళం తీసుకున్నారు. ఆ డబ్బుతో ఎన్నికల్లో పోటీ చేశారు. కేవలం రూ.250 మాత్రమే ఖర్చు చేశారు. అయినప్పటికీ ఎన్నికల్లో విజయం సాధించారు' అని మోదీ నాటి సంఘటనను వివరించారు. 'ఈ సమాజం వాస్తవాలను అంగీకరించదనేది నిజం కాదు. మనకు ఓపిక, అంకితభావం ఉండాలి. ఓట్ల కోసం ఏదైనా చేస్తామనుకునే కాంట్రాక్ట్ విధానాన్ని వదులుకోవాలి. అలాంటి వైఖరితో మీరు విజయం సాధించలేరు. ఈ ప్రజాస్వామ్య సమాజంలో ఓటరు కూడా ఓ రాజకీయ నాయకుడే. ఓటు వేసేటప్పుడు వారు ఎంతో ఆలోచించి నిర్ణయం తీసుకుంటారు' అని మోదీ వ్యాఖ్యానించారు.

మోదీ హయాంలో నేర రాజధానిగా దిల్లీ

కేజ్రీవాల్ విమర్శ

న్యూదిల్లీ: దిల్లీ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీజేపీపై ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్, దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ విమర్శల వేడి పెంచారు. 25 ఏళ్లుగా బీజేపీకి దిల్లీలో అధికారం దక్కలేనందువల్ల ఇక్కడి ప్రజలపై ద్వేషం పెంచుకుందని విమర్శించారు. అందుకే బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దిల్లీని 'భారతదేశానికి నేర రాజధాని'గా మారుస్తోందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు, గ్యాంగ్‌వార్‌లు నిత్యకృత్యమయ్యాయని, మహిళలు ఇంట్లో నుంచి అడుగు బయటపెట్టాలంటేనే వణికిపోతున్నారని అన్నారు. రోహింగ్యా చొరబాటుదారుల పేరుతో పూర్వాంచలి, దళితుల ఓట్లను పెద్దఎత్తున తొలగిస్తున్నారని ఆరోపించారు. ఈ చర్యలతో ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. తాము అధికారంలోకి వస్తే అపార్ట్‌మెంట్లకు ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బందిని నియమించుకోవడానికి రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు పూర్వాంచల్ ఓటర్లపై ఆయన చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ పూర్వాంచల్ సమ్మాన్ మార్చ్ పేరుతో కేజ్రీవాల్ నివాసం వెలుపల బీజేపీ కార్యకర్తలు పెద్దఎత్తున నిరసనకు దిగారు. నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు జల ఫిరంగులు ఉపయోగించడంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు కొంతమందిని అదుపులోకి తీసుకున్నారు.

నకిలీ వెబ్‌సైట్లతో అప్రమత్తంగా ఉండాలి

సుప్రీం

న్యూదిల్లీ: నకిలీ వెబ్‌సైట్ల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సుప్రీంకోర్టు సూచించింది. ఈ మేరకు ఓ హెచ్చరిక నోటీసును శుక్రవారం విడుదల చేసింది. సుప్రీంకోర్టు యూఆర్ఎల్‌తో వివిధ రకాల నకిలీ వెబ్‌సైట్లు... ప్రస్తుతం ప్రజలను మోసం చేస్తున్నట్లు ఆ నోటీసులో పేర్కొంది. ఆ వెబ్‌సైట్ల ద్వారా వ్యక్తిగత, గోప్యమైన సమాచారాన్ని సేకరిస్తున్నట్లు సుప్రీం ఆరోపించింది. అత్యున్నత న్యాయస్థానానికి చెందిన రిజిస్ట్రీ ఈ విషయాన్ని ధృవీకరించింది. పిషింగ్ అటాక్ జరుగుతున్న విషయం వాస్తవమే అని సుప్రీంకోర్టు రిజిస్ట్రీ స్పష్టం చేసింది. కొన్ని యూఆర్ఎల్స్‌తో సైబర్ నేరగాళ్లు వ్యక్తిగత సమాచారాన్ని సేకరిస్తున్నారు. అయితే ప్రస్తుతం చెలామణి అవుతున్న నకిలీ యూఆర్ఎల్స్‌కు చెందిన జాబితాను సుప్రీంకోర్టు విడుదల చేసింది. వ్యక్తిగతమైన, రహస్యమైన సమాచారాన్ని ఏమాత్రం బహిర్గతం చేయవద్దు అని కోర్టు తన నోటీసులో పేర్కొంది. ఒకవేళ సమాచారం ఇస్తే, దాన్ని సైబర్ నేరగాళ్లు దుర్వినియోగం చేసే అవకాశం ఉన్నట్లు కోర్టు తెలిపింది. ప్రజలెవరూ ఆ వెబ్ లింకులను క్లిక్ చేయరాదు అని సుప్రీం రిజిస్ట్రీ స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు రిజిస్ట్రీ వ్యక్తిగత సమాచారాన్ని అడగదన్న విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలని ఆ నోటీసులో తెలిపారు. ఞఞఞ.ంఎఱ.స్త్రశీఙ.ఱఅ అని ఉన్న వెబ్‌సైట్ మాత్రమే సుప్రీంకోర్టుకు చెందుతుందని, ఎప్పుడైనా ఏదైనా యూఆర్ఎల్ వస్తే, దాన్ని సరిచూసుకుని ఓపెన్ చేయాలని తన నోటీసులో తెలిపింది. ఒకవేళ మీరు పిషింగ్ బాధితుడైతే, తక్షణమే పాస్‌వర్డ్‌లు మార్చుకోవాలని సూచించింది. పిషింగ్ దాడులపై పోలీసులకు సమాచారం ఇచ్చామని, దర్యాప్తు జరుగుతున్నట్లు కోర్టు చెప్పింది.

'ఇండియా' శాశ్వతం... పోటీ కోసం కాదు

ఫరూక్ అబ్దుల్లా

శ్రీనగర్: ప్రతిపక్షాల కూటమి 'ఇండియా' ఐక్య సంఘటన శాశ్వతమని, ఇది కేవలం ఎన్నికల్లో పోటీ చేయడం కోసం కాదని జమ్మూకశ్మీర్ మాజీ సీఎం, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా అన్నారు. దేశాన్ని బలోపేతం చేయడం, ద్వేషాన్ని తొలగించడం కోసమని చెప్పారు. 'ఇండియా' ఐక్య సంఘటనలో భాగమైన ఆప్, కాంగ్రెస్ దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో పరస్పరం పోటీకి దిగుతున్నాయి. కూటమికి చెందిన టీఎంసీ, శివసేన (యూబీటీ) పార్టీలు ఆప్‌కు మద్దతు ప్రకటించాయి. ఈ నేపథ్యంలో కూటమి ఐక్యత, మనుగడపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కేవలం లోక్‌సభ ఎన్నికల కోసమే అయితే ఈ కూటమిని ముగించవచ్చని ఫరూక్ అబ్దుల్లా కుమారుడు, జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా సూచించారు. ఈ పరిణామాల నేపథ్యంలో 'ఇండియా' ఐక్య సంఘటన భవిష్యత్తుపై మీడియా అడిగిన ప్రశ్నకు ఫరూక్ అబ్దుల్లా సమాధానమిచ్చారు. ఈ కూటమి కేవలం ఎన్నికల్లో పోటీ చేయడం కోసం కాదని స్పష్టం చేశారు. దేశాన్ని బలోపేతం చేయడం, ద్వేషాన్ని తొలగించడం కోసమని చెప్పారు. 'ఈ కూటమి శాశ్వతం. ఇది ప్రతి రోజు, ప్రతి క్షణానికి సంబంధించినది' అని అన్నారు. అయితే ఒమర్ అబ్దుల్లా నేతృత్వంలోని ప్రభుత్వం కేంద్రంతో పోరాటం చేయదని పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్ సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తుందని చెప్పారు.

10వేల లోకో మోటివ్‌లలో 'కవచ్' ఏర్పాటు

రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్

చెన్నై: రైల్వే ప్రమాదాలకు అడ్డుకట్ట వేసేందుకు దేశవ్యాప్తంగా అన్ని రైళ్లల్లో ఆటోమేటిక్ రైలు రక్షణ వ్యవస్థ (ఏటీపీ) 'కవచ్'ను తీసుకువచ్చేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటోంది. దీనిలోభాగంగా 10వేల లోకోమోటివ్‌లలో ఈ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. 15 వేల కి.మీ. మేర ట్రాక్‌సైడ్ ఫిట్టింగ్‌లు చేస్తున్నామని, ఇంజిన్ల ముందు కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొత్తగా డిజైన్ చేసిన బోల్ట్‌లు బిగిస్తున్నారని, వీటిని బయటకు తీయడం సాధ్యం కాదని వెల్లడించారు. తమిళనాడు రాజధాని చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీని సందర్శించిన సందర్భంగా మంత్రి ఈ విషయాలు వెల్లడించారు. ఇటీవల రైలు ప్రమాదాలు, కొందరు దుండగులు పట్టాలపై ఎల్‌పీజీ సిలిండర్లు, సైకిళ్లు, ఇనుప రాడ్లు, సిమెంట్ ఇటుకలు పెట్టి... రైలుకు ప్రమాదం తలపెట్టేలా దుశ్చర్యలకు పాల్పడుతున్న వేళ రైలు ప్రయాణాన్ని సురక్షితంగా మార్చేందుకు కేంద్రం ఈ చర్యలు తీసుకుంటోంది. అద్దాల బోగీలో ఆహ్లాదకర ప్రయాణం చేసేలా కోచ్‌లలో కొన్ని మార్పులు చేశామని మంత్రి తెలిపారు. పర్యటకులను దృష్టిలో ఉంచుకొని సౌకర్యాలు మెరుగుపరిచామన్నారు. రాబోయే రోజుల్లో ఈ నూతన కోచ్‌లను జమ్మూకశ్మీర్ సర్వీసుల్లో ప్రవేశపెడతామని తెలిపారు.

అల్‌ఖైదా సభ్యుడి అరెస్టు



రాంచీ: అల్‌ఖైదా ఉగ్రవాద సంస్థతో సంబంధమున్న ఓ వ్యక్తిని రాంచీలో అరెస్టు చేశారు. దిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు షాహబాజ్ అనే సభ్యుడిని అదుపులోకి తీసుకున్నారు. అల్‌ఖైదా ఏక్యూఐఎస్ సంస్థతో అతడికి సంబంధమున్నట్లు అనుమానిస్తున్నారు. షాహబాజ్‌తో అనుబంధమున్న అనేక మందిని ఇప్పటికే అరెస్టు చేశారు. పరారీలో ఉన్న అతడి లొకేషన్‌ను రాంచీలో ట్రేస్ చేశారు. ఆ తర్వాత ఏటీఎస్ పోలీసుల సాయంతో స్పెషల్ సెల్ పోలీసులు అతడిని పట్టుకున్నారు.

విశాలాంధ్ర
హైదరాబాద్

మంత్రి సీతక్కను కలిసిన కృష్ణ నాయక్

విశాలాంధ్ర - ఆమనగల్లు : నాగార్జున సాగర్‌లో ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ ట్రైబల్ వేల్ఫార్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గిరిజన సాధికారిత శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసారి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకులు వడిత్యవత్ కృష్ణ నాయక్ సీతక్కను మర్యాద పూర్వకంగా కలిశారు.

వేంకటేశ్వరస్వామికి కార్పొరేటర్ ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - మల్కాజిగిరి : వైకుంఠ ఏకాదశి పర్వదిన సందర్భంగా న్యూ మీర్జాలగూడలోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ స్వామి వారి అనుగ్రహంతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రాము యాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మైనపల్లికి శుభాకాంక్షలు తెలిపిన కార్పొరేటర్

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు జన్మదిన సందర్భంగా నాందేడ్ లో జ్యోతిర్లింగ దర్శనం చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జితేంద్రనాథ్, సత్యనారాయణ, కపిల్, తదితరులు పాల్గొన్నారు.

పార్క్ మరమ్మత్తు పనులు పరిశీలించిన మేయర్

విశాలాంధ్ర - మేడిపల్లి: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఇందిరానగర్‌లో ఇందిరాగాంధీ విగ్రహం, పార్క్ మరమ్మత్తు పనులను శుక్రవారం బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహా రెడ్డి, స్థానిక కార్పొరేటర్ జక్కా పద్మ రాములు, వెంకటేష్ గుప్త, బోడుప్పల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బద్దుల శ్రీకాంత్ యాదవ్, కంటెస్టెడ్ కార్పొరేటర్లు పోగుల దిలీప్ రెడ్డి, జ్ఞనేశ్వర్, పోగుల వీర రెడ్డి, తోటకూర రవి యాదవ్, తోటకూర రాజు యాదవ్, బద్దుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయానికి మహిళా కాంగ్రెస్ విశేష కృషి

విశాలాంధ్ర - హైదరాబాద్ : మూడేళ్ల నుంచి టీపీసీసీ మహిళ కాంగ్రెస్ గత బిఆర్ఎస్ ప్రభుత్వంపై పోరాటం చేసి కాంగ్రెస్ విజయానికి కృషి చేసిందని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు అన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో మహిళ కాంగ్రెస్ రాష్ట్ర కార్యవర్గాన్ని ప్రకటించారు. టీపీసీసీ మహిళ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీత రావ్ అధ్యక్షతన స్టేట్ ఎగ్జిక్యూటివ్ మీటింగ్ జరిగిన సమావేశంలో 17 జిల్లాల ప్రెసిడెంట్‌కు రాష్ట్ర ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శుల నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా జాతీయ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆల్కలంబా ఆదేశాల మేరకు ఏఐసీసీ పిలుపు ఇచ్చిన అన్ని కార్యక్రమాలను విజయవంతం చేయాలని సూచించారు. నాలుగు సంవత్సరాల నుంచి టీపీసీసీ మహిళ కాంగ్రెస్ గత బిఆర్ఎస్ ప్రభుత్వంపై పోరాటం చేసి కాంగ్రెస్ విజయానికి కృషి చేసిందని అన్నారు. టీపీసీసీ మహిళ కాంగ్రెస్ గతంలో ఆన్లైన్ సభ్యత్వాలు చేసి ఎక్కువ సభ్యత్వం చేసిన వారికి ఏఐసీసీ మహిళ కాంగ్రెస్ చేసిన సూచనల మేరకు పదవులు ఇవ్వడం జరిగిందని సునీత రావ్ అన్నారు. 500 సభ్యత్వాలు చేసిన వారికి జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షులుగా నియమించడం జరిగిందని అందులో 17 జిల్లాలకు ఈ రోజు లేఖలు ఇవ్వడం జరిగిందని అన్నారు. అలాగే రాష్ట్ర ఉపాధ్యక్షులుగా 11 మంది, ప్రధాన కార్యదర్శులుగా 4 గురికి, 18 మందికి కార్యదర్శులుగా లేఖలు ఇవ్వడం జరిగిందని అన్నారు. మహిళ కాంగ్రెస్ రాష్ట్రంలో మహిళ కాంగ్రెస్ అభివృద్ధికి కృషి చేయాలని, ప్రభుత్వానికి అండగా ఉండాలని అన్నారు. కేంద్రంలో బీజేపీ చేస్తున్న నియంతృత్వ పాలనపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మిగతా పెండింగ్ జిల్లాల అధ్యక్షుల నియామకం త్వరలో చేపడుతామని సునీత రావ్ వివరించారు. ఈ కార్యక్రమంలో 17 జిల్లాల అధ్యక్షులు స్టేట్ ఉపాధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు సెక్రెటరీలు కార్యవర్గ సభ్యులు మొదలగు వారు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నారీ న్యాయ్ సమ్మేళనం కిట్స్ మెంబర్షిప్ చేసిన వారికి పంపిణీ చేయడం జరిగింది.

రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా

పథకాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో శుక్రవారం జిల్లా కలెక్టర్లతో సమావేశం జరిగింది. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్ల పథకాల అమలు, లబ్దిదారుల జాబితాల తయారీపై సీఎం కలెక్టర్లతో చర్చించారు. జనవరి 26న రిపబ్లిక్ డే నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలని నిర్ణయం చేశారు. ఈ నాలుగు పథకాల అమలుపై రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో గ్రామ సభ ల నిర్వహణ, మున్సిపాలిటీల్లో వార్డు సభలు నిర్వహించేందుకు వెంటనే సన్నాహాలు చేసుకోవాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. సిఎంతో పాటు సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావిస్తోందన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించిన కులగణన సర్వే 96 శాతం పూర్తి చేసినందుకు జిల్లా కలెక్టర్లకు అభినందనలు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెల్లేది కలెక్టర్లేనని, కలెక్టర్ల పని తీరే ప్రభుత్వ పనితీరుకు కొలమానం అని, కలెక్టర్లు తమ పనితీరును మరింత మెరుగుపరుచుకుని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని గతంలోనే ఆదేశాలు ఇచ్చామన్నారు. కానీ కొంతమంది ఇంకా ఆఫీసులలో కూర్చునే పని చేయాలని భావిస్తున్నారని, సమస్యలు వచ్చినప్పుడు సమర్ధవంతంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ యోగ్యం కాని భూములకు కూడా గతంలో రైతు పెట్టుబడి సాయం అందించారని, అనర్హులకు రైతు భరోసా ఇవ్వొద్దన్నారు. క్షేత్ర స్థాయిలో వెళ్లి అనర్హులను గుర్తించాల్సిందేనని, భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు మాత్రమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అని రాష్ట్రంలో వన్ రేషన్ వన్ స్టేట్ విధానాన్ని తీసుకురాబోతున్నామన్నారు. తెలంగాణలో ఒకరికి ఒకచోట మాత్రమే రేషన్ కార్డు ఉండాలని, ఈ నెల 11 నుంచి 15 లోగా పథకాల అమలుకు కావాల్సిన ప్రిపరేటరీ వర్క్ పూర్తి చేయాలని, కలెక్టర్లు ఇందిరమ్మ అర్హుల జాబితాను ఇంచార్జి మినిస్టర్ కు

సంక్రాంతికి 6432 ప్రత్యేక బస్సులు

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు అదనపు చార్జీలు వసూలు చేస్తే బస్సులు సీజ్ : మంత్రి పొన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : సంక్రాంతి పండుగ నేపథ్యంలో తెలంగాణ ఆర్టీసీ ప్రజల సౌకర్యార్థం 6432 ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయం తీసుకున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులు నేటి నుంచి నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులకు అవసరమైతే ఆర్టీసీ మరిన్ని బస్సులు నడపడానికి సిద్ధంగా ఉందని ఆర్టీసీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రతి మేజర్ బస్‌స్టేషన్ వద్ద ప్రత్యేక అధికారులు ప్రయాణికులకు ఇబ్బందులు కలవకుండా ఏర్పాట్లు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా బస్సుల్లో అదనంగా మహిళలు వచ్చా అవకాశం ఉందని అందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తూ ఎక్కడ ఇబ్బందులు కలిగించవద్దని అధికారులను ఆదేశించారు. మరోవైపు ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలకు మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. సంక్రాంతి పండగ పూట ప్రయాణికులను అదనపు చార్జీల పేరుతో దోపిడికి గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం కొనసాగుతున్న చార్జీలనే వసూలు చేయాలని అదనంగా వసూలు చేస్తే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు సీజ్ చేస్తామని తెలిపారు. ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు అదనంగా వసూలు చేస్తే ప్రయాణికులు రవాణాశాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రయాణికులకు సూచించారు. అధికారులు ఫీల్డ్ లోనే ఉండాలని నిరంతరం తనిఖీలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడ ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వెంటనే స్పందించాలని అదనపు చార్జీలు వసూలు చేసినట్లు తమ దృష్టికి వస్తే బస్సులు సీజ్ చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తమ ప్రభుత్వం ప్రయాణికుల భద్రత, సంక్షేమనికే ప్రాధానత్య కల్పిస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ గుర్తు చేశారు. ప్రయాణికులు పండగ సమయంలో జాగ్రత్తగా గమ్య స్థానాలకు వెళ్లాలని సూచించారు.

ఆరిక్ట్ ఇన్నోవేషన్ హబ్‌తో 300 కొత్త ఉద్యోగాలు

మంత్రి శ్రీధర్ బాబు

విశాలాంధ్ర - హైదరాబాద్ : నూతన ఆవిష్కరణల ప్రపంచ కేంద్రంగా, అంకుర సంస్థల చిరునామాగా తెలంగాణా దూసుకుపోతోందని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. నెదర్లాండ్స్‌కు చెందిన ఆరిక్ట్ సంస్థ రాయదుర్గంలో ఏర్పాటు చేసిన గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్ ను ప్రారంభించిన సందర్భంగా ఆయన ప్రసంగించారు. ఆరిక్ట్ నూతన ఫెసిలిటీ వల్ల 300 మందికి కొత్తగా ఉద్యోగాలు దొరుకుతాయని ఆయన అన్నారు. గడచిన రెండు దశాబ్దాల కాలంలో ఐటీ రంగం సాధించిన విప్లవాత్మక వృద్ధి వల్ల రాష్ట్ర జిడిపి, తలసరి ఆదాయం జాతీయ సరాసరిని మించిపోయిందని శ్రీధర్ బాబు తెలిపారు. "ఐటీ వార్షిక ఎగుమతులు 30 బిలియన్ డాలర్లకు చేరకున్నాయని చెప్పారు. రాష్ట్రంలో 6,000 అంకుర సంస్థలు ఏర్పాటయ్యాయన్నారు. చిన్న, మధ్య తరహా సాఫ్ట్ వేర్ సంస్థలు 1500 దాకా ఉన్నాయి. ప్రఖ్యాత సంస్థలు గ్లోబల్ సామర్థ కేంద్రాలు (జీసిసి) నెలకొల్పేందుకు ముందుకు వస్తున్నాయన్నారు. ఈ అనుకూల పరిస్థితుల వల్ల ప్రతిభావంతులైన యువతకు ఉపాధి అవకాశాలు బాగా మెరుగవుతున్నాయన్నారు. పరిశ్రమలకు నైపుణ్యమున్న మానవ వనరులు అవసరమన్నారు. ప్రభుత్వం ప్రారంభించిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో నైపుణ్యమున్న మానవ వనరులకు కేరాఫ్ అడ్రస్ గా తెలంగాణ నిలవబోతుందన్నారు. 'హైదరాబాద్ అంటే టాలెంట్ సిటీ. టెక్ సిటీ. ఇన్నోవేషన్ సిటీ. స్టార్టప్స్ కు కేరాఫ్ అడ్రస్.. ఒక్క సాఫ్ట్ వేర్ రంగంలోనే కాదు ఫార్మా, బయోటెక్ తదితర రంగాల్లోనూ అనేక పరిశ్రమలున్నాయన్నారు. అన్ని రకాల పరిశ్రమల ఏర్పాటుకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, మానవ వనరులు ఇక్కడ అందుబాటులో ఉన్నాయన్నారు. ఎమర్జింగ్ టెక్నాలజీస్‌లో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా తెలంగాణ యువతను తీర్చి దిద్దుతున్నాం' అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరిక్ట్ సీఈవో రూపేష్ కుమార్, రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి సలహాదారు సాయి కృష్ణ, తెలంగాణ ఐటీ వ్యూహకర్త శ్రీకాంత్ లంక తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నదానం

విశాలాంధ్ర - మల్కాజిగిరి : మినపల్లి హన్మంతరావు జన్మదినం సందర్భంగా ఆర్.కే.నగర్ సినిపోలీస్ వద్ద జి.ఎన్.వి. సతీష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి అతిథిగా మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు విచ్చేసి కేక్ కటింగ్ చేసి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్ యాదవ్, శ్రీనివాస్, పిట్టల శ్రీనివాస్, లక్ష్మీకాంత్ రెడ్డి, కన్నా, రాందాస్ సంతోష్ ముదిరాజ్, శోభన్ ముదిరాజ్, యాదగిరి, శ్రీధర్, సంపత్ గౌడ్, ప్రవీణ్, శ్రీనివాస్ యాదవ్, సత్యమూర్తి, బ్రహ్మయ్య, సత్యనారాయణ, రామ్ చందర్, కన్నెమల్ల నాగరాజు, పిట్టల నాగరాజు, ఆగమయ్య, బాలరాజు యాదవ్, పీవీ సత్యనారాయణ, బల్ రాజ్ యాదవ్, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ జీవితాంతం తీహార్ జైలుకు వెళ్లక తప్పదు

విశాలాంధ్ర - హైదరాబాద్ : అధికారాన్ని అడ్డుపెట్టుకొని అడ్డదిడ్డంగా తెలంగాణ సొమ్ము దోచుకున్న కేటీఆర్ ఆయన కుటుంబ సభ్యులు తీహార్ తప్పదని ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గజ్జల కాంతం అన్నారు. బంజారాహిల్స్‌లోని హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కెసిఆర్ కుటుంబంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుర్తించారు. తెలంగాణ రాష్ట్రాన్ని కుటుంబ సమేతంగా దోచుకున్నారని ఆరోపించారు. ఎన్నికల కోడ్ ఉండగా క్యాబినెట్ ఆమోదం లేకుండా ఫార్ములా ఈ రేస్ కేసులో 55 కోట్ల మీద అవినీతి పాల్పడ్డారని విమర్శించారు. అక్రమాలకు నిలయంగా గత ప్రభుత్వం పాలన సాగించిందని విమర్శించారు. అవినీతి అక్రమాల ఆరోపణలు ఎదుర్కొంటున్న కేటీఆర్ తెలంగాణ సెంటిమెంట్ను రెచ్చగొట్టే ప్రయత్నం చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. తెలంగాణ కోసం చనిపోతా అంటున్న కేటీఆర్ ఉద్యమ సమయంలో ఎందుకు చావలేదని ప్రశ్నించారు. సెంటిమెంట్ని ఉపయోగించి లబ్ధి పొందాలని చూడటం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికే రాష్ట్ర విచారణ సంస్థలు ప్రత్యేక దృష్టి సారించి విచారణ జరుగుతుండగా కేంద్రం సైతం రంగంలో దిగినందున ఆ కుటుంబ సభ్యులందరూ తీహార్ జైలుకు వెళ్ళటం ఖాయమని అన్నారు. కెసిఆర్ కుటుంబం చేసిన అవినీతి అక్రమాలతో పాటు ఉద్యమకారులకు చేసిన ద్రోహాన్ని ప్రజల ముందు ఉంచేందుకు ఈనెల 29న తెలంగాణ ఉద్యమకారుల సభను ఇందిరాపార్క్ వద్ద నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

అభివృద్దే ప్రధాన ఎజెండా

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రతి డివిజన్ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయించి అభివృద్దే ప్రధాన ఎజెండాగా పనులు చేపటేందుకు కృషి చేస్తామని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాదాపూర్ డివిజన్ కార్పొరేటర్ వి.జగదీశ్వర్ గౌడ్ తెలిరు. మాదాపూర్ డివిజన్ అభివృద్ధికి బాటలు వేస్తూ సాయినగర్ తండా నందు రూ.30.00 లక్షలు, గోకుల్ ఫ్లాట్ నందు రు.186.00 లక్షలు, ఇజత నగర్ వికర్ సెక్షన్ నందు రు.25.00 లక్షలు, కాకతీయ హిల్స్ నందు రు.16.20 లక్షలు, నవభారత్ నగర్ నందు రు.50.00 లక్షలు, మియపూర్ మెట్రో స్టేషన్, కాల్వరీ చర్చ్ రోడ్ రు.33.00 లక్షలు, ఆదిత్య నగర్ నందు రు.18.00లక్షలు, యశోద హాస్పిటల్డ్ నందు రు.46.00 లక్షలతో చేపట్టబోయే సీసీ రోడ్డు, బాక్స్ డ్రైన్ అభివృద్ధి పనులకు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ, నాయకులతో కలిసి శంకుస్థాపన కార్యక్రమంలో వి.జగదీశ్వర్ గౌడ్ పాల్గొన్నారు. మాదాపూర్ డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మున్సిపల్ శాఖామంత్రి శ్రీధర్ బాబుకి ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.శేరిలింగంపల్లి నియోజకవర్గ నాయకులు, డివిజన్ ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

గేమ్ ఛేంజర్ సినిమా టికెట్ ధరలను తగ్గించాలి : ఏఐవైఎఫ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : శుక్రవారం ప్రపంచ వ్యాప్తంగా బాలీవుడ్ స్థాయిలో రిలీజ్ అయిన గేమ్ ఛేంజర్ సినిమా టికెట్ ధరలు పెంచుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేస్తున్నామని, పెంచిన సినిమా టిక్కెట్ల ధరలను తగ్గించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏ ఐ వై ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కె. ధర్మేంద్ర ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కె. ధర్మేంద్ర మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సినిమా టిక్కెట్ల ధరలను పెంచేది లేదంటూ అసెంబ్లీలో ప్రకటించారని గుర్తు చేశారు. కానీ సినీ పరిశ్రమ వారితో భేటి తర్వాత సీఎం మాట తప్పి గేమ్ చేంజర్ సినిమాకు అనుమతి ఇవ్వడం వెనక ఉన్న మతలబేంటని వారు ప్రశ్నించారు. ఎవరి ప్రయోజనాల కోసం మాట మార్చారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పూటకో నిర్ణయం తీసుకోవడం సరికాదని హితవు పలికారు. సీఎం అసెంబ్లీలో మాట్లాడిన మాటకు కట్టుబడి ఉండాలని విజ్ఞప్తి చేశారు. సినిమా టిక్కెట్ల ధరలను పెంచొద్దనీ, బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వొద్దని డిమాండ్ చేశారు. టిక్కెట్ల ధరలను పెంచడంతో ప్రేక్షకులపై భారం పడుతుందనీ, వినోదాన్ని పేదలకు దూరం చేయడమేనని తెలిపారు.

ఎక్సైజ్ శాఖలో అవినీతి ఆరోపణలపై ప్రారంభమైన విచారణ

విశాలాంధ్ర -బషీర్ బాగ్: ఇటీవల ఎక్సైజ్ అధికారులపై బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగందర్ గౌడ్ చేసిన అవినీతి ఆరోపణలపై ఎక్సైజ్ శాఖ విచారణ కమిటీ వేసింది. శుక్రవారం జాయింట్ డైరెక్టర్ శశిధర్ రెడ్డి, అసిస్టెంట్ సెక్రెటరీ నాగలక్ష్మి నేతృత్వంలో జరిగిన విచారణకు రాచాల యుగందర్ గౌడ్ హాజరయ్యారు.హైదరాబాద్ నాంపల్లిలోని ఆబ్కారీ శాఖ కార్యాలయంలో కమిటీ ముందు విచారణకు హాజరైన అనంతరం రాచాల మాట్లాడుతూ ఎక్సైజ్ కార్యాలయంలో ఆఫీస్ సూపరింటెండెంట్ సయ్యద్ ఒమర్ అలీ, వనపర్తి ఎక్సైజ్ సూపరింటెండెంట్ గా పని చేసిన ప్రభు వినయ్‌లపై తాను చేసిన ఫిర్యాదులపై విచారణ జరిగినట్లు తెలిపారు. తాము చేసిన ఫిర్యాదులపై ఆధారాలతో సహా కమిటీకి అందజేసినట్లు వివరించారు. 20 ఏళ్లకు పైగా ఒకేచోట విధులు నిర్వహిస్తూ ఆఫీస్ సూపరింటెండెంట్ సయ్యద్ ఒమర్ అలీ సీనియారిటీ లిస్టులో తనకు అనుకూలంగా ఉన్నవారి పేర్లను సిఫార్సు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని రాచాల ఆరోపించారు.అలాగే ఇటీవలే సస్పెండ్ అయిన వనపర్తి ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రభు వినయ్ డేట్ ఆఫ్ బర్త్ ను 1964 కు బదులు 1969 మార్చుకొని ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించారని, దీనికి ఒమర్ సహకరించారని తెలిపారు. అవినీతి అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకొని, ఎక్సైజ్ శాఖను ప్రక్షాళన చేయాలని రాచాల ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఫిబ్రవరి 15 న తదుపరి విచారణను హాజరు కావాలని అధికారులు కోరినట్లు రాచాల వివరించారు.

వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని కుటుంబ సమేతంగా తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రీ వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

ప్రముఖ జ్యోతిష్యులు శివప్రసాద్ శర్మకు డాక్టరేట్ ప్రదానం

విశాలాంధ్ర-బషీర్ బాగ్: చిన్నప్పటి నుండి వేద పాఠశాలలో ఉంటూ స్మార్తంతో పాటు జ్యోతిష్యంలో కూడా పట్టు సాధించడమే కాకుండా గత 20 సంవత్సరాలుగా ఎంతోమంది ప్రజలకు జ్యోతిష్య సలహాలు పరిహారాలు ఇచ్చి వారి వారి జీవితాలను సక్రమమైన మార్గంలో నడిచేలా పది మంది జీవితాలను చక్కదిద్దడంలో హస్తవాసి కలవాడనైన తనకు నేడు ఈ అరుదైన గౌరవం దక్కడం చాలా సంతోషంగా ఉందని శ్రీవిద్యోపాశకులు, ప్రముఖ జ్యోతిష్యులు బ్రహ్మశ్రీ యం.శివ ప్రసాద్ శర్మ అన్నారు. అంతే కాకుండా గత 5 సంవత్సరాలుగా మనం మాట్లాడితే వచ్చే శబ్దాన్ని గణితం చేసి జాతకం చెప్పడంలో ప్రావీణ్యం సంపాదించిన నాకు గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ వారు గుర్తించి డాక్టరేట్‌ని ఇవ్వడం చాలా ఆనందదాయకంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రజలకు మరింత దగ్గర అవుతూ వారి వారి సమస్యలకు పరిష్కారం మార్గాలను సూచిస్తూ, వారికి కలిగే సమస్యలకు భగవంతుని సహాయం తోడయ్యేలా అనేక పరిహారాలు అందిస్తూ జ్యోతిష్య శాస్త్రం అంటే మూఢనమ్మకం కాదు మన తలరాతలు మార్చగలే విద్యని సాటి సమాజానికి తెలియజేసేలా మరింత కృషిచేస్తానని శివ ప్రసాద్ శర్మ అన్నారు. బెంగుళూరులో జరిగిన కార్యక్రమంలో గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

భారతీయ వస్త్ర వైభవాన్ని ప్రోత్సహించడమే లక్ష్యం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : భారతీయ వస్త్ర వైభవాన్ని ప్రోత్సహించడమే లక్ష్యమని ఫ్రాంటియర్ రాస్ క్రియేటివ్ డైరెక్టర్ గౌరాంగ్ బాత్రా తెలిపారు. భారతదేశం సాంస్కృతిక వారసత్వాన్ని తెలియజేసే ఉద్దేశంతో లగ్జరీ ఫ్యాషన్ బ్రాండ్ ఫ్రాంటియర్ రాస్ శృంగర్ శృంఖలా పేరుతో హైదరాబాద్ స్టోర్లో ఈవెంట్ నిర్వహించింది. ఈ సందర్భంగా బాత్రా మాట్లాడుతూ భారతీయ సాంస్కృతిలో చీర ప్రాముఖ్యతను తెలియజేయడం ఈ వేడుక ఉద్దేశం అన్నారు. ఈ ఐకానిక్ వస్త్రానికి గౌరవం తీసుకురావడం లో ఈ ఈవెంట్ నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. భారతీయ వస్త్రాల అందం, నైపుణ్యాన్ని మా బ్రాండ్ ద్వారా ప్రదర్శిస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పింకీ రెడ్డి మాట్లాడుతూ అలంకారం అనే భావన మన సంస్కృతిలో ఒక భాగమన్నారు. చీర అలంకారానికి అత్యుత్తమ ప్రతీక అన్నారు. ఇది మన వారసత్వ సంపదని తెలిపారు. మన సాంస్కృతిక వారసత్వానికి ప్రతినిధిగా నిలుస్తుందని చెప్పారు. రిద్దిమా కపూర్ సాహ్నీ మాట్లాడుతూ చీర భారతదేశం తాలుకా విభిన్న వస్త్ర వారసత్వాన్ని ప్రదర్శించే కాన్వాస్ అన్నారు. ప్రతి ప్రాంతం, ప్రతి సంఘం, ప్రతి చీర హస్తకళ, అందం ప్రత్యేక కథను చెబుతుందని చెప్పారు. చీర సాంస్కృతిక ప్రాముఖ్యతను తెలియజేసే ఈ కార్యక్రమంలో భాగమైనందుకు సంతోషంగా ఉందన్నారు.

రబీ పంటకు సరిపడా నీరు అందించాలి

మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఎస్.ఆర్.ఎస్.పి టెయిల్ ఎండ్ భూములకు రబీ పంటకు గాను సరిపడ నీళ్లు అందించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జలసౌధలో ఎస్.ఆర్.ఎస్.పి నీటి సరఫరాపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్.ఆర్.ఎస్.పి పరిధిలోని మొత్తం 9.68 లక్షల ఎకరాలకు రబీ సీజన్‌కు గాను ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో నీరు అందించేలా చర్యలు తీసుకోవలని ఆయన సూచించారు. డిసెంబర్ 25న నీటిని విడుదల చేశామని ఏప్రిల్ 8 వరకు నీటి సరఫరా ఉంటుందని అయితే చివరి భూములకు నిరందించే విదంగా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖా ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా ఇ.ఎన్.సిలు అనిల్ కుమార్, విజయ బాస్కర్ రెడ్డి, హరేరాం, సి.ఇలు కే. శ్రీనివాస్, సుధాకర్ రెడ్డి, రమేష్ బాబు తదితరులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం చూపరాదు...

నీటిపారుదల శాఖలో పనిచేసే ఇంజినీర్లు విధి నిర్వహణలో అలసత్వం చూపరాదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి హితవు పలికారు. హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్‌కు ఘనమైన చరిత్ర ఉందని ఆ వారసత్వాన్ని నేటి తరం కొనసాగించాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం రోజున హైదరాబాద్ ఇంజనీర్స్ అసోసియేషన్ రూపొందించిన 2025 డైరీని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లక్ష్యాల సాధనలో నీటిపారుదల ఇంజినీర్లు ముందుండలన్నారు. క్రమశిక్షణ, పారదర్శకతకు ప్రాధన్యత నివ్వాలని ఆయన సూచించారు. హైదరాబాద్ విలీనంకు ముందే నిజాం పాలనలో ఏర్పడ్డ ఈ అసోసియేషన్‌కు తగిన గౌరవం, గుర్తింపు ఉంటుందన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తగిన చేయూత నందిస్తామన్నారు.

కనుల పండువగా శ్రీనివాసుడి కళ్యాణం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి : పఠాన్ చెరువులోగల జెపి కాలనీలో ఏర్పాటు చేసిన "శ్రీశ్రీశ్రీ శ్రీనివాస" కల్యాణ మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయిన శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, పటాన్చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, సీనియర్ నాయకులు మారబోయిన రాజు యాదవ్, స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీనివాసుని కళ్యాణం కనుల పండువగా జరిగింది. అనంతరం "శ్రీనివాసునికి" ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం నిర్వాహకులు వారిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సీసాల రాజు, సీనియర్ నాయకులు రాంచందర్, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, స్థానిక సీనియర్ నాయకులు, నివాహకుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ వివాదానికి

శాశ్వత పరిష్కారం చూపుతాం

విశాలాంధ్ర - హైదరాబాద్ : దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ విషయంలో వివాదాలకు ఆస్కారం లేకుండా 4 నెలల్లో శాశ్వత పరిష్కారం చూపుతామని లేక్ ప్రొటెక్షన్ కమిటీ ఛైర్మెన్, హైడ్రా కమిషనర్ ఏ.వీ రంగనాథ్ చెప్పారు. ఎఫ్‌టీఎల్ నిర్ధారణలో సంబంధిత ప్రభుత్వ శాఖలతో పాటు ఐఐటీ, బిట్స్‌పిలానీ, జేఎన్‌టీయూ వంటి విద్యా సంస్థల ఇంజినీర్లను కూడా దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ నిర్ధారణలో భాగస్వామ్యం చేస్తామన్నారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్.ఆర్.ఎస్.సీ), సర్వే ఆఫ్ ఇండియా, సర్వే ఆఫ్ తెలంగాణ, రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్ ఎంసీ, హెచ్.ఎం.డీ.ఏ ఇలా అన్ని శాఖలను ఇందులో భాగస్వామ్యం చేసి సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు. ఎన్.ఆర్.ఎస్.సీ శాటిలైట్ ఇమేజీలను, సర్వే ఆఫ్ ఇండియా రికార్డులను శాస్త్రీయ పద్ధతుల్లో అధ్యయనం చేసిన తర్వాత తుది నివేదికను రూపొందిస్తామన్నారు. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌కు సంబంధించి గతంలో హెచ్.ఎం.డీ.ఏ. ఇచ్చిన ప్రిలిమనరీ నోటిఫికేషన్‌పై పరిసరప్రాంతాల నివాసితుల అభ్యంతరాలను హై కోర్టు ఆదేశాలమేరకు లేక్‌ప్రొటెక్షన్ కమిటీ ఛైర్మెన్, హైడ్రా కమిషనర్ ఏ.వీ. రంగనాథ్ శుక్రవారం హైడ్రా కార్యాలయంలో స్వీకరించారు. వారి వాదనలను రికార్డు చేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 6 కాలనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొని వారి వద్ద ఉన్న సమాచారాన్ని లేక్ ప్రొటెక్షన్ కమిటీ ఛైర్మెన్‌కు అందజేశారు. ఎఫ్‌టీఎల్‌కు సంబంధించి అభ్యంతరాలను వినిపించారు. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లకు సంబంధించి 25 ఏళ్లుగా ఉన్న సమస్యకు హైడ్రా కమిషనర్, లేక్ ప్రొటెక్షన్ కమిటీ ఛైర్మెన్ ఏ.వీ. రంగనాథ్ పరిష్కారం చూపాలని నివాసితులు అభ్యర్థించారు. 25 ఏళ్ల కాలంలో లేక్ ప్రొటెక్షన్ కమిటీ ఏనాడూ మా వాదనలు ఇలా బహిరంగంగా వినలేదని, తమను హైడ్రా ప్రధాన కార్యాలయానికి పిలిపించి ఎఫ్‌టీఎల్ అంశంలో తమ అభ్యంతరాలను విని పరిష్కార మార్గాలు కనుక్కొంటామని ఆయన హామీ ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. దశాబ్దాల కాలంలో ఎఫ్‌టీఎల్ పైన ఒక్కో విభాగం ఒక్కో లెక్క చెబుతోందని, మిగతా చోట్ల చెరువులు మాయం అయితే ఇక్కడ ఈ చెరువు ఎఫ్‌టీఎల్ పెరుగుతూ వస్తోందని స్థానికులు తెలిపారు. వాస్తవానికి 65.12 ఎకరాలు కాగా ఇప్పుడు ఒక్కో శాఖ ఒక్కో లెక్క చెబుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సామాజిక మాధ్యమాలు, కొన్ని మీడియా సంస్థలు తమను కబ్జాదారులుగా చూపెడుతున్నారన్నారు. కార్యక్రమంలో వి.గోపాల కృష్ణ, ఎల్. ఊర్మిలాదేవి, బి.ప్రియతమరెడ్డి, బి.నలిని, జేవీ చౌదరి, రవీందర్ రెడ్డి, బాషా మొహియుద్దీన్ తదితరులు దాదాపు వందమంది వరకూ హాజరయ్యారు.

ఘనంగా వెంకటేశ్వరస్వామి వైభవం, విష్ణు సహస్రనామ పారాయణం

విశాలాంధ్ర - మల్కాజిగిరి : ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆనంద్ బాగ్ బృందావన్ గార్డెన్స్‌లో శ్రీ వెంకటేశ్వర స్వామి వైభవోత్సవంలో భాగంగా సుప్రభాత సేవ తోమాల సేవ అర్చన స్వామివారి కళ్యాణం డోలోత్సవం పవళింపు సేవ కార్యక్రమాలు జరిగాయి. సుమారు 3000 మంది భక్తులు సామూహికంగా విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. కార్యక్రమానికి విచ్చేసిన పుష్పగిరి పీఠాధిపతి అభినవొద్దండ విద్యా శంకర భారతిస్వామి తన అనుగ్రహాన్ని భక్తులకు వినిపించారు. విష్ణు సహస్రనామ పారాయణం ప్రాసస్థ గురించి తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రామచంద్ర రావు, కార్పొరేటర్లు శ్రవణ్, గున్నాల సునీత యాదవ్, మాజీ కార్పొరేటర్లు జగదీష్ గౌడ్, మంజుల గౌడ్, ఏసీపీ జగన్, ఇన్స్పెక్టర్లు సత్యనారాయణ, జగదీశ్వర్‌రావు, మండలి రాధాకృష్ణ యాదవ్, విజయ్ కుమార్ దుర్గారాం తదితరులు పాల్గొన్నారు. దర్శనం శర్మ వ్యాఖ్యాతగా కార్యక్రమాన్ని నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి ఉత్తరద్వార దర్శనం చేసుకున్న భక్తులు

విశాలాంధ్ర - జూబ్లీహిల్స్ : వైకుంఠ ఏకాదశి పవిత్ర మైన శుక్రవారం రోజు అన్ని వైష్ణవ ఆలయాలు ఉత్తర ద్వార దర్శనానికి అన్ని ఏర్పాట్లు చేశారు ఈ సందర్భంగా భక్తులు ఉదయం నుంచి ఉత్తర ద్వార నుంచి స్వామిని దర్శించుకోవ డానికి బారులు తీరారు ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం యూసఫ్‌గూడ డివిజన్ వెంకటగిరిలో ఉన్న శ్రీశ్రీశ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో కొలువుదిరిన, అలివేలుమంగ శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనానికి ఆలయ కమిటీ పని ఏర్పాటు చేసి ఉదయం స్వామి వారికి అభిషేకం నిర్వహించే భక్తులకి స్వామివారి దర్శనాన్ని కల్పించారు. స్వామివారి విశేష అలంకరణ చేసిన పంతులు వేణు అలాగే కాశీ పంతులు సందీప్. భక్తులకు ఉత్తర ద్వారా దర్శనం కల్పించారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

విశాలాంధ్ర - కొత్తూరు : ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని కొత్తూరు మాజీ జడ్పిటీసి ఎమ్మె శ్రీలత సత్యనారాయణ అన్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా రంగారెడ్డి జిల్లా కనకమామిలో శ్రీవెంకటేశ్వరస్వామి పుణ్యక్షేత్రంలో శుక్రవారం ఆమె కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీనివాసుని మంగళకరమైన దీవెనలు ప్రజలందరిపై ఉండాలని ఆ వైకుంఠ నాథుడిని కోరుకున్నానని తెలిపారు. పవిత్ర వైకుంఠ ఏకాదశి రోజున ఆధ్యాత్మిక శ్రేయస్సు ఆనందం పొందాలని శ్రీ మహా విష్ణువు ఆశీస్సులు మీపై ఉండాలని ఆశిస్తున్నానని అన్నారు. ప్రజలందరికీ, బంధుమిత్రులకు శ్రేయోభిలాషులకు కుటుంబ సభ్యులకు పేరు పేరునా వైకుంఠ ఏకాదశి శుభాకాంక్షలు తెలిపారు.

బోడుప్పల్ వెస్ట్ జోన్ బీజేపీ అధ్యక్షులుగా తలారి రవి యాదవ్

విశాలాంధ్ర - మేడిపల్లి: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ వెస్ట్ జోన్ బీజేపీ అధ్యక్షులుగా ఎన్నికైన తలారి రవి యాదవ్‌ని శుక్రవారం ఉదయం కలిసి వారికీ శుభాకాంక్షలు తెలియచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగుల లక్ష్మయ్య, బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సామల పవన్ రెడ్డి, బోడుప్పల్ ప్రధాన కార్యదర్శి ఎర్పుల మహేష్, బోడుప్పల్ బీజేపీ మాజీ ప్రధాన కార్యదర్శి దాసరి మహేష్ యాదవ్, బోడుప్పల్ బీజేవైఎం ఉపాధ్యక్షులు సాయి యాదవ్, వేణు గోపాల్, శ్రీనివాస్ రావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి 20 కోచ్‌లతో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ సేవలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : ప్రధాన మంత్రిచే 15 జనవరి 2023న మకర సంక్రాంతి పండుగ రోజున జెండా ఊపి ప్రారంభించబడిన విశాఖపట్నం - సికింద్రాబాద్ - విశాఖపట్నం వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రస్తుతం 16 కోచ్‌లతో 1,128 ప్యాసింజర్ల సామర్థ్యంతో సేవలను అందిస్తున్న ఈ రైలు నేటి నుండి మెరుగైన 1440 ప్యాసింజర్ల సామర్థ్యంతో 20 కోచ్‌ల సవరించిన కూర్పుతో నడుస్తుంది. రైలు నం. 20833/20834 విశాఖపట్నం - సికింద్రాబాద్ - విశాఖపట్నం వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభంలో 16 కోచ్‌ల కూర్పుతో ప్రవేశపెట్టబడింది. ఇందులో 02 ఎగ్జిక్యూటివ్ క్లాస్, 14 చైర్ కార్లు ఉన్నాయి. సాధారణ సేవలను ప్రవేశపెట్టినప్పటి నుండి, రైలు స్థిరంగా 130% కంటే ఎక్కువ డిమాండ్‌తో నడుస్తోంది. ఈ రైలుకు పెరిగిన విశేషమైన డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని, రైల్వేలు ప్రస్తుతం ఉన్న రైలు రేక్‌ను మరో 4 అదనపు కోచ్‌లతో పెంచాలని నిర్ణయించింది. తదనుగుణంగా, ఈ రైలును ఈ నెల 11 నుండి ప్రస్తుత 16 కోచ్‌ల సామర్థ్యానికి బదులుగా 20 కోచ్‌ల సామర్థ్యంతో సేవలను అందించ నుంది. నూతన సవరించిన కూర్పులో 1,336 మంది ప్రయాణికుల సామర్థ్యంతో 18 చైర్ కార్లు ఉంటాయి (అంతకుముందు 14 కోచ్ లతో 1024 సామర్థ్యంతో వుండేవి) 104 మంది ప్రయాణికుల సామర్థ్యంతో 02 ఎగ్జిక్యూటివ్ క్లాస్ ఉండి మొత్తం 20 కోచ్‌లలో 1440 మంది ప్రయాణికుల సామర్థ్యంతో సేవలను అందించనుంది. దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ మరో 4 కోచ్‌ల జోడింపుతో వందేభారత్ రైలు సర్వీసు ప్రయాణం మరింత మంది ప్రయాణికులను చేరుకోగలదని తెలిపారు. ఈ సంక్రాంతి సీజన్‌లో కోచ్‌ల పెంపుదల కూడా సకాలంలో ఒక అదనపు అంశమని, ఈ సంక్రాంతి పండుగ రద్దీ సమయంలో ఎక్కువ మంది ప్రజలు తమ స్వస్థలాలకు వెళ్లి పండుగ జరుపుకోగలరని ఆయన అన్నారు.

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లను నడుపుతున్న దక్షిణ మధ్య రైల్వే

విశాలాంధ్ర - హైదరాబాద్ : దక్షిణ మధ్య రైల్వే క్రమం తప్పకుండా ముఖ్యమైన సందర్భాలలో లేదా సెలవులు, పండుగ సీజన్లలో రైలు ప్రయాణీకుల డిమాండ్లను తీర్చడానికి, అందుబాటులో ఉన్న వనరులను సమకూర్చడానికి ప్రత్యేక రైళ్లను నడుపుతుంది. జనవరి నెలలో, పండుగ సీజన్ను దృష్టిలో ఉంచుకుని దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లాలని రైలు ప్రయాణికుల నుండి డిమాండ్ ఉంది. ముఖ్యంగా, దక్షిణ మధ్య రైల్వే అధికార పరిధిలో సంక్రాంతి పండుగ, సెలవుల దృష్ట్యా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ప్రయాణానికి డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. దక్షిణ మధ్య రైల్వే రైలు వినియోగదారుల ప్రయాణ అవసరాలను తీర్చడానికి వివిధ గమ్యస్థానాల మధ్య జనవరి నెలలో సంక్రాంతి ప్రత్యేక రైళ్లను ప్రకటిం చింది. ఇప్పటివరకు జోన్ సంక్రాంతి సీజన్‌లో 188 ప్రత్యేక రైళ్లను ప్రకటించింది, మరో 178 ప్రత్యేక రైళ్లు జోన్ గుండా వెళుతున్నాయి. దీనితో మొత్తం 366 ప్రత్యేక రైళ్ల సర్వీసులు ఉన్నాయి. ఈ రైళ్లలో ఎక్కువ భాగం రద్దీగా ఉండే సెలవు దినాలలో నడపబడుతున్నాయి. ఈ రైళ్లు రెండు తెలుగు రాష్ట్రాల మధ్య మాత్రమే కాకుండా ఇతర ప్రసిద్ధ గమ్యస్థానాలకు కూడా నడపబడతాయి. ఈ రైలు సర్వీసులలో రిజర్వ్ కోచ్లు, అన్రిజర్వ్ కోచ్ల మిశ్రమ కూర్పుతో అన్ని విభాగాల ప్రయాణికులకు సేవలను అందిస్తాయి. చర్లపల్లి నూతన రైల్వే టెర్మినల్ ప్రారంభోత్స వాన్ని పరిగణనలోకి తీసుకుని, ఈ స్టేషన్ నుండి నర్సాపూర్, కాకినాడ, శ్రీకాకుళం మొదలైన స్టేషన్‌ల వైపు 59 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నారు. ఇందులో 16 జనసాధరణ రైళ్లు చర్లపల్లి నుండి విశాఖపట్నం తిరిగి చర్లపల్లి వరకు సాధారణ కోచ్లతో ప్రత్యేకంగా నడపబడుతు న్నాయి. అదనంగా, సాధారణ రైళ్లలో ప్రయాణించే అదనపు రద్దీని తీర్చడానికి, భారీ వెయిట్లిస్టు క్లియర్ చేయడానికి 15 ఎక్స్ప్రెస్ రైళ్లను అదనపు కోచ్లతో జోడించుతున్నారు. రైలు నంబర్ 20833/20834 సికింద్రాబాద్ - విశాఖపట్నం - సికింద్రాబాద్ వందే భారత్ రైలుకు జనవరి 11, 2025 నుండి శాశ్వత ప్రాతిపదికన 4 అదనపు చైర్ కార్ కోచ్‌లను పెంచుతున్నారు తద్వారా అదనపు ప్రయాణీకులకు వసతి కల్పిస్తుంది. నర్సాపూర్, కాకినాడ, విశాఖపట్నం, శ్రీకాకుళం, మచిలీపట్నం, తిరుపతి, బెర్హంపూర్, జైపూర్, గోరఖ్‌పూర్, కటక్, మధురై, అర్సికెరె మొదలైన ప్రముఖ ప్రాంతాలకు ఈ ప్రత్యేక రైళ్లు నడపబడుతున్నాయి. వీటితోపాటు జోన్ నుండి నెల్లూరు, విజయవాడ, రాజమండ్రి, వరంగల్ స్టేషన్ల గుండా చెన్నై, బెంగళూరు, మధురై జోన్‌ల నుండి వచ్చే షాలిమార్, సంబల్పూర్, బరౌని, విశాఖపట్నం మొదలైన స్టేషన్లకు మరికొన్ని ప్రత్యేక రైళ్లు నడపబడుతున్నాయి.

విద్యార్థులు నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి

విశాలాంధ్ర - తుర్కయంజాల్ : మారుతున్న కాలంతో పాటు విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాలలో నైపుణ్యాతను అందిపుచ్చుకోవాలని తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ (జెఎన్‌టియు) ఇంచార్జ్ వైస్ చాన్సలర్ వి.బాలకిష్టా రెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని ఇండస్ వ్యాలీ ఇంటర్నేషనల్ పాఠశాల 8వ వార్షికోత్సవాన్ని పాఠశాల యాజమాన్యం శుక్రవారం ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలు శాస్త్ర సాంకేతిక, ఉద్యోగ రంగాలలో పోటిని ఎదుర్కొంటున్నాయని విద్యార్థులు మారతున్న కాలానుగుణంగా నైపుణ్యతను అందిపుచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో చిన్నారులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అతిధులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమాల్లో పాల్గొన్న విజేతలకు ముఖ్య అతిథి చేతుల మీదుగా మెమొంటోలు ప్రశంసాపత్రాలు అందజేసి చిన్నారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ సుధీర్, సెక్రటరీ రాఘవరెడ్డి, డైరెక్టర్లు కె.పర్వత రెడ్డి, కె. సంజీవరెడ్డి, ప్రిన్సిపల్ ప్రియా దామిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు.పాల్గొన్నారు.

డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్లో ముగిసిన ఒలంపిక్ టోర్నమెంట్

విశాలాంధ్ర - కాప్రా : విద్యార్థులకు క్రీడలు శారీరక ధృఢత్వంతో పాటు పోటీ తత్వాన్ని పెంపొందిస్తాయని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. మానసిక, శారీరక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని చెప్పారు. నాచారం డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర నగర్‌లోని డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్లో రెండు రోజులపాటు నిర్వహించిన ఫియస్టా ఒలంపిక్ టోర్నమెంట్ శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి మొదటిరోజు ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ఐపీఎస్ అధికారిని అరుణ బహుగుణ, పర్యావరణ, పారిశ్రామికవేత్త రామ్మోహన్ రావు హాజరు అవగా రెండో రోజు కార్యక్రమా నికి ముఖ్యఅతిథిగా భారత పారాలింపిక్ అథ్లెట్ జీవంజీ దీప్తి, గౌరవ అతిథిగా జాతీయ కోచ్ అథ్లెటిక్స్ రమేష్ నాగపురి హాజరై ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమ తులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి పెంపొందించాలని సూచించారు. క్రీడా స్ఫూర్తితోనే విద్యార్థుల్లో ఐక్యత, క్రమశిక్షణ పెరుగుతుందన్నారు. విద్యార్థుల ప్రదర్శించిన వివిధ రకాల అథ్లెటిక్ పోటీలు, డ్రిల్స్, కరాటే, సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకర్షించాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ప్రీ ప్రైమరీ నుండి గ్రేడ్2 వరకు అన్ని గ్రేడ్ స్థాయిల విద్యార్థులు ఉత్సాహంగా ఈ పోటీలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ నవనీతరావు, మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ కుమార్, కిషోర్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సుమామీనన్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు

విశాలాంధ్ర - పటాన్ చెరువు : ఏడుకొండలవాడి ఆశీర్వాదంతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని, ముక్కోటి ఏకాదశి రోజున వెంకటేశ్వర స్వామి భక్తులందరూ స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆధ్యాత్మిక ఆలోచన లతో సమాజంలో నూతనొత్తేజం వస్తుందని పటాన్చెరువు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ స్పష్టం చేశారు. శుక్రవారం పటాన్చెరువు పట్టణంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా పటాన్చెరువు నియోజకవర్గ వెంకటేశ్వర స్వామి భక్త బృందం అధ్యక్షులు సీసాల రాజు ఆధ్వర్యంలో శ్రీనివాస కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మెట్టు కుమార్ యాదవ్, రాగం నాగేందర్ యాదవులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 1000 మంది భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొనే విధంగా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మెట్టు కుమార్ యాదవ్, రాగం నాగేందర్ యాదవులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అత్యంత భక్తిశ్రద్ధలతో సీసలరాజు భక్త బృందం స్వామివారి కల్యాణాన్ని వైకుంఠ ఏకాదశి రోజున నిర్వహించడం శుభసూచకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారబోయిన రాజు యాదవ్, మెట్టు కృష్ణ యాదవ్, మెట్టు మదన్ యాదవ్, ఎల్లేష్ యాదవ్, సత్యనారాయణ, రాజు, భాస్కర్, జి మల్లేష్ యాదవ్, శ్రీనివాస్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఏకగ్రీవ ఆమోదం

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ సాధారణ సమావేశం మేయర్ అమర్ సింగ్ అధ్యక్షతన శుక్రవారం కౌన్సిల్ హాల్‌లో జరిగింది. ఇందులో 32 అంశాలపై చర్చించబడింది. కౌన్సిల్‌లో 35 కోట్ల రూపాయల అభివృద్ధి ప్రాజెక్టులకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. సమావేశం లోని 10.8 కోట్ల నిధులతో స్ట్రామ్ వాటర్ పైప్ పనులు ఆమోదం, ప్రతి నెల 10 లక్షల నిధులు మంచి త్రాగునీటి సరఫరా మరమత్తులు ఖర్చుల కోసం కేటాయింపు, రూ.50 లక్షల నిధులతో వీధి దీపాలు, ఇతర అభివృద్ధి పనులకు కేటాయింపు. ఈ సమావేశంలో మేయర్ అమర్ సింగ్ త్రాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ల పునరుద్ధరణ వంటి విషయాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కార్పొరేటర్లు ప్రజల మధ్య ఉండి వారి డివిజన్‌ల సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించాలని సూచించారు. మేయర్ అమర్ సింగ్ పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌ను అభివృద్ధి దిశగా మరింత చురుకుగా ముందుకు తీసుకెళ్లాలని, సమగ్ర ప్రణాళికలతో పీర్జాదిగూడ ప్రాంతాన్ని అభివృద్ధి పరచడంలో కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, కమీషనర్ త్రిలేశ్వర్‌రావు, డిఈ సాయినాథ్ గౌడ్, మేనేజర్ మరియు ఎలక్ట్రికల్, వాటర్ వర్క్స్, ఇతర ముఖ్య విభాగాల సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీవెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న కొలను

విశాలాంధ్ర - కుత్బుల్లాపూర్: స్వామివారి అనుగ్రహంతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఎల్లవేళలా జీవించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం నియోజకవర్గం పరిధి నిజాంపేట్ సెవెన్ హిల్స్‌లోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకుని, ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కొలను శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రజలు ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా స్వామివారిని కోరారు. ఈ కార్యక్రమంలో వాసు, రామకోటేశ్వరరావు, సాంబశివరెడ్డి, మేడా శ్రీనివాసరావు, వేమూరి నాగేశ్వరరావు, మౌలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

విశాలాంధ్ర - కొత్తూరు : కొత్తూరు మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో శుక్రవారం వైకుంఠ ఏకాదశి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలో ఎంతో ప్రఖ్యాతిగాంచిన అనంత పద్మనాభస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి. ఇందులో భాగంగా ఆలయ కమిటీ చైర్మన్ బెజవాడ అనితారెడ్డి, పాలకవర్గం సభ్యులు భక్తులకు ఆలయంలో అన్ని ఏర్పాట్లను చేశారు. ఉత్తర ద్వారం ద్వారా భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ జెడ్పిటిసి మామిడి శ్యాంసుందర్ రెడ్డి హాజరై స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. హిందూ సేవా సమితి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో దుర్గా మైత్రియ శిష్య బృందం ప్రదర్శించిన వీణా వాదనం గాత్రం భక్తులను అలరించింది. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రవీందర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కుమ్మరి రమేష్, ఆలయ కమిటీ సభ్యులు నందిగామ సుధాకర్, దామోదర్ రెడ్డి, ఆర్ఐ రాంబాబు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వేంకటశివ రామాలయాన్ని దర్శించుకున్న కార్పొరేటర్

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లి 17 డివిజన్ కార్పొరేటర్, ఆలయ ధర్మకర్త ఆగం రాజు ముదిరాజ్ వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం వెంకట శివ రామాలయం దేవాలయంలో కుటుంబ సమేతంగా విచ్చేసి ఆలయ దేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

యువత వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలి

విశాలాంధ్ర - ఆమనగల్లు : యువత స్వామి వివేకానందను స్ఫూరిగా తీసుకుని ముందుకు సాగాలని సంఘ సేవకులు పాపిశెట్టి రాము పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సామాజిక తెలంగాణ స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర కార్యదర్శి సుదర్శన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివేకానందుడి జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాము మాట్లాడుతూ యువత చేతుల్లోనే దేశభవిష్యత ఆధారపడి ఉంటుందన్నారు. స్వామివివేకానంద బోధనలు యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి జేఏసి చైర్మన్ రాజు, బిసి సంఘం సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్, ఎఎంసి మాజీ డైరెక్టర్ రమేష్, విద్యార్థి నాయకులు బిక్కి, యాదగిరి, రాజు, శివ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కాలు దువ్వుతున్న పందెంకోళ్లు!

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: సంక్రాంతి అంటేనే ఆంధ్రప్రదేశ్‌లోని ఉభయ గోదావరి జిల్లాల్లో జరిగే కోడిపందేలు గుర్తుకువస్తాయి. పందెం కోళ్లు కాలు దువ్వుతుంటే ... మీసం మెలేసి చేయి దించకుండా ఎన్నికల్లో గెలిచినట్లు ఫీలవుతారు పందెంరాయుళ్లు. సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు కోడిపందేలకు హాజరవుతారు. రాష్ట్రంలో వివిధ జిల్లాల నుంచే కాకుండా తెలంగాణ, తమిళనాడు, కర్నాటకతోపాటు విదేశాలలో ఉన్న తెలుగు వాళ్లు సైతం కోడిపందేలు చూసేందుకు తరలివస్తారు. కోడిపందేలలో కోట్లాది రూపాయలు చేతులు మారుతాయి. పందెం గెలిచిన కోడిపుంజును ఊరేగింపుగా తీసుకువెళ్లి ఇంట్లో మనిషిగా చూసుకుంటారు. కోడిపందేల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. అధికార పార్టీ నేతలు బరులు సిద్ధం చేయడంలో ముందున్నారు. ఇప్పటికే హోటల్ గదులను బుక్ చేసుకున్నారు. కోడిపందేలకు వెళ్లేందుకు గత వారం క్రితమే ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. గ్రామస్థాయి నుంచి ప్రజాప్రతినిధుల స్థాయి వరకు సొంత బరులను ఏర్పాటు చేసుకొని కోడిపందేలు నిర్వహించేందుకు సమాయత్తం అవుతున్నారు. ఆంక్షలు... కేసులు... కోడి పందేలను అడ్డుకోలేవు. ఎక్కడా ఆగే పరిస్థితి కనిపించడం లేదు. సంక్రాంతి పండుగ మూడు రోజులపాటు పందేలు నిర్వహించేలా బరులు సిద్ధం చేస్తున్నారు. పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని పందేలు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నారు. పోలీసులు బైండోవర్ కేసులు పెట్టి, కోడి కత్తులు స్వాధీనం చేసుకుని సాంప్రదాయ క్రీడలు నిర్వహించాలని పిలుపు ఇచ్చినా సంక్రాంతి మూడు రోజులూ భారీగా కోడిపందేలు సాగుతుంటాయి. రౌండ్ రౌండ్‌కు పందేలు జరుగుతున్న తీరు వివరించడానికి లౌడ్ స్పీకర్లు, లైవ్‌లో వీక్షించడానికి స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు. డ్రోన్ కెమెరాలను సిద్ధం చేశారు. పాస్‌లు తీసుకున్న వారికి మినహా మరెవరికి బరిలోకి ప్రవేశం ఉండదు. వీఐపీ గ్యాలరీలతో పాటు సందర్శకుల గ్యాలరీ సిద్ధం చేశారు. పందెంరాయుళ్లు హైటెక్ హంగులతో బరులు ఏర్పాటు చేస్తున్నారు. అత్యాధునిక సౌకర్యాలతో కోడిపందేలకు సన్నద్ధం అవుతున్నారు. గుండాట, కోత ముక్క, జూదం, మద్యం, చికెన్ పకోడీ, బిర్యాని, ఫుడ్ స్టాల్స్... ఇలా అన్ని సౌకర్యాలతో పందెం బరుల వద్ద ఏర్పాటు చేస్తున్నారు. మూడు రోజులపాటు రూ.వందల కోట్ల చేతులు మారే అవకాశాలు ఉన్నాయి. రాత్రుళ్లు సైతం పందేలు నిర్వహించేందుకు ఫ్లడ్ లైట్లు, ఎల్ఈడీ స్క్రీన్, డిజిటల్ చెల్లింపులు సిద్ధం చేశారు. పందేలు మరింత ఆసక్తికరంగా మారేందుకు యాంకర్లను సైతం రంగంలోకి దించుతున్నారు. జిల్లాలో ఎక్కడ ఏ బరి ఉంది... అక్కడ ఏ ఏ సౌకర్యాలు ఉన్నాయన్న దానిపై సోషల్ మీడియాలో ఇప్పటికే ప్రచారం మొదలైంది. దీంతో ఉభయ గోదావరి జిల్లాలకు వెళ్లే వారికి సులువుగా సమాచారం లభిస్తుంది. ఇప్పటికే జిల్లాలో ఏలూరు నగరంతో పాటు ముఖ్య పట్టణాలలో విస్తృతంగా ప్రచారం సాగింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా కోడిపందేలు భారీ ఎత్తున నిర్వహించేందుకు రాజకీయ పరపతి కలిగిన అధికార పార్టీ నేతలను ఇప్పటికే రంగంలోకి దించారు. కొంతమంది పోలీసు అధికారులను ఒప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ఉభయగోదావరి జిల్లా కలెక్టర్‌లు. కె.వెట్రి సెల్వి, చదలవాడ నాగరాణి, ఎస్పీలు కొమ్మి ప్రతాప శివ కిషోర్, అద్నాన్ నయీం అస్మి... కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు. అత్యున్నత న్యాయస్థాలూ ఆదేశించాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో కోడిపందేలు ఎలా జరుగుతాయోనని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై మౌనమేంటి?

చంద్రబాబు, పవన్‌కు రామకృష్ణ ప్రశ్న

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ గురించి అక్కడ పర్యటించిన ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కనీసం ప్రస్తావించకపోవడం విచారకరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఆక్షేపించారు. ఈ నెల 8వ తేదీన ప్రధాని విశాఖ పర్యటనలో రూ.2 లక్షల కోట్ల ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసినట్లు చెబుతున్నారనీ, ఆంధ్రుల హక్కుగా సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణపై మోదీగానీ, చంద్రబాబుగానీ, పవన్ కల్యాణ్‌గానీ మాట్లాడకపోవడం దారుణమని విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయాలనే దురుద్దేశంతోనే నాలుగు నెలలుగా ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం లేదని, పైగా స్టీల్‌ప్లాంట్‌లో దశలవారీగా ఉత్పత్తి తగ్గిస్తున్నారని పేర్కొన్నారు. స్టీల్ ప్లాంట్‌కు క్యాప్టివ్ మైన్స్ కేటాయించకుండా... మిత్తల్ ఏర్పాటుచేసే ప్రైవేటు పరిశ్రమకు క్యాప్టివ్ మైన్స్ కావాలని కోరడం దుర్మార్గమన్నారు. గత ఎన్నికల సందర్భంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ 'మాకు అధికారం ఇస్తే విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణను ఆపుతామని' చెప్పారని గుర్తుచేశారు. 'విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిదే' అంటూ నాడు ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు లేఖ రాశారని, అవసరమైతే తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధులంతా రాజీనామాలు చేస్తామని ప్రకటించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 6 నెలలైనప్పటికీ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఒక్కమాట కూడా మాట్లాడడం లేదన్నారు. పైగా మభ్యపెట్టడానికి మిత్తల్ ప్రైవేటు స్టీల్ ఫ్యాక్టరీని ముందుకు తెస్తున్నారని, ఇది దుర్మార్గమని తప్పుపట్టారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్...విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ అంశాన్ని గాలికివదిలేస్తే చరిత్రలో అనామకులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. ఇప్పటికైనా స్పందించి విశాఖ స్టీల్ ప్రైవేటీకరణను ఆపేందుకు నోరు విప్పాలని, కేంద్రంపై ఒత్తిడి తేవాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

టీడీడీ చైర్మన్, సభ్యులు క్షమాపణ చెప్పాలి: పవన్

విశాలాంధ్ర బ్యూరో-కాకినాడ: ఆవు బాగుంటే రైతు బాగుంటాడని, రైతు బాగుంటే దేశం బాగుంటుందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో 268 గోకులం షెడ్లు నిర్మిస్తే... ఆరు నెలల్లో తాము 12,500 నిర్మించామని చెప్పారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కుమారపురంలో గోకులం షెడ్లను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పవన్ మాట్లాడారు.'గోకులాల ద్వారా చిన్న, కౌలు రైతులు, ఇతర వర్గాలు బాగుపడతాయి. భవిష్యత్తులో 20 వేల గోకులాలు ఏర్పాటు చేస్తాం. గత ప్రభుత్వం పాడి పరిశ్రమను నిర్వీర్యం చేసింది. కుంభకోణాల్లో రికార్డు సృష్టించింది. మా ప్రభుత్వం పల్లె పండుగ, గోకులాలతో అభివృద్ధి కార్యక్రమాలు చేసింది. సకాలంలో జీతాలు, పింఛన్లు పంపిణీ చేస్తున్నాం. శ్రమ ఉన్న చోటే పెట్టుబడులు వస్తాయి. రైతుల ఆదాయం రెట్టింపయ్యేలా ఆలోచనలు చేస్తున్నాం. ఎన్డీయే, చంద్రబాబు నాయకత్వాన్ని నమ్మి మీరంతా ఓట్లు వేశారు. ఎక్కడ తప్పు జరిగినా స్పందించే గుణం ఉండాలి. తప్పు జరిగితే అది మా అందరి సమష్టి బాధ్యత. అందుకే తిరుపతి తొక్కిసలాట ఘటనపై స్పందించాను... మనస్ఫూర్తిగా క్షమాపణ కోరాన'ని పవన్ అన్నారు. తనకు అధికారం అలంకారం కాదని, బాధ్యతని పవన్ చెప్పారు. ఎవరైనా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే తొక్కి నార తీస్తానన్నారు. చేయని తప్పునకు జపాన్ ప్రధాని క్షమాపణ చెప్పారని, తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్, సభ్యులు క్షమాపణలని స్పష్టంచేశారు. 'నేను క్షమాపణ చెప్పినప్పుడు... మీరు చెప్పడానికి రామోషీ ఎందుకు? మీ తప్పు లేదంటే ఎలా? నేను మాత్రం దోషిగా నిలబడాలా? వీఐపీ ట్రీట్‌మెంట్ తగ్గి... సామాన్యుల ట్రీట్‌మెంట్ పెరగాలి' అని పవన్ అన్నారు. 'నాతో సహా అందరికీ 6 నెలల పాలన పూర్తయింది. మీరు నన్ను నమ్మి గెలిపించారు. నిలబెట్టి పనిచేయిస్తాను. ఒళ్లు వంచి పని చేసిన తర్వాతే ఓట్లు అడుగుతాను. 15 ఏళ్లకు తక్కువ కాకుండా కూటమి ఉండాలని కోరుకుంటున్నా. అధికార యంత్రాంగం సహకారం కావాలి. పిఠాపురం నుంచి జిల్లాల పర్యటన మొదలుపెడతా. బాధ్యతగా ఉంటా. నాయకులను కలుపుకొని వెళతా. విప్లవకారుడు రాజకీయ నాయకుడైతే ఇలాగే ఉంటుంది. నాకు డబ్బు, పేరు మీద ఇష్టం లేదు. బాధ్యత మాత్రమే ఉంది. ప్రజలు ఆనందంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా' అని పవన్ అన్నారు.

డబుల్ డ్యూటీ సొమ్ము పెంచాలి: ఈయూ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆర్టీసీలో డబుల్ డ్యూటీ చేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లకు రోజువారి సొమ్ము పెంచాలని ఏపీ పీటీడీ(ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్య శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. డ్రైవర్‌కు రూ.800 నుంచి రూ.1,414, కండక్టర్‌కు రూ.700 నుంచి రూ.1,297కు పెంచాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆర్టీసీ డిపోలలో డ్రైవర్ల/కండక్టర్ల కొరత ఉందని, ప్రతిరోజూ బస్సులు సక్రమంగా నడిపేందుకుగాను సంబంధిత డిపో అధికారులు, సూపర్ వైజర్లు రోజువారి సర్వీసులు ఆపరేషన్ల కోసం డబుల్ డ్యూటీలకు, అటు రెగ్యులర్ సిబ్బందిని, ఇటు ఆన్ కాల్ డ్రైవర్లను పంపిస్తూ డ్రైవర్లకు రూ.800, కండక్టర్లకు రూ.700 చెల్లిస్తున్నారని వివరించారు. డబుల్ డ్యూటీలకు వెళ్లే సిబ్బందికి తక్కువ సొమ్ము ఇవ్వడంతో రెగ్యులర్, ఆన్ కాల్ డ్రైవర్లు ఆయా విధులు నిర్వహించేందుకు ఆసక్తి చూపడం లేదన్నారు. చాలా డిపోల్లో బస్సులు నడపలేక సర్వీసులను రద్దు చేస్తున్నారని తెలిపారు. డబుల్ డ్యూటీ చేసే రెగ్యులర్ ఉద్యోగికి నెలవారి చెల్లించే డీఏతో... నెలలో 26 రోజుల యావరేజ్ ప్రకారం చెల్లించి... డబుల్ డ్యూటీ చేసే డ్రైవర్‌కు ప్రస్తుతం ఇస్తున్న రూ.800 బదులుగా రూ.1414, కండక్టర్‌కు ప్రస్తుతం ఇస్తున్న రూ.700కు రూ.1297 చెల్లించాలని ఎండీ ద్వారా తిరుమలరావుకు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం రెగ్యులర్ డ్రైవర్‌కు మూల వేతనం సొమ్ము నెలకు రూ.27,500 ఇస్తున్నారని, అందులో రూ. 9,259 డీఏ కలిసి రూ.36,759 అవుతుందని వివరించారు. దీని ప్రకారం లెక్కిస్తే... దాని ఆధారంగా ఒక రోజు వేతనం కనీసం రూ.1,414 అవుతుందని, ఆ విధంగానే డ్రైవర్ డబుల్ డ్యూటీకి చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కండక్టర్‌కు నెలకు మూల వేతనం రూ.25,220, ప్రస్తుతం ఇస్తున్న డీఏతో రూ.8,492 కలిపి మొత్తంగా రూ.33,712 వస్తోందన్నారు. దీని ప్రకారం లెక్కిస్తే..రోజుకు కనీసం రూ.1,297 అవుతుందని, ఆ తరహాగా కండక్టర్ డబుల్ డ్యూటీ చేస్తే చెల్లించాలని కోరారు.

ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు

వైద్యారోగ్యశాఖలో 8 వేల పోస్టుల భర్తీకి ప్రణాళిక

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: వైద్య ఆరోగ్యశాఖలో ఎనిమిది వేల పోస్టుల భర్తీకి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని, ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని ఆ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. ప్రజారోగ్య పరిరక్షణకు రాష్ట్రంలో అమలవుతున్న వివిధ పథకాల నిర్వహణ, వైద్య సిబ్బంది కొరత, వారి దృక్పథం, జవాబుదారీతనం తదితర అంశాలపై శుక్రవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. కొత్త ఆలోచనలతో వివిధ పథకాల కింద ప్రజలకందించే వైద్య సేవల నాణ్యతను పెంచాలని సూచించారు. నెలవారీ నివేదికల్ని సమర్పించాలన్నారు. ప్రధాన విభాగాల్లో 1,01,125 పోస్టులు మంజూరు కాగా, ప్రస్తుతం 26,263 ఖాళీలున్నాయని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో డాక్టర్ల కొరత 21.41 శాతం, పేరా మెడికల్... సహాయక సిబ్బంది కొరత 26.78 శాతం ఉందని చెప్పారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు స్పందిస్తూ ఖాళీగా చూపబడిన పోస్టుల్లో కొన్నింటిని రద్దుచేసి సమకాలీన అవసరాల కోసం కొత్త పోస్టుల్ని కల్పించడం జరిగిందని, మరికొన్నింటిని పదోన్నతుల ఆధారంగా భర్తీ చేయాల్సి ఉంటుందని వివరించారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్ వాకాటి కరుణ వర్చువల్‌గా హాజరుకాగా, సెకండరీ హెల్త్ డైరెక్టర్, ఏపీఎంఎస్ ఐడీసీ ఎండీ డాక్టర్ ఎ.సిరి, ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి, వైద్య విద్య సంచాలకులు డాక్టర్ నరసింహం పాల్గొన్నారు.

బీజేపీ... రాజ్యాంగాన్ని కాపాడడం అనుమానమే: షర్మిల

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: అంబేద్కర్‌ను పార్లమెంట్ అవహేళన చేసిన అమిత్ షా ను వెనకేసుకొచ్చిన ప్రధాని మోదీ, బీజేపీ... భారత రాజ్యాంగాన్ని కాపాడుతుందనే నమ్మకం పోయిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల అన్నారు. పార్లమెంట్‌లోనే కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్ జపం చేస్తుందని అవహేళనగా మాట్లాడితే ఎంపీలు ఎవరూ నోరు ఎత్తలేదన్నారు. కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం జై బాపూజీ, జై భీం, జై సంవిధాన్ పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాజీనామా చేయకుంటే మోదీ ఆయనను బర్తరఫ్ చేయాలన్నారు. అంబేద్కర్ బడుగు బలహీన వర్గాల జీవితాల్లో వెలుగు నింపారని,అంటరాని తనం నిర్మూలన పై జీవితకాలం పోరాటం చేశారన్నారు. అధికార, ప్రతిపక్షాలు మోదీ జపం చేస్తున్నాయని విమర్శించారు. విశాఖ స్టీల్ ప్రైవేటీకరణపై తన వైఖరి ఏంటో చెప్పని మోదీతో చంద్రబాబు సక్రమ సంబంధం, వైసీపీది అక్రమ సంబంధం అని దుయ్యబట్టారు. అనంతరం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కార్యకర్తలతో కలసి రెండు గంటలపాటు మౌన దీక్ష చేశారు. మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలీ, పీసీసీ మాజీ అధ్యక్షుడు రుద్ర రాజు , జిల్లా అధ్యక్షుడు అడ్డాల వెంకట వర్మరాజు పాల్గొన్నారు.

దిల్లీ అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

న్యూదిల్లీ: దిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి శుక్రవారం ఎన్నికల కమిషన్ (ఈసీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. ఈ నెల 17వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారని తెలిపింది. 18న నామినేషన్ల పరిశీలన, ఈ నెల 20 వరకు నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ కొనసాగనుంది. 70 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో ఫిబ్రవరి 5న పోలింగ్ జరుగనుంది. 8వ తేదీన లెక్కింపు చేపడతారు. దిల్లీలో మొత్తం 1.55 కోట్ల ఓటర్లు ఉన్నారని, వీరిలో 83.49 లక్షల మంది పురుష ఓటర్లు, 71.74 లక్షల మంది మహిళా ఓటర్లు ఉన్నారని ఈసీ వెల్లడించింది. 25.89 లక్షల మంది యువ ఓటర్లు ఉన్నట్లు తెలిపింది. అసెంబ్లీ ఎన్నికల కోసం ఇప్పటికే ఆప్ పూర్తి అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. 29 మంది అభ్యర్థులతో బీజేపీ తొలి జాబితా విడుదల చేసింది.

ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు: మంత్రి లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో వచ్చే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయమని, లక్ష్య సాధనకు కలిసికట్టుగా పనిచేయాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఉండవల్లి నివాసంలో మంత్రుల ఉపసంఘం తొలి సమావేశం శుక్రవారం జరిగింది. వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఉపసంఘం చైర్మన్ లోకేశ్, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, సీఎస్ కే విజయానంద్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. లోకేశ్ మాట్లాడుతూ...దేశ చరిత్రలో ఏ పార్టీ కూడా మేనిఫెస్టోలో ఒక నెంబర్ పెట్టి.. ఇన్ని లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పలేదన్నారు. యువగళం పాదయాత్రలో క్షేత్రస్థాయి అనుభవాలతో మేనిఫెస్టో రూపొందించడం జరిగిందన్నారు. అందులో భాగంగానే ఉద్యోగాల కల్పన కోసం కేబినెట్ సబ్ కమిటీ వేయడం జరిగిందని చెప్పారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం లేకుండా చూడాలని, ప్రతి 15 రోజులకోసారి కేబినెట్ సబ్ కమిటీ భేటీ జరుగుతుందన్నారు. పెట్టుబడులు, ఉద్యోగాల కల్పన వనరుల కల్పనపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. పెట్టుబడులు తీసుకురావడం అంత సులభం కాదని, చాలా సమయం పడుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పీపీలను రద్దు చేశారని, పలు పరిశ్రమలను పొరుగు రాష్ట్రాలకు తరిమివేశారని విమర్శించారు. 1995-2004తో పోల్చుకుంటే రాష్ట్రాల మధ్య పోటీ పెరిగిందన్నారు. పెట్టుబడిదారులకు అవసరమైన అనుమతులు, భూకేటాయింపులు త్వరితగతిన మంజూరయ్యేలా చూడాలన్నారు. నెలకు రూ. 4 వేల కోట్ల లోటుతో రాష్ట్రం నడుస్తోందని మంత్రి వివరించారు. మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఉద్యోగ, ఉపాధి కల్పనపై ఎక్కువ దృష్టి పెట్టింద న్నారు. ప్రభుత్వ శాఖల ప్రణాళికలు, భవిష్యత్ లక్ష్యాలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిరించారు. వ్యవసాయ, పరిశ్రమలు, ఆరోగ్యం, హోమ్, మానవ వనరుల శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా నైపుణ్యగణన

రాష్ట్ర వ్యాప్తంగా త్వరలోనే నైపుణ్య గణన కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. దేశంలోనే తొలిసారిగా చేపట్టనున్న నైపుణ్య గణన విధివిధానాలపై అధికారులతో సమీక్షించారు. మంగళగిరిలో చేపట్టిన నైపుణ్యగణన అనుభవాలను పరిగణనలోకి తీసుకొని మరింత అర్థవంతంగా, సులభతరంగా నైపుణ్య గణన చేపట్టాలన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో తాము సొంత నిధులతో శిక్షణ ఇస్తూ ఉద్యోగావకాశాలు సైతం కల్పిస్తున్నామన్నారు. స్థానికంగా యువతకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించినట్లయితే సుమారు 2 లక్షల మంది వరకు విదేశాల్లో ఉద్యోగావకాశాలు కల్పించవచ్చన్నారు. విద్యార్థులకు జర్మన్, జపనీస్ వంటి భాషలను కూడా నేర్పించాలని సూచించారు. సమావేశంలో నైపుణ్యాభివృద్ధి కార్యదర్శి కోన శశిధర్, ఎంపీ గణేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్ల కోసం గుంటూరుకు చెందిన మాదాల శ్రీరామ్ భాస్కర్ రూ.10 లక్షల విరాళం చెక్కును మంత్రి లోకేశ్‌ను కలిసి అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ భాస్కర్‌ను మంత్రి అభినందించారు.

పదవులే కృష్ణయ్య లక్ష్యం

ఏపీ బీసీ వర్గాల్లో తీవ్ర వ్యతిరేకత

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: చంద్రబాబు మార్గదర్శకత్వంలో బీజేపీ రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన ఆర్.కృష్ణయ్య వ్యవహార శైలి ఏపీ బీసీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వైసీపీ రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన తరువాత తెలంగాణ కాంగ్రెస్‌లో చేరడానికి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసేందుకు కృష్ణయ్య ప్రయత్నించారు. అక్కడ ఏదైనా పదవి పొందాలని పరితపించిన ఆయనకు చేదు అనుభవం ఎదురుకావడంతో బీజేపీలో చేరి రాజ్యసభలోకి అడుగుపెట్టారు. కేవలం పదవుల కోసం బీసీలను నిచ్చెనమెట్లుగా వాడుకొని కృష్ణయ్య అనేక పదవులు పొందారు. అంతకుమించి బడుగు వర్గాలకు ఆయన చేసిన సేవలేమీ లేవు. ఆయన అవకాశవాద రాజకీయాలతో బీసీ ఉద్యమానికి ద్రోహం చేశారనే విమర్శ కూడ ఉంది. బీసీల హక్కులు కాపాడుకోవడం కోసమే చట్టసభల్లో అడుగుపెడుతున్నానని చెప్పుకుంటున్న కృష్ణయ్య... వైసీపీ రాజ్యసభ సభ్యునిగా బీసీల కోసం గళమెత్తిన సందర్భమే లేదని బీసీ ఉద్యమకారులు గుర్తుచేస్తున్నారు. బీసీలకు తీరని అన్యాయం చేసినట్లు రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి బీసీ జాతీయ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా చెప్పుకుంటున్న ఆ సంఘానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే రిజిస్ట్రేషన్ అయింది. ఇప్పుడు జాతీయ సంఘానికి అధ్యక్షుడినని ఎలా చెప్పుకుంటారని, దీనికి సమాధానం చెప్పాలని కొందరంటు న్నారు. బీసీల ఉద్యోగుల పదోన్నతుల్లో రిజర్వేషన్లు, బీసీ రిజర్వేషన్లలో క్రిమిలేయర్ తొలగింపుపై రాజకీయ పార్టీలతో మాట్లాడిన సందర్భమే లేదంటున్నారు. బీసీల హక్కులు కాపాడటంలో విఫలమైన కృష్ణయ్య... బీసీలను అడ్డుపెట్టుకొని రాజకీయ పార్టీలతో అంటకాగుతూ తొలిసారిగా 2014లో టీడీపీ ఎల్‌బీ నగర్‌ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తరువాత కాంగ్రెస్‌లో చేరారు. అక్కడ పదవులు లభించక పోవడంతో వైసీపీలో చేరి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆ పార్టీ అధికారం కోల్పోవడంతో రాజ్యసభ సభ్యుడిగా తన మాటకు చెల్లుబాటు కాదని ఆ పార్టీని వదిలి బీజేపీలో చేరి... మళ్లీ రాజ్యసభ సభ్యుడయ్యారు. ఏ రాజకీయపార్టీలో చేరినా ఆయన ఆ పార్టీలకు ఏమాత్రం ఉపయోగ పడటం లేదు. ఆయన రాజకీయ వేత్తా లేక బీసీ ఉద్యమకారుడా అన్న సందేహాన్ని బీసీలు వెలిబుచ్చుతున్నారు. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ బీసీ వర్గాల్లోచిచ్చు పెట్టి గ్రూపులు తయారుచేసిన కృష్ణయ్యకు ఏపీలో పలుకుబడి అంతగా కనిపించలేదు. పోలాకి శ్రీనివాసరావు రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం (651/20)లో చీలిక తీసుకురావడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. బీసీలపై నిజమైన ప్రేమ ఉంటే సంఘాన్ని కూల్చే కుట్రలు చేయరని ఉద్యోగులు అంటున్నారు. విద్యుత్ శాఖలో బీసీ ఉద్యోగుల మద్దతు లేకుండా కొంతమందితో గ్రూపు తయారు చేసి ఇప్పటికీ ఆ సంఘాన్ని చీల్చే కుట్రలు చేస్తూనే ఉన్నారు. ఆ సంఘానికి గౌరవ అధ్యక్షుడిగా ఉన్న ఆయనను ఎప్పుడో తొలగించామని బీసీ ఉద్యోగులు అంటున్నారు. ప్రస్తుతం గౌరవ అధ్యక్షులుగా జంగా కృష్ణమూర్తి, కేశన శంకర్రావు వ్యవహరిస్తున్నారు. ఇకనైనా కృష్ణయ్య గ్రూపు రాజకీయాలు మానుకోవాలని, ఈ విధానాలు బీసీ ఉద్యమానికి ద్రోహం చేస్తున్నాయనే విషయాన్ని ఆయన గ్రహించాలని బీసీ ఉద్యమకారులు, బీసీ ఉద్యోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మద్యం ఏరులై...

పుట్టగొడుగుల్లా బెల్ట్‌షాపులు

విశాలాంధ్ర- ఎటపాక (అల్లూరి జిల్లా): గ్రామీణ ప్రాంతాల్లో బెల్ట్ షాపుల దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. పల్లెల్లో మద్యం ఏరులై పారుతోంది. సీఎం ఆదేశించినా, బెదిరించినా తమకు ధనార్జనే ముఖ్యమనే విధంగా మద్యం వ్యాపారులు వ్యవహరి స్తున్నారు. వైన్స్‌లో దొరకని బీర్లు... బెల్టు షాపుల్లో అందుబాటులో ఉంటున్నాయి. ఇంత జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు దాడులు చేయకపోవడంతో బెల్ట్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా జోరుగా సాగుతోంది. ఆదాయ ఆర్జనే ధ్యేయంగా బెల్ట్ షాపులను విచ్చలవిడిగా నడుపుతూ మద్యం అమ్మకాలను నిర్భీతిగా కొనసాగిస్తున్నారు. ఎటపాక మండలలో రెండు వైన్స్‌షాప్‌లు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో మందుబాబుల అవసరాలను ఆసరాగా చేసుకొని బెల్ట్ షాపుల నిర్వహణకు తెరలేపారని ప్రజలు ఆరోపిస్తున్నారు. నెల్లిపాక, ఎటపాకల్లో 10 నుంచి 20 వరకు బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నట్లు ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు హల్‌చల్ చేస్తున్నాయి. లైసెన్స్ దుకాణాలు నుంచి నేరుగా బెల్టు షాపులకు సరఫరా అవుతోంది. 24 గంటలూ మద్యం అందుబాటులో ఉండడంతో తాగే వారి సంఖ్య పెరిగిపోతోంది. బెల్టు షాపులు ఇళ్ల మధ్యలోనే ఉండడంతో మహిళలు వ్యక్తిగత పనులపై బయటకు వెళ్లేందుకు ఇబ్బందిగా మారిందని గ్రామస్తులు వాపోతున్నారు. మండల వ్యాప్తంగా ప్రతి నెలా బెల్ట్ షాపుల ద్వారా లక్షల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. వైన్స్ యజమానులు, ఎక్సైజ్ పోలీసు అధికారుల అండదండలతో ఉమ్మడి మండలాల్లో బెల్ట్‌షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. మద్యం విక్రయాల ద్వారా పెద్ద ఎత్తున ఆదాయం చేకూరాలని ప్రభుత్వం భావిస్తుండడంతో ఎక్సైజ్ అధికారులు మద్యం వ్యాపారులపై ఒత్తిడి తీసుకువస్తున్న క్రమంలోనే వీరంతా సిండికేట్‌గా మారి ఎక్కువ ధరలకు అనధికారికంగా అమ్ముతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కళ్లెదుటే ఇదంతా జరుగుతున్నా అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారని మహిళలు ధ్వజమెత్తుతున్నారు.

ఛాంపియన్‌గా తమిళనాడు జట్టు

ముగిసిన జాతీయస్థాయి బాలికల వాలీబాల్ టోర్నీ

ద్వితీయ... తృతీయ స్థానాల్లో కర్నాటక, హర్యానా

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్: 68వ స్కూల్ గేమ్స్ అండర్ 19 బాలికల జాతీయ వాలీబాల్ ఛాంపియన్‌షిప్ శుక్రవారం ముగిసింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో స్థానిక పీబీ సిద్ధార్థ కళాశాల మైదానంలో ఐదు రోజుల నుంచి జరుగుతున్న ఈ పోటీల్లో తమిళనాడు బాలికలు ఛాంపియన్లుగా నిలిచారు. శుక్రవారం జరిగిన ఫైనల్స్‌లో తమిళనాడు జట్టు 3-0 సెట్లతో కర్నాటకపై ఘన విజయం సాధించి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. కర్నాటక ద్వితీయ స్థానం పొందింది. డిఫెన్స్ అత్యంత బలంగా ఉన్న కర్నాటక జట్టు తమిళనాడు అఫెన్స్ దెబ్బకు కుదేలయ్యింది. తమిళనాడు జట్టులో భారత జట్టు క్రీడాకారిణులు పవిత్ర, ప్రతిభ, సాధన నెట్‌పై అద్భుతమైన షాట్లు కొట్టి కర్నాటక జట్టుకు కోలుకోలేని దెబ్బ కొట్టారు. మూడు సెట్లలో... రెండో సెట్లో తప్ప కర్నాటక గట్టి పోటీ ఇవ్వలేకపోయింది. తమిళనాడు ఆల్ రౌండ్ ఆటతీరు ప్రదర్శించి సునాయాసంగా 25-11,25-22,25-9 వరుస సెట్లలో గెలిచి టైటిల్‌ను చేజిక్కించుకుంది. తృతీయ స్థానానికి జరిగిన పోటీలో హర్యానా 25-22,26-24,25-13 స్కోరుతో కేరళపై గెలుపొందింది. హర్యానా కూడా విజయం కోసం చెమటోడ్చింది. మొదటి రెండు సెట్లు అతి కష్టంపై గెలుపొందగా, మూడో సెట్‌లో విజృంభించి అద్భుతమైన షాట్లతో కేరళను మట్టికరిపించి... విజయాన్ని అందుకొని తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, రాష్ట్ర స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి.భానుమూర్తి రాజు, వాలీబాల్ అర్జున ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఎ.వి.రమణారావు, శాప్ మాజీ చైర్మన్ పి.అంకమ్మ చౌదరి, సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ వెంకటేశ్వర్లు, రాష్ట్ర స్కూల్ గేమ్స్ సహాయ కార్యదర్శి కె.వి.రాధాకృష్ణ, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వి.రవికాంత్ పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.